www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 22-12-2024 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 247 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి మ. 2.32 తదుపరి అష్టమి; నక్షత్రం: ఉత్తర ఫల్గుణి; వర్జ్యం: మ.2.18-4.06; దుర్ముహూర్తం: సా.4.14-4.58; అమృతఘడియలు: రా.1.04-2.52; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.44; సూర్యాస్తమయం: 5.42 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



పాత ఈవీలపై 18% జీఎస్‌టీ

పాప్‌కార్న్‌పై ఫ్లేవర్ ఆధారంగా పన్ను.. విమాన ఇంధనంపై పన్ను రాష్ట్రాల చేతిలోనే..

జీవిత, ఆరోగ్య బీమాపై జీఎస్‌టీ తగ్గింపు వాయిదా

జీన్ థెరపీకి జీఎస్‌టీ మినహాయింపు

ఫోర్టిఫైడ్ బియ్యంపై 5 శాతం పన్ను

55వ జీఎస్‌టీ మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు



జైసల్మేర్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో శనివారం జరిగిన 55వ జీఎస్‌టీ మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వాడిన లేదా పాత విద్యుత్ వాహనాల (ఈవీ)పై పన్నును 12 శాతం నుంచి 18 శాతానికి పెంచాలని మండలి నిర్ణయించినట్లు సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీతారామన్ వెల్లడించారు. కంపెనీలు కొనుగోలు చేసిన పాత ఈవీలు లేదా విక్రేతలు మోడిఫై చేసి విక్రయించే ఈవీల మార్జిన్ విలువ (కొనుగోలు, విక్రయ ధర మధ్య వ్యత్యాసం)పైనే పన్ను వర్తిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన పాత ఈవీ కొనుగోలు లావాదేవీకి ఎలాంటి పన్ను వర్తించదని కూడా తెలిపారు. ప్రస్తుతం కొత్త ఈవీలపై జీఎస్‌టీ 5 శాతంగా ఉంది. ఈవీయేతర వాహనాల విషయానికొస్తే, వ్యాపారులు విక్రయించే పాత లేదా వాడిన చిన్న పెట్రోల్, డీజిల్ కార్ల మార్జిన్ విలువపై 18 శాతం జీఎస్‌టీ వర్తిస్తుంది.

బీమా..లేదు ఊరట: జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్‌టీ తగ్గించాలన్న ప్రతిపాదనపై మండలి తన నిర్ణయాన్ని వాయిదా వేసింది. బీమా రంగ నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ అభిప్రాయం తెలపాల్సి ఉన్నందున ప్రస్తుతానికి ఈ నిర్ణయాన్ని పక్కన పెట్టినట్లు మంత్రి తెలిపారు.

రేట్ల హేతుబద్ధీకరణపై నివేదిక వాయిదా

జీఎస్‌టీ రేట్లను హేతుబద్ధీకరించేందుకు ఏర్పాటు చేసిన మంత్రుల బృందం (జీఓఎం) తన నివేదికను వాయిదా వేసింది. వాస్తవానికి, జీఓఎం శనివారం మండలికి నివేదిక సమర్పించాల్సి ఉంది. మండలి తదుపరి సమావేశంలో నివేదిక సమర్పిస్తామని జీఓఎం కన్వీనర్, బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి తెలిపారు. పొగాకు ఉత్పత్తులు, శీతల పానీయాలపై 35 శాతం జీఎస్‌టీతో పాటు మొత్తం 148 ఉత్పత్తులపై జీఎస్‌టీ రేట్ల సవరణను ఈ ప్యానెల్ ప్రతిపాదించింది.

పర్యావరణ విపత్తు సెస్సు.. జీఓఎం ఏర్పాటు

పర్యావరణ విపత్తు కారణంగా భారీగా నష్టపోయిన రాష్ట్రాలు జీఎస్‌టీలో భాగంగా ప్రత్యేక సుంకం విధించేందుకు అనుమతించే విషయంపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రుల బృందాన్ని (జీఓఎం) ఏర్పాటు చేయాలని జీఎస్‌టీ మండలి నిర్ణయించింది. పర్యావరణ విపత్తు నష్టాల నుంచి తేరుకునేందుకు విలాస వస్తువులపై 1% సెస్సు విధించేందుకు అనుమతించాలని ఆంధ్రప్రదేశ్ కోరింది. ఈ విషయంపై జీఓఎంను ఏర్పాటు చేసేందుకు ఏపీ మంత్రి పయ్యావుల కేశవులు కూడా అంగీకరించారని మంత్రి నిర్మల తెలిపారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ కూడా ఇందులో భాగస్వాములయ్యేందుకు అంగీకరించినట్లు చెప్పారు. కాగా వరదలతో సంభవించిన నష్టాల కారణంగా వ్యాపార సంస్థల మధ్య జరిగే (బీ2బీ) లావాదేవీలపై ఒక శాతం సెస్సును విధించుకునే అధికారం తెలంగాణకు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జీఎస్‌టీ కౌన్సిల్‌ను కోరారు

మరిన్ని నిర్ణయాలు..

- విమాన ఇంధనం (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్-ఏటీఎఫ్)ను జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చే ప్రతిపాదనపై రాష్ట్రాలు అంగీకరించలేదని మంత్రి వెల్లడించారు. పెట్రోల్, డీజిల్‌తోపాటు ఏటీఎఫ్‌పైనా పన్ను విధింపు అధికారం రాష్ట్రాల చేతుల్లోనే ఉండనుంది.
- స్నాక్ పాప్‌కార్న్‌పై పన్ను విషయంలో మండలి వివరణ ఇచ్చింది. ఉప్పు, మసాలా దినుసులు కలిసిన పాప్‌కార్న్‌ను ప్రస్తుతం నమ్‌కీన్‌గా పరిగణిస్తున్నారు. కాబట్టి ఈ పాప్‌కార్న్ లూజు విక్రయంపై 5 శాతం పన్ను వర్తిస్తుందని.. ప్రీ-ప్యాకేజ్డ్, లేబుల్‌తో విక్రయిస్తే మాత్రం 12 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని మండలి స్పష్టం చేసింది. చక్కెర కలిపిన (క్యారమెలైజ్డ్) పాప్‌కార్న్‌పైన 18 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.
- ప్రజా పంపిణీకి వినియోగించే ఫోర్టిఫైడ్ బియ్యం గింజలపై పన్ను 18% నుంచి 5 శాతానికి తగ్గించాలని మండలి నిర్ణయించింది. జీన్ థెరపీకి జీఎస్‌టీ మినహాయింపునిచ్చింది.
- బ్యాంక్‌లు, ఆర్థిక సేవల సంస్థలు రుణగ్రహీతలపై విధించే పెనాల్టీ చార్జీలపై జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు.
- 50% శాతం ఫ్లైయాష్‌తో కూడిన ఏసీసీ బ్లాక్స్‌పై 12%జీఎస్‌టీ
- రైతు నేరుగా సరఫరా చేసే మిరియాలు, ఎండు ద్రాక్షపై జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు.
- ఎగుమతుల పోటీ సామర్థ్యం పెంచేందుకు మర్చంట్ ఎక్స్‌పోర్టర్లకు సరఫరాపై పరిహార సుంకం 0.1 శాతానికి తగ్గింపు
- నైపుణ్య శిక్షణ భాగస్వాములకు జీఎస్‌టీ మినహాయింపు ప్రతిపాదనకు ఆమోదం. త్వరలోనే అధికారిక ప్రకటన జారీ
- పేమెంట్ అగ్రిగేటర్లకు ఊరట కల్పించేందుకు, రూ.2,000 లోపు డిజిటల్ చెల్లింపుల లావాదేవీలపై జీఎస్‌టీ మినహాయింపు
- స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్స్ డెలివరీ చార్జీలపై పన్ను విధింపు నిర్ణయం వాయిదా



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,450 ▲	71,000 ▲	99,000 ▲
విజయవాడ	78,500 ▲	72,220 ▲	90,000 ▼
విశాఖపట్నం	76,570 ▲	70,190 ▲	88,400 ▲
రాజమండ్రి	77,450 ▲	71,000 ▲	89,700 ▲
ప్రొద్దుటూరు	78,600 ▲	72,780 ▲	90,000 ▲
ముంబై	75,377 ▼	69,045 ▼	85,133 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	580
వరంగల్	572	గోదావరి	580
చిత్తూరు	583	విశాఖపట్నం	590
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	91	విజయవాడ	94
వరంగల్	91	గుంటూరు	97
కరీంనగర్	91	ఒంగోలు	97
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	85
కర్నూలు	91	నెల్లూరు	85
విశాఖపట్నం	98	అనంతపురం	85
గోదావరి	94		

10 ఏళ్ల వరకు కారాగార శిక్ష

అనుమతుల్లేకుండా అప్పు ఇస్తే జైలుకే..



» రూ. కోటి వరకు జరిమానా
» దా'రుణ' యాప్‌లను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త ప్రతిపాదన

న్యూఢిల్లీ: దారుణ యాప్‌ల ఆగడాలకు చెక్ పెట్టడంతో పాటు అధిక వడ్డీకి అప్పులిచ్చే వారిని కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త చట్టం తీసుకురాబోతోంది. అనుమతుల్లేకుండా భౌతికంగా లేదా డిజిటల్ మార్గంలో రుణాలిచ్చే వారికి 10 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.కోటి వరకు జరిమానా విధించేందుకు కొత్త బిల్లును ప్రతిపాదించింది. అనియంత్రిత రుణ వ్యాపార కార్యకలాపాలను అడ్డుకోవడంతోపాటు వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఆర్‌బీఐ వర్కింగ్ గ్రూప్ 2021 నవంబరులో తన నివేదికను సమర్పించింది. అనియంత్రిత రుణ కార్యకలాపాలను నిషేధించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావడంతో పాటు పలు చర్యలను వర్కింగ్ గ్రూప్ సూచించింది. ఆర్‌బీఐ లేదా ఇతర నియంత్రణ మండళ్లతో పాటు ఏదైనా చట్ట ప్రకారంగా రుణ వ్యాపారం కొనసాగించేందుకు అనుమతి లేని వ్యక్తులు లేదా సంస్థలను నిషేధించాలని ప్రభుత్వం ఈ ముసాయిదా బిల్లులో ప్రతిపాదించింది.

నియంత్రిత రుణాలకు సంబంధించిన ఏ చట్టం పరిధిలోకి రాని భౌతిక, డిజిటల్ లేదా ఇతర మార్గాల్లో నిర్వహించే రుణ కార్యకలాపాలను (బంధువులకిచ్చే రుణాలు మినహా) అనియంత్రిత రుణ వ్యాపారంగా బిల్లు నిర్వచించింది. నియమావళికి విరుద్ధంగా రుణాలిచ్చే వారికి కనీసం 2 ఏళ్ల నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల నుంచి రూ.కోటి వరకు జరిమానా విధించనున్నట్లు బిల్లులో ప్రతిపాదించారు. రుణగ్రహీతలను వేధించడం లేదా అనైతిక పద్ధతుల్లో బకాయిల రికవరీకి పాల్పడేవారికి 3 ఏళ్ల నుంచి 10 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించాలని బిల్లులో ప్రతిపాదించారు. అనియంత్రిత రుణదాత, రుణగ్రహీతలు, ప్రాపర్టీలు పలు రాష్ట్రాల్లో లేదా కేంద్ర పాలిత ప్రాంతాల్లో విస్తరించి ఉన్న పక్షంలో లేదా ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించే స్థాయి సొమ్ముకు సంబంధించిన కేసును సీబీఐకి బదిలీ చేయాలని కూడా బిల్లులో ప్రతిపాదించారు. బ్యానింగ్ ఆఫ్ అన్‌రెగ్యులేటెడ్ లెండింగ్ యాక్టివిటీస్ (బీయూఎల్ఏ) పేరుతో రూపొందించిన ఈ ముసాయిదా బిల్లుపై వచ్చే ఏడాది ఫిబ్రవరి 13 నాటికి సూచనలు, అభిప్రాయాలు తెలపాలని ప్రభుత్వం ప్రజలను కోరింది. ఆర్థిక కష్టాల్లో ఉన్న అమాయకులు దారుణ యాప్‌ల వలలో పడి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి రావడం లేదా రుణ యాప్‌ల వేధింపులకు గురై ఆత్మహత్యలకు పాల్పడిన పలు సంఘటనలు అనేకం. దాంతో కేంద్ర ప్రభుత్వం మోసపూరిత రుణ యాప్‌ల ప్రచారాలు లేదా ప్రకటనలు తమ వేదికలో లేకుండా చూడాలని సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌ను గతంలో ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలకు లోబడి గూగుల్ 2022 సెప్టెంబరు నుంచి 2023 ఆగస్టు మధ్య కాలంలో 2,200 మోసపూరిత రుణ యాప్‌లను తన ప్లేస్టోర్ నుంచి తొలగించింది. దేశంలో అక్రమంగా డిపాజిట్ల సమీకరణ కార్యకలాపాలు, పోంజీ స్కీమ్‌లను అడ్డుకునేందుకు కేంద్రం 2019లో అన్‌రెగ్యులేటెడ్ డిపాజిట్ స్కీమ్ యాక్ట్‌ను అమల్లోకి తెచ్చింది.

జీఎస్‌టీ వార్షిక రిటర్నులు..కొన్ని జాగ్రత్తలు !

ఇదీ GST



రాంబాబు గొండాల

గడచిన ఆర్థిక సంవత్సరాని (2023-24)కి సంబంధించి వార్షిక రిటర్నులు జీఎస్‌టీఆర్-9 దాఖలు చేయటానికి చివరి తేదీ 2024 డిసెంబరు 31. ఈ జీఎస్‌టీఆర్-9 అనే రిటర్న్ ఒక ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సమగ్ర రిటర్న్. అంటే ఆ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అమ్మకాలు, కొనుగోళ్లు, తీసుకున్న ఇన్‌పుట్ ట్యాక్స్, చెల్లించిన పన్నులు.. మొదలైన విషయాలను ఈ రిటర్న్ ద్వారా తెలుసుకోవచ్చు. అలాగే సంబంధిత ఆర్థిక సంవత్సరంలో జరిగిన పొరపాట్లను ఈ రిటర్న్ ద్వారా సరి చేసుకోవచ్చు. ఉదాహరణకు, తీసుకోవాల్సిన ఇన్‌పుట్ ట్యాక్స్ కంటే ఎక్కువ తీసుకున్నా, కట్టాల్సిన పన్ను కంటే తక్కువ కట్టినా, రివర్స్ చేయాల్సిన ఇన్‌పుట్ ట్యాక్స్ కంటే తక్కువ చేసినా ఈ రిటర్న్ ద్వారా సవరణ చేసే అవకాశం ఉంది. కాబట్టి ఈ రిటర్న్ దాఖలు చేసినప్పుడు అత్యంత జాగ్రత్త అవసరం.

అలాగే ఈ రిటర్న్‌లో కొన్ని కొన్ని ఫీల్డ్స్ అనేవి ఆ సంవత్సరానికి సంబంధించిన ఇతర రిటర్నులు అంటే జీఎస్‌టీఆర్-3బీ, జీఎస్‌టీఆర్-2ఏ, జీఎస్‌టీఆర్-2బీ నుంచి స్వయంగా కనిపిస్తాయి. దీన్నే 'ఆటో పాపులేట్' అంటారు. అంటే, ఈ ఫీల్డ్స్‌ను సిస్టమ్ ఆటోమేటిక్‌గా నింపుతుంది. ఇకపోతే విగతా ఫీల్డ్స్‌ను స్వయంగా నింపాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆటో పాపులేట్ ఫీల్డ్స్‌కు, మాన్యువల్ ఫీల్డ్స్‌కు మధ్య వ్యత్యాసం లేకుండా చూసుకోవాలి. అయితే ఇటీవలి కాలంలో ఈ జీఎస్‌టీఆర్-9కు సంబంధించి కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి.

ఉదాహరణకు 2022-23 ఆర్థిక సంవత్సరం ఇన్‌పుట్ ట్యాక్స్‌కు సంబంధించిన ఆటో పాపులేట్ అనేది సిస్టమ్.. జీఎస్‌టీఆర్-2ఏ నుంచి తీసుకోగా ఇప్పుడు అదే విషయాలు జీఎస్‌టీఆర్-2బీ నుంచి తీసుకుంటుంది. అలాగే ఇన్‌పుట్ ట్యాక్స్ విషయానికి వస్తే ఇది మూడు రకాలుగా ఉంటుంది. మొదటిది.. ఈ ఆర్థిక సంవత్సరపు క్రెడిట్‌ను ఇదే సంవత్సరం తీసుకోవటం. రెండోది.. గడచిన ఆర్థిక సంవత్సరపు క్రెడిట్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలో తీసుకోవటం, మూడోది.. ఈ ఆర్థిక సంవత్సరం క్రెడిట్‌ను తదుపరి ఆర్థిక సంవత్సరంలో తీసుకోవటం. దీనికి కారణాలు అనేకం.. ఇన్వాయిస్ ఒక ఆర్థిక సంవత్సరంలో వచ్చి సరఫరా తదుపరి ఆర్థిక సంవత్సరంలో వచ్చి ఉండొచ్చు. సరఫరాదారుడు జీఎస్‌టీఆర్-1 ఆలస్యంగా దాఖలు చేయవచ్చు లేదా క్రెడిట్ తీసుకోవటం మర్చిపోవచ్చు. జీఎస్‌టీ నిబంధన ప్రకారం ఒక ఆర్థిక సంవత్సరంలో వచ్చిన ఇన్వాయిస్‌లకు సంబంధించిన క్రెడిట్‌ను తదుపరి ఆర్థిక సంవత్సరం నవంబరు 30 వరకు తీసుకునే వెసులుబాటు ఉంది. కాబట్టి, ఇలా ఒక ఆర్థిక సంవత్సరపు క్రెడిట్ తదుపరి ఆర్థిక సంవత్సరంలో తీసుకోవటం (గడువు లోపు) చట్ట ఉల్లంఘన కానప్పటికీ, తీసుకున్న క్రెడిట్‌కు.. ఆటో పాపులేట్ వివరాలకు మధ్య వ్యత్యాసం ఉండే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జీఎస్‌టీఆర్-9 దాఖలుకు సంబంధించి ఇటీవల కొన్ని సూచనలు (అడ్వైజరీ) విడుదల చేసింది. ఆ వివరాలు...

సరఫరాదారుడు ఇన్వాయిస్ 2023-24లో ఇచ్చి ఆ వివరాలను 2024-25 జీఎస్‌టీఆర్-1లో చూపి ఉంటే, ఈ వివరాలు 2023-24 జీఎస్‌టీఆర్-9లో ఆటో పాపులేట్ కావు. అలాగే దీనికి సంబంధించిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కూడా 2024-25లో తీసుకుని ఉంటారు (ఇన్వాయిస్ 2023-24కు చెందినప్పటికీ). అలాంటప్పుడు ఈ క్రెడిట్‌కు సంబంధించిన విషయాలను జీఎస్‌టీఆర్-9లోని టేబుల్ 8ఏ, 13లో చూపాలి.

అలాగే కొనుగోలు 2023-24లో జరిగి సంబంధించిన వివరాలు జీఎస్‌టీఆర్-2బీలో కనిపించినప్పటికీ, సరఫరా అనేది 2024-25లో పొంది ఉండవచ్చు. ఇలాంటప్పుడు ఈ వివరాలు 2023-24 జీఎస్‌టీఆర్-9లో ఆటో పాపులేట్ అయినప్పటికీ క్రెడిట్‌ను 2024-25లో తీసుకోవాల్సి ఉంటుంది. ఈ వివరాలను కూడా టేబుల్ 8ఏ, 13లో చూపాలి.

అలాగే 2023-24లో క్రెడిట్ రివర్స్ చేసి తిరిగి 2024-25లో తీసుకుని ఉంటే.. అంటే రీక్లెయిమ్ చేసి ఉంటే ఆ వివరాలను టేబుల్ 6హెచ్‌లో చూపాలి.

పైన చెప్పినవి కొన్ని ముఖ్య సూచనలు అయినప్పటికీ, ముందు చెప్పినట్లు జీఎస్‌టీఆర్-9 రిటర్న్ చాలా ముఖ్యమైన రిటర్న్ కాబట్టి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్



మ. 1.30 నుంచి స్పోర్ట్స్ 18లో..

జోరు కొనసాగాలి!

విండీస్‌తో భారత్ తొలి వన్డే నేడు



హేలీ మాథ్యూస్

వడోదర: ఐదేళ్ల తర్వాత స్వదేశంలో టీ20 సిరీస్ విజయంతో భారత మహిళల జట్టు జోష్‌లో ఉంది. ఈనేపథ్యంలో వెస్టిండీస్‌తో మరో పోరుకు సిద్ధమైంది. ఆదివారం నుంచి ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ జరగనుంది. వడోదరలో కొత్తగా నిర్మించిన కోటంబి స్టేడియంలో ఆదివారం జరిగే ఈ వన్డేనే తొలి అంతర్జాతీయ మ్యాచ్. ఓవరాల్‌గా ఇరుజట్ల మధ్య 26 మ్యాచ్‌లు జరగ్గా భారత్ 21-05తో ఆధిక్యంలో ఉంది. ఈనెల ఆరంభంలో ఆస్ట్రేలియా చేతిలో చిత్తుగా ఓడిన తర్వాత హర్మన్‌ప్రీత్ సేన విండీస్‌పై టీ20ల్లో చెలరేగి ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసుకుంది. ఓపెనర్ స్మృతి మంధాన భీకర ఫామ్‌లో ఉంది. వరుసగా మూడు అర్ధసెంచరీలతో సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించింది. దీనికితోడు తన చివరి 10 వన్డేల్లోనూ తను 599 పరుగులతో రాణించడం సానుకూలాంశం కానుంది. ఇదే జోరు తాజా సిరీస్‌లోనూ కొనసాగిస్తే భారత్‌కు మరో సిరీస్ ఖాయమే. చివరి రెండు టీ20లకు కెప్టెన్ హర్మన్ గాయంతో దూరం కాగా, మంధాన నాయకత్వంలోనూ ఆకట్టుకోగలిగింది. మరోవైపు హర్మన్ ఫిట్‌నెస్‌పై స్పష్టత రావాల్సి ఉంది. దీప్తి, రేణుక సైమా, టిటాస్ సాధులతో బౌలింగ్ విభాగం పటిష్ఠంగానే కనిపిస్తోంది. మరోవైపు విండీస్ ఆశలన్నీ కెప్టెన్ హేలీ మాథ్యూస్, వెటరన్ డియాంద్రా, క్యాంప్‌బెల్ ఆటపైనే ఆధారపడి ఉన్నాయి.



ప్రణవి, ముకేష్ డబుల్ ధమాకా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్ర షూటర్లు ప్రణవి, ముకేష్ ద్వయం రెండు రజత పతకాలు సొంతం చేసుకుంది. శనివారం న్యూఢిల్లీలో జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగం సీనియర్, జూనియర్ కేటగిరీల్లో ప్రణవి (ఒంగోలు), ముకేష్ (గుంటూరు) జోడీ ఈ పతకాలను సొంతం చేసుకుంది. సీనియర్ విభాగంలో ప్రణవి-ముకేష్ ద్వయం 577 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. జూనియర్ విభాగంలో ఈ జోడీ 576 పాయింట్లతో రజతంతో మెరిసింది.

విరాట్ పబ్‌కు నోటీసులు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించారంటూ.. కోహ్లీకి చెందిన 'వన్8 కమ్యూన్' పబ్‌కు బెంగళూరు నగరపాలక సంస్థ (బీబీఎంపీ) నోటీసులు జారీ చేసింది. చిన్నస్వామి స్టేడియం దగ్గరల్లోని రత్నం కాంప్లెక్స్ ఆరో అంతస్థులో ఈ పబ్ కమ్ రెస్టారెంట్ ఉంది. అయితే, ఫైర్ సేఫ్టీ విభాగం నుంచి ఎన్‌వోసీ తీసుకోకుండానే పబ్‌ను నడుపుతున్నారంటూ సామాజిక కార్యకర్త ఒకరు ఫిర్యాదు చేశారు. దీనిపై నోటీసులిచ్చినా పబ్ యాజమాన్యం స్పందించలేదు. దీంతో తాజాగా బీబీఎంపీ మరోసారి నోటీసులు జారీ చేసింది. వారం రోజులలోపు వివరణ ఇవ్వకపోతే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించింది.

ఊతప్పపై అరెస్ట్ వారెంట్

బెంగళూరు: భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్పపై అరెస్ట్ వారెంట్ జారీ అయ్యింది. తన కంపెనీలో పనిచేసే ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) డబ్బులు జమ చేయకుండా మోసం చేసినట్టు అతడిపై ఆరోపణలు వచ్చాయి. దీంతో రాబిన్‌పై ఈనెల నాలుగునే అరెస్ట్ వారెంట్ జారీ అయింది. బెంగళూరుకు చెందిన సెంటారస్ లైఫ్‌స్టయిల్ బ్రాండ్స్‌కు 39 ఏళ్ల రాబిన్ డైరెక్టర్‌గా ఉన్నాడు. తన సంస్థలో పనిచేసే ఉద్యోగుల జీతాల నుంచి రూ. 23.36 లక్షలు మినహాయించినా, అవి వారి పీఎఫ్ ఖాతాల్లో జమ చేయలేదు. దీంతో రీజినల్ పీఎఫ్ కమిషనర్ గోపాల్ రెడ్డి అతడికి నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో రాబిన్‌పై వారెంట్ జారీ కావడమే కాకుండా, ఈనెల 27లోగా వారికివ్వాల్సిన మొత్తాన్ని పీఎఫ్ ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో అరెస్ట్ తప్పదని హెచ్చరించారు.



కప్పు ఎవరిదో?

- బంగ్లాదేశ్‌తో భారత్ ఫైనల్ నేడు
- అండర్-19 టీ20 ఆసియాకప్

రాత్రి 7 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

మూడోస్థానానికి ఢిల్లీ

పుణె: ప్రొ కబడ్డీ లీగ్‌లో దబాంగ్ ఢిల్లీ టాప్-2 అవకాశాలను మరింతగా మెరుగుపర్చుకొంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 33-31తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలిచింది. ఢిల్లీ రైడర్ అషు మాలిక్ 12 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రెండు జట్లూ ఈపాటికే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించగా.. ఈ విజయంతో ఢిల్లీ మూడో స్థానానికి ఎగబాకింది. కాగా, పట్నా పైరేట్స్, గుజరాత్ జెయింట్స్ మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్ 40-40తో టైగా ముగిసింది. పట్నా రైడర్ దేవాంక్ సూపర్-10 సాధించాడు.

అంతా అగమ్యగోచరంగా ఉంది

అశ్విన్ భార్య భావోద్వేగం



చెన్నై: అంతర్జాతీయ క్రికెట్‌కు అశ్విన్ వీడ్కోలు పలకడంపై అతడి భార్య ప్రీతి భావోద్వేగంతో స్పందించింది. 'గత రెండు రోజులుగా ఏమీ అర్థం కాకుండా అంతా అగమ్యగోచరంగా ఉంది. అసలేం మాట్లాడాలో కూడా తెలియడం లేదు. గత 13-14 ఏళ్లుగా ఎన్నో అనుభవాలు చవిచూశాం. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్, ఎంసీజీలో విజయం, సిడ్నీ టెస్టు డ్రా, గాబాలో వీరోచిత విజయంతో పాటు టీ20ల్లో పునరాగమనం వల్ల మేం పొందిన ఆనందం అనిర్వచనీయం. నాకు క్రికెట్‌ను పరిచయం చేసింది నువ్వే. ఈ ఆట పట్ల ప్రేమను కలిగించావు. ఇక నీకిష్టమైన రీతిలో కొత్త జీవితాన్ని గడుపు' అని అశ్విన్‌కు సూచించింది.

'బాక్సింగ్ డే'కు సన్నాహాలు

ప్రాక్టీస్ ప్రారంభించిన టీమిండియా



మెల్‌బోర్న్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌లో కీలకమైన బాక్సింగ్ డే టెస్ట్‌కు వేళవుతోంది. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్-ఆస్ట్రేలియా ప్రస్తుతం 1-1తో సమంగా ఉన్న సంగతి తెలిసిందే. దాంతో ఈనెల 26న మొదలయ్యే నాలుగో టెస్ట్ ఇరు జట్లకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. వచ్చే గురువారం నుంచి జరిగే ఈ టెస్ట్‌కు భారత జట్టు సన్నాహకాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా శనివారం సాధన మొదలు పెట్టింది. ముఖ్యంగా బౌలర్లు నెట్స్‌లో తీవ్రంగా శ్రమించారు. పేస్ దళపతి బుమ్రా, సిరాజ్, హర్షిత్ రాణా, నితీశ్ కుమార్, ఆకాశ్ దీప్, జడేజా, వాషింగ్టన్ సుందర్ నెట్స్‌లో సుదీర్ఘ సమయం గడిపారు. 'కష్టపడడానికి ఎలాంటి ప్రత్యామ్నాయాలుండవు. బాక్సింగ్ డే టెస్ట్‌కు భారత బౌలర్లు అన్ని విధాలా సిద్ధమవుతున్నారు' అని బౌలర్ల సాధన వీడియోను విడుదలజేస్తూ బీసీసీఐ పేర్కొంది.

రాహుల్‌కు గాయం ?

బౌలర్లతోపాటు బ్యాటర్లు కూడా సాధనలో పాల్గొన్నారు. అయితే బ్యాటింగ్ ప్రాక్టీస్ అనంతరం ఓపెనర్ కేఎల్ రాహుల్ చేతికి ఫిజియో చికిత్స చేయడం కనిపించింది. దాంతో రాహుల్ గాయపడ్డాడనే ఆందోళన వ్యక్తమైంది. టెస్ట్‌కు మరో నాలుగు రోజుల సమయం ఉండడంతో అప్పటికల్లా కోలుకుంటాడని భావిస్తున్నారు.

ఎంసీజీలో 'బ్లూస్టాండ్' అలజడి

లక్ష మంది సామర్థ్యం కలిగిన మెల్‌బోర్న్ స్టేడియంలో నాలుగో టెస్ట్‌కు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా స్టేడియంలోని 'బ్లూస్టాండ్' వద్ద పెద్ద సంఖ్యలో భద్రతా సిబ్బందిని మోహరిస్తున్నారు. ఆ స్టాండ్‌లో ఉండే అభిమానులు మద్యం సేవించి విపరీతంగా ప్రవరిస్తుంటారట. ప్రత్యర్థి జట్టు ఏకాగ్రతను దెబ్బతీసేందుకు వాళ్లు చేయాల్సిందంతా చేస్తారని మెల్‌బోర్న్ గ్రౌండ్ భద్రతా సిబ్బంది ఒకరు చెప్పాడు. షేన్ వార్న్ ఎండ్‌వైపు ఉండే ఆ బ్లూస్టాండ్‌లో ఆరు బ్లాకులుంటాయి. బాక్సింగ్ డే టెస్ట్..తొలి రోజు ఆటకు లక్షకు..లక్ష టిక్కెట్లు అమ్ముడుపోయాయి. దీంతో బ్లూస్టాండు కూడా పూర్తిగా నిండిపోతుందని, అందులో ఫ్యాన్స్ ప్రవర్తన చాలా దూకుడుగా ఉంటుందని ఆ భద్రతా సిబ్బంది తెలిపాడు. సాధారణంగా మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరిగే మ్యాచ్‌లకు బౌండరీ లైన్ వద్ద 10 మంది గార్డులను నియమిస్తారు. అయితే ఈ నాలుగో టెస్ట్‌కు మాత్రం 15 మందిని ఏర్పాటు చేస్తున్నారని అతడు చెప్పాడు.

సచిన్ రికార్డుపై కోహ్లీ గురి

అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటికే ఎన్నో రికార్డుల్ని తన పేరిట లిఖించుకున్న కోహ్లీ..సచిన్ మరో రికార్డుకు చేరువయ్యాడు. ఆస్ట్రేలియాపై మెల్‌బోర్న్ గ్రౌండ్‌లో 449 రన్స్‌తో..అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్ రికార్డు టెండూల్కర్ పేరిట ఉంది. ఇక ఇప్పటి వరకు మూడు టెస్ట్‌ల్లో 316 పరుగులు చేసిన కోహ్లీ..సచిన్ రికార్డుకు 133 పరుగుల దూరంలో ఉన్నాడు.

ఆసీస్ మీడియా అతి



భారత జట్టు ఎంసీజీలో శనివారం సాధన చేసింది. ఆ సందర్భంగా భారత్ నుంచి వెళ్లిన మీడియా ప్రతినిధులతో జడేజా ప్రత్యేకంగా మాట్లాడుతున్నాడు. ఈక్రమంలో స్టేడియంలో ఉన్న కొందరు ఆస్ట్రేలియా విలేకరులు జడేజా వద్దకు వచ్చారు. కేవలం భారత మీడియా కోసమే ఆ సమావేశమని, ఇతర జర్నలిస్టులకు కాదని జట్టు మీడియా మేనేజర్ చెప్పినా వినలేదు. భారత విలేకరుల ప్రశ్నలకు హిందీలో బదులిచ్చిన జడేజా.. సమయం అయిపోవడంతో అక్కడ నుంచి వెనుదిరిగాడు. కానీ ఆస్ట్రేలియా మీడియా ప్రతినిధులు..జడేజా తమ ప్రశ్నలకు ఇంగ్లిష్‌లో సమాధానమివ్వలేదంటూ గొడవ చేశారు.



అన్‌మోల్ రికార్డు సెంచరీ

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో అన్‌సోల్డ్‌గా మిగిలిన పంజాబ్ బ్యాటర్ అన్‌మోల్ ప్రీత్ సింగ్ (45 బంతుల్లో 12 ఫోర్లు, 9 సిక్స్‌లతో 115 నాటౌట్) లిస్ట్-ఎ క్రికెట్‌లో వేగవంతమైన శతకం బాదిన తొలి భారత బ్యాటర్‌గా, ఓవరాల్‌గా మూడో ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. విజయ్ హజారే ట్రోఫీ గ్రూప్-సిలో శనివారం అరుణాచల్‌ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో అన్‌మోల్ 35 బంతుల్లోనే సెంచరీతో చెలరేగడంతో.. పంజాబ్ 9 వికెట్ల తేడాతో బోణీ చేసింది. కాగా, మాజీ ఆల్‌రౌండర్ యూసుఫ్ పఠాన్ (40 బంతుల్లో 100) రికార్డును అన్‌మోల్ బద్దలుకొట్టాడు. 2009-10 సీజన్‌లో మహారాష్ట్రతో మ్యాచ్‌లో బరోడా తరఫున యూసుఫ్ ఈ ఫీట్ సాధించాడు. మొత్తంగా లిస్ట్-ఎ క్రికెట్‌లో ఆస్ట్రేలియా ఆటగాడు జాక్ ఫ్రేజర్ (29 బంతుల్లో), దక్షిణాఫ్రికా దిగ్గజం డివిల్లీర్స్ (31 బంతుల్లో) టాప్-2లో ఉన్నారు. కాగా, అన్‌మోల్ విరుచుకుపడడంతో.. అరుణాచల్ నిర్దేశించిన 165 పరుగుల లక్ష్యాన్ని పంజాబ్ 12.5 ఓవర్లలో వికెట్ కోల్పోయి ఛేదించింది.

శతక్కొట్టిన అవనీష్.. హైదరాబాద్ బోణీ

అహ్మదాబాద్: అవనీష్ (100) శతకంతో విజృంభించడంతో.. విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ బోణీ చేసింది. గ్రూప్-సిలో శనివారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ 42 పరుగుల తేడాతో నాగాలాండ్‌పై గెలిచింది. తొలుత హైదరాబాద్ 48.1 ఓవర్లలో 276 పరుగులకు ఆలౌటైంది. వరుణ్ గౌడ్ (57), తన్మయ్ అగర్వాల్ (51) హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. లిమ్లివటి లెమ్‌టూర్ 4, జొనాథన్ 3 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో నాగాలాండ్ ఓవర్లన్నీ ఆడి 234/8 స్కోరు మాత్రమే చేసింది. యుగంధర్ (80), సుచిత్ (66) అర్ధ శతకాలు వృథా అయ్యాయి. నిశాంత్, ముదస్సర్ చెరో 2 వికెట్లు కూల్చారు.

అఫ్ఘాన్‌దే వన్డే సిరీస్

హరారే: జింబాబ్వేతో జరిగిన మూడో వన్డేలో అఫ్ఘానిస్థాన్ 8 వికెట్లతో గెలిచింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను అఫ్ఘాన్ 2-0తో దక్కించుకుంది. తొలి మ్యాచ్ వర్షంతో రద్దయ్యింది. ముందుగా జింబాబ్వే 30.1 ఓవర్లలో 127 పరుగులకే పరిమితమైంది. షాన్ విలియమ్స్ (60) రాణించాడు. 18 ఏళ్ల ఆఫ్ స్పిన్నర్ ఘజన్‌ఫర్ 5 వికెట్లతో ఆకట్టుకోగా రషీద్‌కు 3 వికెట్లు దక్కాయి. ఛేదనలో అఫ్ఘాన్ 26.5 ఓవర్లలో 2 వికెట్లకు 131 పరుగులు చేసి నెగ్గింది. ఓపెనర్ సెడికుల్లా అటల్ (52) అర్ధసెంచరీ సాధించాడు.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 22-12-2024 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 247 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ

చైర్ కాదు ఫైర్

సినిమా హీరో అల్లు అర్జున్‌ను అనూహ్యంగా అరెస్టు చేయించడం, ఇప్పుడు మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు పెట్టించడం ద్వారా తాను ఏమిటో చెప్పకనే చెప్పారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. 'సీఎం అంటే కేవలం కుర్చీ కాదు.. ఫైర్ అని రేవంత్ రెడ్డి రుజువు చేస్తున్నారు.

అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడం చిత్ర పరిశ్రమలోనే కాదు.. సమాజంలోని పై వర్గాల్లోనూ ప్రకంపనలు సృష్టించింది. మహిళ మృతికి అల్లు అర్జున్ ప్రత్యక్ష కారణం కాకపోయినప్పటికీ, అంటే కుట్ర పూరిత ఉద్దేశంతో వ్యవహరించనప్పటికీ కేసులో చిక్కుకున్నారు. దీంతో అల్లు అర్జున్ అరెస్టుకు మరేదన్నా కారణం ఉందా? అని ప్రజలు ఆరా తీయడం మొదలుపెట్టారు. పుష్ప-2 ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అల్లు అర్జున్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పేరు మర్చిపోయారు. ఏడాదిగా సీఎంగా ఉన్న రేవంత్ పేరును అల్లు అర్జున్ మర్చిపోవడాన్ని నెటిజన్లు సైతం హర్షించలేదు.

రాజకీయాలలో ఉన్న వారు పార్టీలు వేరైనా వ్యక్తిగత సంబంధాలను వదులుకొనేవారు కారు. ఇప్పుడు ఆ పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఆ కుటుంబం మొత్తం రేవంత్ రెడ్డిని ఈసడించుకొనే వారు. రేవంత్ కూడా ఎక్కడా తగ్గకుండా తన నోటికి పని చెప్పేవారు. దీంతో ఇరు పక్షాల మధ్య వ్యక్తిగత వైషమ్యాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఫార్ములా-ఈ కేసు వ్యవహారం రేవంత్ చేతికి చిక్కింది. గత ప్రభుత్వాల హయాంలో ఇటు తెలంగాణ, అటు ఏపీలో కూడా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. దాని పర్యవసానాల్ని ఇప్పుడు అనుభవిస్తున్నారు.

తెలంగాణ సమాజం ఇప్పటిదాకా చూసిన రేవంత్ వేరు.. ముఖ్యమంత్రిగా రేవంత్ వేరుగా ఉంటారని నేను గతంలోనే చెప్పాను. రేవంత్ బయటకు కనిపించినంత ఆషామాషీగా ఉండరు. ఆయన చాలా లోతైన మనిషి. కాంగ్రెస్ పార్టీ అంటేనే ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తుంటారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రేవంత్ ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి పార్టీ నాయకులు ఒక్క తాటిపై ఉంటున్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ తీసుకొనే నిర్ణయాలను బాహాటంగా ఎవరూ తప్పుపట్టడం లేదు.

రాజకీయ ప్రత్యర్థుల కట్టడికి ఏవి ఎ చేయబోతున్నదీ బయటకు పొక్కకుండా రేవంత్ గుంబనంగా వ్యవహరిస్తున్నారు. ఔటర్ రింగు రోడ్డు వ్యవహారంపై సిట్ దర్యాప్తునకు ఆదేశిస్తున్నట్టు శుక్రవారంనాడు ఆయన ఉన్నపళంగా ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో నిర్ణయాలు ఇంత గోప్యంగా తీసుకోవడం అసాధారణం. కేసీఆర్ కుటుంబ సభ్యులను కేసులలో ఇరికించుకుంటూ పోతే భారత రాష్ట్ర సమితి క్రమేపీ బలహీనపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం కావచ్చు.



కొత్త పలుకు

బొగ్గు నిక్షేపాలకు దూరంగా నల్లగొండ జిల్లాలో యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందని ఈ అంశంపై విచారణ జరిపిన కమిషన్ నిర్ధారించింది. దీంతో ఈ నిర్ణయం తీసుకున్న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మెడపైనా కత్తి వేలాడుతోంది. తమ అధినాయకులపై వరుస కేసులు పెట్టి వేధిస్తూ పోతే తమకే మేలు జరుగుతుందని బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు భావిస్తున్నారు. అందుకే కేటీఆర్‌ను తొందరగా అరెస్టు చేయాలని వారు కోరుకుంటున్నారు. అయితే కేసీఆర్‌ను జైలుకు పంపితేనే ప్రజల్లో సానుభూతి ఏర్పడుతుందని క్షేత్ర స్థాయి సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

కేటీఆర్‌ను అరెస్టు చేసి జైల్లో పెట్టినా పెద్దగా సానుభూతి లభించకపోవచ్చు. ఎందుకంటే అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్, కవిత విపరీతమైన అధికార దర్పాన్ని ప్రదర్శించేవారు. ఈ ధోరణిని తెలంగాణ సమాజంతో పాటు పార్టీ శ్రేణులు కూడా జీర్ణించుకోలేకపోయారు. కేసీఆర్ కూడా అహంభావం ప్రదర్శించినప్పటికీ తెలంగాణ రాష్ట్రం సాధించిన నేతగా ప్రజల్లో ఆయన పట్ల ఇప్పటికీ సానుకూలత ఉంది. ఈ కారణంగా కేసీఆర్‌ను టచ్ చేస్తే మాత్రం ప్రజల్లో సానుభూతి ఏర్పడుతుంది.

4

తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చిన నాటి నుంచే కేసీఆర్‌కు దరిద్రం పట్టుకున్నట్టుగా ఉంది. అధికారం కోల్పోయారు. కన్నబిడ్డలు జైలు పాలవుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. తాను కక్ష కట్టి జైల్లో పెట్టించిన రేవంత్ రెడ్డి చేతిలో వరుస పరాభవాలను ఎదుర్కోవలసి రావడాన్ని మించిన విషాదం కేసీఆర్ జీవితంలో మరేమి ఉంటుంది?

రేవంత్ రెడ్డిని తక్కువగా అంచనా వేసి కష్టాలను కొని తెచ్చుకున్నారు. కేటీఆర్‌ను జైలుకు పంపడంతో లెక్క సరిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్ సంతృప్తి చెందుతారా? తాను జైలుకు వెళ్లాల్సి రావడానికి ప్రధాన కారకుడైన కేసీఆర్‌ను కూడా అరెస్టు చేయించే వరకు వెనకడుగు వేయరా? అన్నదీ వేచి చూడాలి.

మానవత్వం లేదా?

హీరో ఇంటికి క్యూ కట్టిన సినీ ప్రముఖులు..

బాధిత కుటుంబాన్ని పరామర్శించలేదేం!

- హీరో, నిర్మాత.. ఎవరూ పిల్లాడి దగ్గరకు పోలేదు
- పోలీసులు రావద్దని చెప్పినా థియేటర్‌కు హీరో
- అభిమానులు తోసుకొచ్చారు.. బాడీ గార్డ్స్ నెట్టారు
- తొక్కిసలాటలో మహిళ మృతి.. కోమాలో బాలుడు
- అయినా థియేటర్ నుంచి వెళ్లేందుకు హీరో ససేమిరా
- అరెస్టు చేస్తామని హెచ్చరించి డీసీపీ పంపించారు
- మానవత్వం లేని ఇలాంటి వాళ్లను అరెస్టు చేస్తే..
- నీచమైన భాషతో ప్రభుత్వాన్ని బద్నాం చేసే యత్నం
- పదేళ్లు మంత్రిగా పనిచేసిన వ్యక్తి
- సోషల్ మీడియాలో అడ్డగోలుగా పోస్టులు పెట్టారు
- ప్రాణాలు పోయినా ఏమీ అనొద్దనడం న్యాయమా?
- సినిమాలు తీసుకోండి.. వ్యాపారం చేసుకోండి..
- ప్రాణాలు పోతే మాత్రం ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు
- సినీ పరిశ్రమకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక

తొక్కిసలాటలో రేవతి చనిపోయారు. ఆమె కుమారుడికి ఆక్సిజన్ అందక బ్రెయిన్ డ్యామేజ్ అయింది. అంత తొక్కిసలాటలో కూడా ఆ తల్లి కొడుకు చేయి విడిచిపెట్టలేదు. కొడుకు చేయి పట్టుకుని ఆ తల్లి చనిపోయింది. హీరోను అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు చెప్పారు. అయినా, వినలేదు. సినిమా మొత్తం అయిపోయిన తర్వాతే వెళ్తానన్నారు. దీంతో డీసీపీ వెళ్లి ఇక్కడి నుంచి కదలకపోతే అరెస్టు చేస్తామని హెచ్చరించి హీరోను పంపించారు. - సీఎం రేవంత్



హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): "ఒక్కపూట జైలుకు వెళ్లి వచ్చిన హీరో ఇంటికి సినీ ప్రముఖులంతా క్యూ కట్టారు. ఆయనకు ప్రమాదం జరిగిందా? ఏమైనా జబ్బు పడ్డారా? హీరోను పరామర్శించేందుకు క్యూ కట్టిన సినీ ప్రముఖుల్లో ఒక్కరైనా బాధిత కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదు!? సినిమా చూడటానికి వెళ్లిన కుటుంబంలో మహిళ చనిపోతే 11వ రోజు వరకు హీరో, నిర్మాత ఎవరూ వారిని పరామర్శించలేదు. కనీసం ఆస్పత్రిలో ఉన్న ఆ పిల్లాడి దగ్గరకు పోలేదు. ఇది ఏ రకమైన మానవత్వం!?" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలదీశారు. కనీసం వారిని పరామర్శించాలన్న మానవత్వం కూడా సినిమా పరిశ్రమకు లేదా!? అని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలు పోయే సంఘటనలు జరుగుతాయంటే సినీ పరిశ్రమకు ప్రత్యేక రాయితీలు కల్పించబోమని హెచ్చరించారు. ప్రజలను ఇబ్బంది పెట్టే వారిని తమ సర్కారు వదిలిపెట్టబోదని తేల్చి చెప్పారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో అసలు ఏం జరిగిందో ప్రభుత్వం ఒక ప్రకటన చేయాలని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ కోరారు. దాంతో, సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. ఈ ఘటనపై విపక్షాలు, సినీ ఇండస్ట్రీ వ్యవహరించిన తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈనెల 4న పుష్ప-2 సినిమా విడుదలవుతుందని, ఆ రోజు చిత్ర యూనిట్ సభ్యులు, హీరో, హీరోయిన్ వస్తున్నారని, బందోబస్తు కావాలంటూ ఈనెల 2న సంధ్య థియేటర్ యాజమాన్యం చిక్కడపల్లి పోలీసు స్టేషన్లో దరఖాస్తు పెట్టుకుంది. దాంతో, ఆ థియేటర్ పరిసరాల్లో పది వరకు సినిమా హాళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయని, ఎంట్రీ, ఎగ్జిట్ ఒక్కటేనని, సెలబ్రిటీలు వస్తే జనాన్ని అదుపు చేయడం కష్టమని, బందోబస్తు ఇవ్వడం కుదరదని మూడో తేదీనే చిక్కడపల్లి పోలీసులు రాతపూర్వకంగా జవాబిచ్చారు. దరఖాస్తును తిరస్కరిస్తున్నట్టు అందులో చెప్పారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా పుష్ప సినిమా హీరో థియేటర్‌కు

మిగతా 12వ పేజీలో...

ఇక బెనిఫిట్ షోలు, టికెట్ పెంపులు బంద్: కోమటిరెడ్డి

రాష్ట్రాన్ని అమ్మేశారు!

- ఔటర్.. కోకాపేట భూములే కాదు.. వైన్ షాపులు కూడా..
- ఏకంగా 11.50% మిత్తితో అప్పులు తెచ్చారు
- హామీల అమలు ఆలస్యానికి ఈ పాపాల భైరవులే కారణం
- ఇలాంటి వారిని ఉరి తీసినా తప్పు లేదు
- లక్షల కోట్ల అప్పులు చేసి కట్టింది కూలేశ్వరమే
- అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై ముఖ్యమంత్రి రేవంత్ నిప్పులు

13



విలేకరులతో మాట్లాడుతున్న అల్లు అర్జున్. చిత్రంలో అల్లు అరవింద్

నాపై తప్పుడు ఆరోపణలు!

- అవాస్తవాలతో నా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు
- నేను అక్కడ ఎలాంటి రోడ్ షో, ఊరేగింపూ చేయలేదు
- అభిమానులకు థాంక్యూ చెప్పేందుకే కారులోంచి చేతులూపా
- థియేటర్ నుంచి బయటకెళ్లాలని పోలీసులు నాకు చెప్పలేదు
- థియేటర్ సిబ్బంది చెప్పగానే అక్కడి నుంచి బయటికొచ్చేశాను
- జరిగిన ఘోరం గురించి మరుసటిరోజు తెలిసి షాక్ అయ్యాను
- నేను ఆస్పత్రికి వెళ్దామనుకున్నా లీగల్ టీమ్ వద్దని వారించింది
- నాకు శ్రీతేజ్ వయసున్న కొడుకున్నాడు.. నేనెందుకు బాధపడను?
- బాధిత కుటుంబానికి అండగా ఉంటా.. మీడియాతో అల్లు అర్జున్

హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటకు కారణం అల్లు అర్జునేనని.. ఘటన జరిగిన తర్వాత సినీ ప్రముఖులు ఎవరూ బాధితులను పరామర్శించలేదని.. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో అల్లు అర్జున్ శనివారం అత్యవసర మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి పేరు ప్రస్తావించకుండా.. జరిగిన ఘటనపై వివరణ ఇచ్చారు. తనపై తప్పుడు ఆరోపణలు ప్రచారం చేస్తున్నారని.. తన వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇది చాలా దురదృష్టకరమైన సంఘటన. ఇందులో ఎవరి తప్పూ లేదు. ఇలా జరిగినందుకు బాధిత కుటుంబానికి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్తున్నాను. వారికి జరిగిన నష్టానికి నా ప్రగాఢ సంతాపం. శ్రీతేజ్ అతి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. వారికి జరిగిన నష్టం పట్ల నా మనసంతా బాధతో నిండిపోయింది" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సినిమా వాడిగా ప్రేక్షకులకు వినోదాన్ని అందించడమే ముఖ్య కర్తవ్యంగా భావిస్తానని ఆయన తెలిపారు. "మిమ్మల్ని నవ్విస్తూ ఉంచాలనుకుంటాను. మీ మనసుల్ని గెలిచి థియేటర్ నుంచి బయటకు పంపిద్దామనుకుంటాను. నాకు థియేటర్ ఒక గుడిలాంటిది. అలాంటి చోట

మిగతా 12వ పేజీలో...



టోల్ రుసుము శాశ్వతం కాదు

- నిరంతరం వసూళ్లంటే నిరంకుశత్వమే
- ప్రాజెక్టులు ప్రజల ప్రయోజనం కోసం..
- ప్రైవేటు వ్యక్తుల ఆర్జనల కోసం కాదు
- లాభాలొచ్చినా ఇంకా రుసుములేంటి?
- అధికార్లు నిజాయితీగా ఉండాలి: సుప్రీం
- నోయిడా ఫ్లై వేపై టోల్ రద్దుకు సమర్థన

న్యూఢిల్లీ, డిసెంబరు 21: మౌలిక వసతుల ప్రాజెక్టుల అమల్లో అధికారులు నిజాయితీగా వ్యవహరించాలని నొక్కి చెబుతూ సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. టోల్ రుసుము వసూలు శాశ్వత ప్రక్రియ ఏమీ కాదని స్పష్టం చేసింది. దాన్ని నిరంతరం వసూలు చేస్తామంటే అది నిరంకుశత్వం కిందకే వస్తుందని తెలిపింది. ఈ ప్రాజెక్టులు ప్రజా ప్రయోజనానికి ఉద్దేశించినవే తప్ప ప్రైవేటు సంస్థలు లాభాలు

మిగతా 14వ పేజీలో...

సాగు చేస్తేనే భరోసా



జనవరి నుంచే పెట్టుబడి సాయం

- సాగు చేయనివారికి గత ప్రభుత్వం రూ.21,283 కోట్లు ఇచ్చింది
- మేం అర్హులకే ఇస్తాం.. ఎవరికీ కోత పెట్టం
- వర్షాకాలం నుంచి పంటల బీమా
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడి
- రైతుభరోసాపై శాసనసభ సభ్యుల సలహాలు కోరిన ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'రైతు భరోసా' పథకాన్ని వచ్చే జనవరి నుంచే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంటలు సాగు చేసేవారికే రైతు భరోసా ఇవ్వాలనేది తమ ప్రభుత్వ నిర్ణయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో.. సాగు

మిగతా 13వ పేజీలో...



వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భూ భారతి చట్టం

మాకు రెఫరెండం

10

ధరణితో పోయిన భూములు భూ భారతితో తిరిగి హక్కుదారుల సొంతం: మంత్రి పొంగులేటి

రైతు భరోసాను ఎగ్గొట్టే ప్రయత్నం

- ఆదాయపు పన్ను కడితే సాయం చేయరా?
- పథకంపై ఇచ్చిన నివేదికను సభలో పెట్టండి
- ఏ ఊరిలోనూ 100% రుణమాఫీ కాలేదు
- 24 గంటల కరెంట్ ఎక్కడా ఇవ్వడం లేదు
- తప్పని నిరూపిస్తే రాజీనామా చేస్తాం
- భూములన్నింటికీ రైతుబంధు ఇవ్వడం వల్లే రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగింది
- ఎన్ని కేసులు పెట్టినా భయపడం: కేటీఆర్



హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ఆరోపించారు. ఆదాయపు పన్ను చెల్లించే వారికి, ఉద్యోగం చేస్తున్నవారికి, పాన్ కార్డులు ఉన్నవారికీ రైతు భరోసా ఇవ్వొద్దని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని, ఇది సరైంది కాదన్నారు. రాష్ట్రంలో దాదాపు కోటి మందికిపైగా పాన్ కార్డులు

మిగతా 13వ పేజీలో...

2

మూసీ కంపు కంటే సీఎం చెప్పే కంపే ఎక్కువ

- అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి..
- దేవుడే ఈ రాష్ట్రాన్ని కాపాడాలి
- బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు

ఫార్ములా-ఈ కారు కేసులో.. తొలుత

బ్యాంకర్ విచారణ!

- అధికారులను కూడా విచారించిన తరువాతే కేటీఆర్‌కు ఈడీ నోటీసులు!
- ఆర్‌బీఐ నిబంధనల ఉల్లంఘనపై ప్రశ్నలు
- దర్యాప్తు ప్రారంభించిన ఏసీబీ.. దానకిషోర్ వాంగ్మూలం రికార్డు చేయనున్న అధికార్లు

హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేస్ వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు.. ముందుగా విదేశీ సంస్థకు డబ్బు బదిలీ చేసిన బ్యాంకర్‌ను విచారించనున్నట్లు తెలుస్తోంది. బ్రిటన్‌లోని ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో)కు డబ్బు చెల్లించిన హిమాయత్‌నగర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు (ఐవోబీ)ను తొలుత ప్రశ్నించనున్నట్లు సమాచారం. నాటి పురపాలకశాఖ కార్యదర్శి అర్విందకుమార్ ఆదేశాల మేరకు ఎఫ్ఈవోకు డబ్బు చెల్లించాల్సిందిగా.. హెచ్ఎండీఏ

మిగతా 2వ పేజీలో...

కాళేశ్వరం కమిషన్ గడువు 2 నెలలు పొడిగింపు

2

నెలాఖరు లేదా జనవరిలో తదుపరి విచారణ

ప్రభుత్వ పథకాల్లో మీ వాటా- మీ కోటా

క్రిస్టియన్లకు సర్కారులో సముచిత స్థానం

అన్ని మతాలకు సమాన ఆదరణ

చిచ్చుపెడితే సహించేది లేదు.. చర్చిల అభివృద్ధికి ప్రాధాన్యం

క్రిస్మస్ ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

హైదరాబాద్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సమాజానికి తెలంగాణ ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ కమిటీల్లోనూ ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. లాల్ బహదూర్ స్టేడియంలో శనివారం రాత్రి జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా చిన్నారులకు క్రిస్మస్ కానుకలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమాజంలోని దళిత క్రిస్టియన్ల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో సహ ప్రతి ప్రభుత్వ పథకంలో మీ వాటా-మీ కోటా ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీలో చురుకైన క్రిస్టియన్ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని సభకు హాజరైన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు సూచించారు. విద్యావైద్య రంగాల్లో క్రిస్టియన్ సంస్థలు చేస్తున్న సేవలను గుర్తు చేశారు. సంక్రాంతి తర్వాత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు ప్రక్రియ మొదలవుతుందని, ఇందులో నిరుపేద దళితులు, దళిత క్రిస్టియన్లకు లబ్ధి కలుగుతుందని చెప్పారు. సర్వమతాలు సమానంగా ఉండాలని తాను కోరుకుంటానని, ఏ మతాన్ని ఆచరించినా, విశ్వసించినా పూర్తి రక్షణ కల్పిస్తామని ప్రకటించారు. మతాల మధ్య చిచ్చు రేపితే సహించేది లేదని హెచ్చరించారు. తెలంగాణలోని చారిత్రాత్మక చర్చిల అభివృద్ధి పునర్నిర్మాణానికి తగినంత నిధులు కేటాయిస్తామని అన్నారు. డిసెంబర్ నెల 'మిరాకిల్ మంత్' అని, ఏసు ప్రభువు జన్మించిన మాసం, సోనియా గాంధీ పుట్టిన నెల, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించిన నెల అని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, క్రిస్మస్ వేడుకలకు హాజరైన జనం

లోకం తీరు



ఫార్ములా ఈ-కారు కేసులో.. తొలుత బ్యాంకర్ విచారణ!

(మొదటిపేజీ తరువాయి)

చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి నుంచి ఐవోబీకి సమాచారం వెళ్లింది. ఈ మేరకు గత ఏడాది అక్టోబర్ 3న రూ.22,69,63,125 మొత్తాన్ని పౌండ్ల రూపంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు అధికారులు చెల్లించారు. ఆ తర్వాత అక్టోబరు 11న రూ.23,01,97,500లను ఎఫ్ఈవో ఖాతాకు పౌండ్ల రూపంలో చెల్లించారు. వాస్తవానికి దేశంలోని ఏ బ్యాంకు అయినా ప్రభుత్వ లేదా ప్రైవేటు సంస్థలకు సంబంధించి విదేశీ కంపెనీలకు ఆయా దేశాల కరెన్సీ రూపంలో డబ్బు చెల్లించాలంటే భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్బీఐ)కు సమాచారం ఇవ్వాలి. డబ్బు పంపిస్తున్న సంస్థలు ఆర్బీఐ అనుమతి తీసుకుని ఆ విషయాన్ని బ్యాంకర్‌కు తెలపాలి. కానీ, ఎఫ్ఈవో కేసు విషయంలో హెచ్ఎండీఏ.. ఆర్బీఐ అనుమతి తీసుకోలేదు. అలాంటప్పుడు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు అధికారులు మొత్తాన్ని హెచ్ఎండీఏ ఖాతాల నుంచి బ్రిటన్‌లోని ఎఫ్ఈవోకు ఎందుకు బదిలీ చేశారు? వారిపై ఏమైనా ఒత్తిళ్లున్నాయా? ఆర్బీఐకి సమాచారం ఇచ్చారా? లేదా? అనే విషయాలపై స్పష్టత వచ్చిన తర్వాతే ఈడీ అధికారులు తదుపరి విచారణ చేపట్టవచ్చని సమాచారం. ముందుగా కేటీఆర్‌ను విచారించకుండా ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిలను విచారించిన తర్వాతే కేటీఆర్‌కు నోటీసులు జారీ చేయవచ్చని తెలుస్తోంది.

ఫార్ములా ఈ కారు రేసు కేసులో దర్యాప్తు ప్రారంభించిన ఏసీబీ అధికారులు తొలుత తమకు ఫిర్యాదు చేసిన పురపాలకశాఖ కార్యదర్శి దానకిషోర్ వాంగ్మూలాన్ని రికార్డు చేయనున్నట్లు తెలుస్తోంది. అనంతరం నాటి పురపాలకశాఖ కార్యదర్శి అర్వింద‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డికి నోటీసులిచ్చి వారిని విచారించడానికి ఏసీబీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు కొంత ప్రాథమిక విచారణ తర్వాతే నోటీసులు ఇవ్వాలని ఏసీబీ ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు సమాచారం. వచ్చేవారంలో కేటీఆర్‌కు నోటీసులు జారీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కాళేశ్వరం కమిషన్ గడువు రెండు నెలలు పొడిగింపు

హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం బ్యారేజీలపై విచారణ కోసం వేసిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువు మరో రెండు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటిదాకా కమిషన్‌కు ఇచ్చిన గడువు ఈ నెల 31వ తేదీతో ముగియనుంది. అయితే కమిషన్ విచారణ కీలక దశలో ఉండటం.. రానున్న జనవరిలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను కమిషన్ విచారించే అవకాశాలున్నాయి. ఇక కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) ప్రతినిధులతో పాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులను కూడా క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది. మరోవైపు ఈ దఫా విచారణ ముగించుకొని శనివారం జస్టిస్ పినాకి చంద్రఘోష్ కోల్‌కతాకు తిరిగి వెళ్లిపోయారు. ఈ నెలాఖరున క్రిస్మస్ సెలవుల అనంతరం లేదా జనవరి తొలి వారంలో హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉంది. ఇక తాజా గడువుతో 2025 ఫిబ్రవరి 28వ తేదీలోగా నివేదిక అందించాలని ప్రభుత్వం కోరింది. ఈమేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా శనివారం ఉత్తర్వులు ఇచ్చారు.

మూసీ కంపు కంటే సీఎం చెప్పే కంపే ఎక్కువ

- దేవుడే ఈ రాష్ట్రాన్ని కాపాడాలి: హరీశ్‌రావు



హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చారని, అబద్ధాల పాలనే చేస్తున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీ ఆవరణలోని బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ కంపు కంటే ముఖ్యమంత్రి చెప్పే కంపే ఎక్కువ ఉందని, ఏడాదిగా చేసింది ఏమీ లేదన్నారు. ఇక దేవుడే ఈ రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడాలని పేర్కొన్నారు. రైతు భరోసా ఎప్పుడిస్తారో, ఎంత ఇస్తారో చెప్పలేదన్నారు. అప్పుల విషయంలో తప్పుడు లెక్కలు చెబుతున్నారని, ఈ సమావేశాల్లో ప్రభుత్వం తేలిపోయిందన్నారు. తాము ఫార్మా సిటీలో ఏ కంపెనీకి ఎకరా భూమి ఇవ్వలేదని, కానీ అగ్గువకు భూములు ఇచ్చినట్లు సీఎం చెబుతున్నారన్నారు. ఆర్ఆర్ఆర్ వద్దన్నామని, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్ వద్దన్నామని ఇలా అసెంబ్లీ సాక్షిగా ఇన్ని అబద్ధాలు ఆడిన సీఎంను తాను ఎప్పుడూ చూడలేదన్నారు. 15 ఆగస్టులోపు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని తాను బల్లగుద్ది చెప్పానని, కానీ సీఎం మోసం చేశారన్నారు. ప్రజల పక్షాన ప్రజల గొంతుకగా శాసన సభలో సమస్యలు ఎత్తి చూపామన్నారు.



కాగజ్‌నగర్‌లో ఎస్టీ ఆశ్రమోన్నత హాస్టల్ ప్రాంగణంలో పడేసిన ఉడకని కిచిడి

హాస్టల్ విద్యార్థులకు ఉడకని కిచిడి

- తినలేమంటూ విద్యార్థుల నిరసన.. కాగజ్‌నగర్‌లో ఘటన
- మధ్యాహ్న భోజనంలో పురుగులు
- వికారాబాద్ జిల్లా చౌడాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో ఘటన

కాగజ్‌నగర్, దోమ/కులకచర్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్టీ ఆశ్రమోన్నత హాస్టల్‌లో శనివారం ఉడకని కిచిడి పెట్టడంతో దానిని తాము తినలేమంటూ విద్యార్థులు నిరసనకు దిగారు. ఈ విషయం బయటికి పొక్కడంతో హాస్టల్ సిబ్బంది ఉడకని కిచిడిని హాస్టల్ ప్రాంగణంలోనే పడేశారు. అరగంటలో మళ్లీ అన్నం వండారు. అయితే పప్పు ఉడకటం ఆలస్యమవుతుండటంతో అప్పటికే ఆకలితో ఉన్న విద్యార్థులు కారం, నూనె కలుపుకొని తిన్నారు. ఆ సమయంలో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ (ఏటీడబ్ల్యూవో) ఖమర్, వార్డెన్ రాణి అక్కడే ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు ఎస్టీ ఆశ్రమోన్నత పాఠశాలకు వచ్చి సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు సమాచారమిచ్చారు. ఆమె హాస్టల్‌కు చేరుకొని ఏటీడబ్ల్యూవో ఖమర్, వార్డెన్ రాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. హాస్టల్‌లోని స్టాక్‌ను, వంట గదులను ఆమె పరిశీలించారు. ఇదిలా ఉండగా.. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పురుగులు కనిపించిన ఘటన వికారాబాద్ జిల్లా చౌడాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో శనివారం వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ప్రభ పాఠశాలకు వెళ్లి భోజనాన్ని పరిశీలించారు. నాసిరకం భోజనం వడ్డించే ఏజెన్సీ నిర్వాహకులపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని, వంట నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనారోగ్యంతో డీఎడ్ విద్యార్థిని మృతి

- ఆసిఫాబాద్ జిల్లా జన్కాపూర్ బీసీ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో ఘటన

బెజ్జూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం అందుగులగూడ గ్రామానికి చెందిన డీఎడ్ విద్యార్థిని తొర్రెం వెంకటలక్ష్మి(19) శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ బీసీ పోస్ట్‌మెట్రిక్ వసతిగృహంలో అనారోగ్యంతో మృతి చెందింది. వసతిగృహం అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె మృతి చెందిందని ఆరోపిస్తూ శనివారం అందుగులగూడలో కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. వారికి స్థానిక నాయకులు మద్దతు పలికారు. రెండుగంటలపాటు ఆందోళన చేయగా.. కౌటాల సీఐ ముత్యం రమేష్, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, నరేష్, మధుకర్ ఆందోళనకారులను చెదరగొట్టే ప్రయత్నం చేసినా వారు శాంతించలేదు. సబ్ కలెక్టర్ వచ్చి న్యాయం చేయకుంటే విద్యార్థి మృతదేహంతో ఆసిఫాబాద్ వెళ్లి దర్నా చేస్తామన్నారు. ఈక్రమంలో మృతదేహాన్ని ఆసిఫాబాద్ తీసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. కాగా మృతిచెందిన విద్యార్థిని కుటుంబాన్ని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా పరామర్శించారు. విద్యార్థిని మృతిపై కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

తెలంగాణలో 24.7% అడవులు

- కేంద్ర అటవీ శాఖ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అడవుల విస్తీర్ణం రాష్ట్ర వైశాల్యంలో 24.7% ఉన్నట్లు కేంద్ర అటవీ శాఖ విడుదల చేసిన 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ సర్వే రిపోర్ట్-2023' వెల్లడించింది. ఈ నివేదికను కేంద్ర మంత్రి భూపేందర్‌యాదవ్ విడుదల చేశారు. దీని ప్రకారం రాష్ట్రంలో 21,179.04 చదరపు కి.మీ మేర అడవులు విస్తరించి ఉన్నాయి. ఏపీలో 30,084.96 చ.కి.మీ(22.63%) అడవులున్నాయి. దేశంలో ఈ విస్తీర్ణం 8,27,356.95 చ.కి.మీ(25.17%) ఉన్నట్లు ఈ నివేదిక పేర్కొంది.

అక్రమాలను శాస్త్రీయంగా నిగ్గుతేల్చేందుకే ఫోరెన్సిక్ ఆడిట్

- ఒక్కో సర్వే నంబర్ డిజిటల్ రికార్డుల పరిశీలనతో దర్యాప్తు
- ధరణి వచ్చాక జరిగిన లావాదేవీలపై దృష్టి
- రెవెన్యూ, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉన్న వారితో దర్యాప్తు కమిటీ
- అవకతవకలన్నీ బయటపడే అవకాశం



సంగారెడ్డిలో ఓ వ్యక్తి చనిపోయాడు. అతని ఆస్తి తన భార్యకు చెందాలి. కానీ ఓ తహసీల్దార్ సదరు వ్యక్తి పేరిట ఉన్న 27 ఎకరాల భూమిని సంబంధం లేని వ్యక్తులకు ధరణి ద్వారా బదలాయించారు.

పెద్దపల్లిలో 695 ఎకరాల భూమి ఒకే వ్యక్తి పేరుపై ధరణిలో నమోదు చేసి పాస్‌పుస్తకాలు ఇచ్చారు. వాటిని చూసి ఆ వ్యక్తి కూడా నివ్వెరపోయాడు.

ఇవే కాదు.. భూ లావాదేవీలకు సంబంధించి ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చాక చిత్ర విచిత్రాలు చాలా జరిగాయి. ధరణిని వాడుకుని చాలా మంది వందల ఎకరాల ప్రభుత్వ భూములను స్వాహా చేశారనే ఫిర్యాదులున్నాయి. అయితే, అసలు ఈ అవకతవకలు ఎలా జరిగాయి? వీటి వెనక ఉన్న పాత్రదారులు ఎవరు? ధరణి అమలులోకి వచ్చిన తర్వాత ఇలాంటి అక్రమాలు ఇంకెన్ని జరిగాయి? తదితర అంశాలను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. పదేళ్లలో ముఖ్యంగా ధరణి ఏర్పాటు చేశాక 2020 నుంచి ఇప్పటి వరకు జరిగిన అవకతవకలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయాలని నిర్ణయించింది. అయితే, భూరికార్డుల ఫోరెన్సిక్ ఆడిట్ అంటే ఏంటి? ఎలా చేస్తారు? అనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తాయి.

ఫోరెన్సిక్ ఆడిట్ ఎలా చేస్తారంటే ...

ఏదైనా హత్య జరిగినప్పుడు ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలిలో ఆధారాలు సేకరించారనే మాట వింటుంటాం. ఫోరెన్సిక్ నిపుణులు తాము సేకరించిన ఆధారాలను శాస్త్రీయంగా పరిశీలించి హత్య జరిగిన తీరు, కారణాలు వంటి అనేక అంశాలు అంచనా వేస్తారు. అదే భూరికార్డుల విషయానికి వచ్చే సరికి.. ఏదైనా ఓ సర్వే నెంబరు సంబంధించిన డిజిటల్ రికార్డులను పూర్తిస్థాయిలో బయటికి తీసి పరిశీలించి అక్రమాలను గుర్తిస్తారు. డిజిటల్ ఆనవాళ్లను పూర్తిస్థాయిలో వెలికి తీయడం ద్వారా ఆ సర్వే నంబరు మీద జరిగిన లావాదేవీలన్నీ బయటకు వచ్చే అవకాశం ఉంటుందని పబ్లిక్ పాలసీ నిపుణులు దొంతి నరసింహారెడ్డి అన్నారు. డేటా ఎప్పుడు ఎంట్రీ చేశారు? ఎవరు లాగిన్ అయ్యారు? ఎక్కడి నుంచి లాగిన్ అయ్యారు? ఎవరి ఆదేశాలతో పని చేశారు? ఎవరి పేరు మీద భూమి బదిలీ అయింది? ఇలాంటి అనేక అంశాలు డిజిటల్ రికార్డుల ద్వారా తెలుసుకునే అవకాశముందని ఆయన చెప్పారు. ఇదే విషయంపై రెవెన్యూ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి మాట్లాడుతూ జరిగిన అక్రమాలను శాస్త్రీయంగా నిగ్గుతేల్చడమే ఫోరెన్సిక్ ఆడిట్ అని అన్నారు. ప్రతి సర్వే నంబరుపై జరిగిన లావాదేవీల మీద పోస్టుమార్టం చేస్తే తెరవెనుక జరిగిన వ్యవహారాలన్నీ వెలుగు చూస్తాయన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రెవెన్యూ అంశాల్లో పట్టు ఉన్న వారిని నియమించి ఆడిట్ చేయిస్తే సత్ఫలితాలు వస్తాయని సదరు అధికారి సూచించారు. ఫోరెన్సిక్ ఆడిట్ కమిటీ ఏర్పాటుపై ప్రభుత్వం త్వరలోనే ఉత్తర్వులివ్వనుంది.

ధరణి పోర్టల్ నిర్వహణ ఏజెన్సీపై సీఎంకు లేఖ

ఫోరెన్సిక్ ఆడిట్ అంశాన్ని పబ్లిక్ పాలసీ నిపుణులు దొంతి నరసింహారెడ్డి కొద్ది నెలల క్రితమే ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. భూ రికార్డుల నిర్వహణకు ఏర్పాటు చేసిన ధరణి పోర్టల్ సర్వీస్ ప్రొవైడర్ ఐఎల్ఎఫ్(టెరాసిస్), తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ మధ్య జరిగిన ఒప్పందం విషయంలో పలు సందేహాలను ఎత్తిచూపుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ఏప్రిల్ 18న లేఖ రాశారు. ఆ ఒప్పందంలోని అనేక అంశాలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయాల్సిన అవసరం ఉందని అందులో పేర్కొన్నారు. ధరణి పోర్టల్ ద్వారా అనధికారిక భూ కేటాయింపులు, రికార్డుల దుర్వినియోగాన్ని నిలువరించేందుకు బ్లాక్‌చైన్ టెక్నాలజీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, కానీ ఆ టెక్నాలజీ వినియోగించిన దాఖలాలపై విచారణ చేయాలని కోరారు. 2022 సెప్టెంబరులో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం తహసీల్దార్ రాజయ్య.. నాగనపల్లి గ్రామానికి చెందిన శివమ్మకు చెందిన 27.3ఎకరాలను అంజమ్మ అనే మరొకరి పేరు మీద మార్చారు. ధరణి పోర్టల్‌లో రికార్డులు మార్చే అధికారం తహసీల్దార్‌కు లేకున్నా ఆ పని చేశారని ఆ లేఖలో పేర్కొన్నారు.

22ఏ భూముల గుట్టు కూడా బయటికి ?

ఇటీవల అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సుమారు 25 వేల ఎకరాలు చేతులు మారాయని, 2014కి ముందు 22ఏ కింద ఉన్న భూములు 2014 నుంచి 2023 మధ్యలో జాబితా నుంచి తొలగించిన భూముల లెక్కలు కూడా తీస్తున్నామని చెప్పారు. ఫోరెన్సిక్ ఆడిట్ చేపడితే ఆయా భూలావాదేవీల వెనక ఉన్న గుట్టు బయటపడే అవకాశం ఉంది.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం.. దేశప్రజలకు రక్షణ కవచం

ఈ రాజ్యాంగాన్ని బీజేపీ ఎత్తేయాలని చూస్తోంది.. అందుకే రాహుల్ గాంధీ పోరాటం

- పార్లమెంటులో స్పీకర్ సాక్షిగా అంబేడ్కర్‌ను అమిత్‌షా కించపరిచారు
- షా మాటలను మోదీ సమర్థించి.. బాబా సాహెబ్‌ను మరింత అవమానించారు
- వారిద్దరూ క్షమాపణ చెప్పేదాకా పోరాటం
- నెహ్రూ క్యాబినెట్లో ఉన్న అంబేడ్కర్‌ను అవమానించినందుకే రాహుల్ పోరాటం
- దళితుడిని పార్టీ అధ్యక్షుడిగా నియమించిన చరిత్ర సోనియా, రాహుల్‌ది
- హిందూ, ముస్లిం, సమస్త కులాలు, జాతుల సమైక్యతనే రాహుల్ ఆకాంక్ష
- అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా.. సంగారెడ్డిలో జగ్గారెడ్డి భారీ ర్యాలీ

సంగారెడ్డి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): "స్వేచ్ఛ, స్వాతంత్య్రాలు అందరికీ అందేలా అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం దేశప్రజలకు ఒక రక్షణ కవచంలా మారింది. ఈ రాజ్యాంగాన్ని బీజేపీ ఎత్తివేయాలని చూస్తోంది. అందుకే రాహుల్‌గాంధీ పోరాడుతున్నారు" అంటూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటులో స్పీకర్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కించపరిచారని, ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎస్సీ, ఎస్టీలతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి జగ్గారెడ్డి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమిత్‌షా మాటలను ప్రధాని మోదీ సమర్థించడం గర్హనీయమని, బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను మరింత అవమానపరిచారని మండిపడ్డారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కించపరిచిన మోదీ, అమిత్‌షాలు క్షమాపణలు చెప్పేదాకా రాహుల్ గాంధీ నేతృత్వంలో తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.



అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా క్షమాపణ చెప్పాలని సంగారెడ్డిలో చేపట్టిన భారీ ర్యాలీలో పాల్గొన్న జగ్గారెడ్డి

తొలి ప్రధాని నెహ్రూ క్యాబినెట్లో ఉన్న అంబేడ్కర్‌ను అవమానించినందుకే నెహ్రూ మునిమనవడిగా రాహుల్‌గాంధీ ప్రశ్నిస్తున్నారన్నారు. హిందూ, ముస్లిం, సమస్త కులాలు, జాతుల సమైక్యతను సాధించడమే రాహుల్ ఆకాంక్ష అని పేర్కొన్నారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఒక దళితుడైన ఖర్గేను నియమించిన చరిత్ర సోనియా, రాహుల్ గాంధీలదని కొనియాడారు. కానీ దళితుడిని బీజేపీ అధ్యక్షుడిగా నియమించడానికి మోదీ, అమిత్‌షాలకు దమ్ముందా అంటూ జగ్గారెడ్డి ప్రశ్నించారు.

క్షయ నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమం

- 9 జిల్లాల్లో వంద రోజుల పాటు నిర్వహణ
- 26 సంచార పరీక్ష ల్యాబ్‌ల ఏర్పాటు
- మంత్రి దామోదర రాజనర్సింహ
- కేంద్రమంత్రి నిర్వహించిన వీసీలో వెల్లడించిన మంత్రి



హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేశంలో 2025 చివరి నాటికి క్షయ (టీబీ)ని పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్రంలో క్షయ నిర్మూలనకు కేంద్ర ఆరోగ్యశాఖ సూచించిన అన్ని రకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. 'టీబీ ముక్త్ భారత్ అభియాన్'పై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి దామోదర రాజ నర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈ నెల 7వ తేదీన 9 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ 9 జిల్లాల్లో క్షయ సోకే అవకాశం ఉన్న ప్రజలను గుర్తించి పరీక్షలు చేసేందుకు 26 సంచార పరీక్ష వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని వాహనాల్లోనూ డిజిటల్ ఎక్స్‌రే మిషన్లు, సీబీ నాట్ మిషన్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. వంద రోజుల కార్యక్రమానికి సరిపడా టెస్టింగ్ రీ ఏజెంట్లు, మందులు అందుబాటులో ఉంచామని చెప్పారు. 9 జిల్లాల్లో కలిపి ఇప్పటి వరకూ 7,219 మందికి పరీక్షలు చేశామన్నారు. అందులో 181 మందికి క్షయ ఉందని(టీబీ పాజిటివ్) తేలినట్లు కేంద్ర మంత్రికి దామోదర వివరించారు. ప్రజలకు అవగాహన కల్పించడం, ముందస్తు పరీక్షల ద్వారానే క్షయ నిర్మూలన సాధ్యమవుతుందని మంత్రి దామోదర అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో పరీక్షల సంఖ్యను భారీగా పెంచామన్నారు. 2023లో 5.74 లక్షల మందికి క్షయ పరీక్షలు చేయగా.. 2024లో 7.82 లక్షల మందికి చేశామన్నారు. చికిత్స సఫలత రేటు దేశంలో సగటున 87 శాతం ఉంటే తెలంగాణలో 90 శాతం ఉందన్నారు. కాగా క్షయ రోగుల గుర్తింపు, చికిత్స కోసం 100 రోజుల 'ఇంటెన్సిఫైడ్' క్షయ నిర్మూలన కార్యక్రమం నిర్వహించాలని కేంద్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. గతేడాది తక్కువ పరీక్షలు జరిగిన జిల్లాలను, క్షయ ప్రమాదం ఎక్కువగా ఉన్న జిల్లాలను ఈ కార్యక్రమం కోసం కేంద్రం ఎంపిక చేసింది. దేశవ్యాప్తంగా 347 జిల్లాల్లో(తెలంగాణలో 9 జిల్లాలు) ఈ నెల 7న కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2025 మార్చి 17 వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో భాగంగా క్షయ వచ్చే అవకాశం ఉన్న ప్రజలను గుర్తించి, పరీక్షలు చేయాల్సి ఉంటుంది. దీనికోసమే రాష్ట్ర ప్రభుత్వం 26 సంచార పరీక్ష(మొబైల్ స్క్రీనింగ్) వాహనాలను ఏర్పాటు చేసింది.

25 నుంచి వాజ్‌పేయి శతజయంతి కార్యక్రమాలు నిర్వహించండి

- 30లోపు పోలింగ్ బూత్, మండల స్థాయి కమిటీలను నియమించండి
- పార్టీ నాయకుల సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దివంగత ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి శతజయంతి కార్యక్రమాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. పోలింగ్ బూత్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. జాతీయ నాయకత్వం పిలుపు మేరకు వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను ఏడాది పాటు కొనసాగించాలని చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులతో సమావేశమైన కిషన్ రెడ్డి మాట్లాడుతూ, వాజ్‌పేయి జయంతి సందర్భంగా 25న పోలింగ్ బూత్‌స్థాయిలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించాలని, మండల స్థాయిలో రక్తదాన శిబిరాలు, జిల్లా కేంద్రాల్లో వాజ్‌పేయి జీవిత చరిత్రకు సంబంధించి ఫోటో చిత్ర ప్రదర్శన నిర్వహించాలని చెప్పారు. హైదరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహం నుంచి రాష్ట్ర పార్టీ కార్యాలయం వరకు వంద పార్టీ జెండాలతో ర్యాలీ ఉంటుందని తెలిపారు. అనంతరం రాష్ట్రపార్టీ కార్యాలయంలో ప్రముఖులతో సమావేశం, రక్తదాన శిబిరం ఉంటుందని వివరించారు. సంస్థాగత ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ఈ నెల 30 లోపు పోలింగ్ బూత్, మండల స్థాయి కమిటీల నియామకాలను పూర్తి చేయాలని కిషన్‌రెడ్డి పార్టీ నేతలకు సూచించారు.

అవి గురుకులాలు కావు.. మరణకూపాలు: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న గురుకులాలు, హాస్టళ్లు విద్యాకేంద్రాలు కావని, అవి మరణకూపాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పాలనలో 62, కాంగ్రెస్ ఏడాది పాలనలో 26 మంది విద్యార్థులు చనిపోయారని ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. గురుకులాలలో పెరుగుతున్న మరణాలు, ఆత్మహత్యలు, ఫుడ్ పాయిజనింగ్ కేసులు, మౌలిక సదుపాయాలు సరిగా లేకపోవడం వల్ల వెనుకబడిన వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. గురుకులాలలోని పరిస్థితులు కాంగ్రెస్ హయాంలో మరింత దిగజారాయని, ఈ నిర్లక్ష్యానికి గత, ప్రస్తుత పాలకులు బాధ్యత వహించాలన్నారు.



ఘట్‌కేసర్‌లో ఎక్స్‌కవేటర్లతో ఇళ్లను కూల్చివేయిస్తున్న అధికారులు

ఘట్‌కేసర్‌లో పెద్దఎత్తున ఇళ్ల కూల్చివేతలు

- భారీ పోలీసు బందోబస్తు నడుమ పనులు
- ఒక్కరోజే 88 ఇళ్లను కూల్చివేసిన అధికారులు

ఘట్‌కేసర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వే వంతెన నిర్మాణం కోసం శనివారం భారీ పోలీసు బందోబస్తు నడుమ రెవెన్యూ అధికారులు పెద్ద ఎత్తున ఇళ్లను కూల్చివేశారు. ఉదయం 7 గంటలకు రంగంలోకి దిగి 6 ఎక్స్‌కవేటర్లతో కూల్చివేతలు నిర్వహించారు. మొత్తం 88 ఇళ్లను కూల్చేశామని మరో 17 ఇళ్లకు స్టే ఉత్తర్వులు ఇచ్చామని అధికారులు తెలిపారు. పెద్దఎత్తున కూల్చివేతలు చేపట్టడంతో ఘట్‌కేసర్ బస్టాండ్ నుంచి ధర్మశాల వరకు ఆ ప్రాంతం శిథిలాల దిబ్బగా మారింది. 16 ఏళ్లుగా రైల్వే వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో పాటు బాధితులు న్యాయపోరాటం చేయడంతో కూల్చివేతలు చేపట్టలేదు. ఎట్టకేలకు ఇళ్ల కూల్చివేత పనులు పూర్తి కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, తమ సామాన్లు సర్దుకునే సమయం కూడా ఇవ్వకుండా కూల్చివేతలేంటని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వం కోల్పోయి రోడ్డున పడ్డామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తగిన పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. కాగా ఇదే అంశంపై బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు బాధితులతో చర్చించి వారికి తగిన పరిహారం ఇప్పించాలని అన్నారు. వారికి ఈ మాత్రం విజ్ఞత లేకపోవడం బాధాకారమని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నామని ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.



ఈడీ దూకుడు

- కాకినాడ పోర్టు, సెజ్ కొట్టేసిన వ్యవహారంలో
- వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ విచారణ
- ఈ కేసులో మిగతా నిందితులకూ నోటీసులు

కాకినాడ, విజయవాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ సీ పోర్టులో వాటాలు కొట్టేసిన కేసులోని మనీ లాండరింగ్ కోణంపై ఈడీ దృష్టి సారించింది. వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డిని పిలిపించి తాజాగా విచారించింది. ఈ కేసులో సీఐడీ నిందితులుగా చేర్చిన వారందరికీ ఈడీ నోటీసులు జారీచేసింది. వారందరినీ పిలిపించి ఒక్కొక్కరుగా విచారించనుంది. విక్రాంత్‌రెడ్డి విచారణ సందర్భంగా.. ప్రధానంగా 'లావాదేవీ'లపై ఆరా తీసింది. డబ్బులు ఎలా వచ్చాయి.. ఎంత తరలించారు.. ఎవరికి లబ్ధి జరిగింది...అనే కోణంలో లోతుగా ఈడీ అధికారులు విక్రాంత్‌ను విచారించారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు విక్రాంత్ సరిగా సమాధానాలు చెప్పకుండా డొంక తిరుగుడుగా సమాధానాలు చెప్పినట్లు సమాచారం. జగన్ హయాంలో చోటు చేసుకున్న ఈ వ్యవహారంలో భారీగా మనీ లాండరింగ్ జరిగిందని ఈడీ ఇటీవల ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. విక్రాంత్ రెడ్డితోపాటు ఎంపీ విజయసాయిరెడ్డి.. సంతానం ఆడిట్ కంపెనీకి ఈడీ నోటీసులు జారీ చేసింది. అందులో భాగంగా ఇప్పుడు విక్రాంత్‌ను విచారణకు పిలిచింది. కాకినాడ సీపోర్టుకు అసలు యజమాని కేవీ రావును ఆనాడు జగన్ సన్నిహితులు బెదిరించి, భయపెట్టి కారుచౌకగా వాటాలు కొట్టేసిన వైనంపై ఈడీ పలు ప్రశ్నలు అడిగింది.

సీఐడీ నోటీసులు

- అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్‌చంద్రారెడ్డికి తాఖీదు
- ఆడిట్ సంస్థ పీకేఎఫ్ ప్రతినిధుల విచారణ
- మరో ఇద్దరు డైరెక్టర్లకు కూడా నోటీసులు
- వాటాలు వదులుకునేలా కేవీరావుపై నాడు ఒత్తిడి
- అందులో కీలక పాత్ర పీకేఎఫ్‌దే

కాకినాడ సీపోర్టులో వ్యాపారవేత్త కేవీ రావును బెదిరించి అన్యాయంగా వాటాలను రాయించుకున్న కేసు దర్యాప్తులో సీఐడీ వేగం పెంచింది. జగన్ హయాంలో వివాదాస్పదంగా మారిన ఈ వ్యవహారంలో బెదిరించి కేవీరావుతో వాటాలు రాయించుకోవడంలో కీలకంగా వ్యవహరించినవారికి తాఖీదులు జారీ చేస్తోంది. కాకినాడ పోర్టు, సెజ్‌ను ఆనాడు బెదిరించి లాగేసుకున్నారని యజమాని కేవీ రావు ఇచ్చిన ఫిర్యాదుపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్ రెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డి, అరబిందో ఫార్మాకు చెందిన శరత్ చంద్రారెడ్డి, చెన్నైకు చెందిన ఆడిటింగ్ కంపెనీ పీకేఎఫ్ ప్రతినిధులు సుందర్, విశ్వనాథ్, ప్రసన్నకుమార్, అపర్ణలను నిందితులుగా చేర్చారు. సెజ్‌ను లాక్కున్న అరబిందో ఇన్‌ఫ్రాను కేసులో చేర్చారు. ఈ క్రమంలో కాకినాడ పోర్టుకు ఆడిట్ నివేదికను రూపొందించిన పీకేఎఫ్ సంస్థ ప్రతినిధులు సుందర్, విశ్వనాథ్‌ను సీఐడీ విజయవాడ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం విచారించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి వరకు విచారణ సాగుతూనే ఉంది. పీకేఎఫ్‌కు డైరెక్టర్లుగా ఉన్న ప్రసన్నకుమార్, అపర్ణకు కూడా నోటీసులు ఇవ్వడానికి సీఐడీ అధికారులు సిద్ధమయ్యారు. ఈనెల 24వ తేదీ తర్వాత వారిని విచారణకు పిలిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేవీ రావు నుంచి కాకినాడ సీపోర్టును లాక్కోవడంలో ప్రధానంగా అభియోగాలు ఎదుర్కొంటున్న అరబిందో ఫార్మా ప్రతినిధి పెనకా శరత్‌చంద్రారెడ్డికి సీఐడీ అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. విచారణకు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. తాను అయ్యప్పస్వామి మాలలో ఉన్నందున ఈ నెల 24 తర్వాత విచారణకు వస్తానని శరత్‌చంద్రారెడ్డి సీఐడీకి లేఖ రాశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

చైర్ కాదు ఫైర్

తెలంగాణ రాజకీయాలలో వేడి పుట్టింది. ఏడాది క్రితం వరకు తెలంగాణలో తిరుగులేని అధికార కేంద్రంగా వెలుగొందిన మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును ఏ-1గా పేర్కొంటూ అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది. అందరి లాగే తండ్రి కేసీఆర్ మాటలు నమ్మి రేపో మాపో ముఖ్యమంత్రి కూడా అవుతానని కొంతకాలం పాటు ఊహల పల్లకిలో విహరించిన కేటీఆర్‌కు, రేపో మాపో జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి ఇప్పుడు ఏర్పడింది. ఫార్ములా–ఈ రేసు కేసులో ఆయనను అరెస్టు చేసి జైలుకు పంపడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పకడ్బందీగా పావులు కదిపింది. ఫార్ములా–ఈ రేసు వ్యవహారం కేటీఆర్ మెడకు చుట్టుకోబోతున్నదని కొంతకాలంగా ప్రచారం జరుగుతున్నందున తెలంగాణ సమాజం కూడా దీన్నో సంచలనంగా పరిగణించడం లేదు. అయితే భారత రాష్ట్ర సమితి నాయకులు, శ్రేణులు మాత్రం తమ అధినేతలను జైలుకు పంపితే తమ నెత్తిన పాలు పోసినట్టేనని అంతరంగిక సంభాషణల్లో సంబరపడిపోతున్నారు. అందుకే జైలుకు వెళ్లి వచ్చిన వాళ్లు ముఖ్యమంత్రి అవుతారని

> ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టు బిగించారు. తనను ఇబ్బందులు పెట్టిన వారిపై ప్రతీకారం తీర్చుకొనే అవకాశం ఇప్పుడు ఆయనకు లభించింది. అంతిమంగా ఈ పోకడలు ఆయనకు లాభం కలిగిస్తాయా? నష్టం చేస్తాయా? అన్నది కాలమే నిర్ణయించాలి. ఏడాదిగా అమలుకు నోచుకోని పాత పథకాలను వచ్చే జనవరి నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నందున ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి తగ్గుముఖం పట్టవచ్చు. అదే సమయంలో కేటీఆర్‌ను అరెస్టు చేసి జైలుకు పంపితే ఆ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి లబ్ధి పొందే ఆలోచనలో ఉన్న బీఆర్ఎస్ ప్రయత్నాలు ఫలిస్తాయా, లేవా? అన్నది కూడా వేచి చూడాలి. ప్రస్తుతం కేసీఆర్‌ను కష్టాలు కమ్ముకుంటున్నాయి. ఈ పరిస్థితుల నుంచి తన కుటుంబాన్ని కాపాడుకుంటూ పార్టీని ఎలా బతికించుకుంటారు? అన్నది కేసీఆర్ అనుసరించబోయే వ్యూహాలపై ఆధారపడి ఉంటుంది.

ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ నాయకులు చెప్పుకొంటున్నారు. అలా అయితే ముందుగా కవిత ముఖ్యమంత్రి అవుతారని కాంగ్రెస్ నాయకులు కౌంటర్‌గా ఎగతాళి చేస్తున్నారు. నిజానికి జైలుకు వెళ్లి వచ్చినంత మాత్రాన ఎవరూ అమాంతం ముఖ్యమంత్రి అయిపోరు. అలా అయితే అవినీతి కేసులలో అరెస్టయ్యి జైలుకు వెళ్లడానికి చాలా మంది క్యూ కడతారు. ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లి రావడం వెనుక అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహం ఉంది. తన ఒక్కగానొక్క బిడ్డ పెళ్లిని కూడా దగ్గరుండి సంతోషంగా జరిపించుకొనే అవకాశం లేకుండా కేసీఆర్ అండ్ కో చేసినందున రేవంత్‌రెడ్డిలో కసి పెరిగింది. ఈ కారణంగానే ఆయన తెలుగుదేశం పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరి చాలా వేగంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగారు. ఆనాటి నుంచి ఎన్నికల వరకు కేసీఆర్‌పై అలుపెరుగని పోరాటం చేసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని విజయ తీరానికి చేర్చారు. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తొలగించడం కూడా రేవంత్‌రెడ్డికి కలిసివచ్చింది. ఇవన్నీ ఒక ఎత్తు కాగా, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన నియంతృత్వ పోకడలతో ప్రజలకు దూరం అవడం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి ప్రధాన కారణం అయింది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పాత్రకు పరిమితమైన బీఆర్ఎస్.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై అధికార మార్పిడి జరిగిన నాటి నుంచే పోరాటాన్ని ఉధృతం చేసింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి తగిన సమయం ఇవ్వకుండా ఆందోళనలు చేయడాన్ని ప్రజలు కూడా హర్షించడం లేదు. అయితే ప్రజాభిప్రాయంతో నిమిత్తం లేకుండా కల్వకుంట్ల కుటుంబానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మధ్య ఏర్పడిన వ్యక్తిగత వైషమ్యాలు తారస్థాయికి చేరాయి. ఈ ఏడాది కాలంలో ఒకటి రెండు సందర్భాలలో దుందుడుకుగా వ్యవహరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తనను నిత్యం దుర్భాషలాడుతున్న కేటీఆర్ విషయంలో మాత్రం పకడ్బందీగా పావులు కదిపారు. ఫార్ములా–ఈ రేసు వ్యవహారాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వివరించి ఆయన నుంచి ముందస్తు అనుమతి పొందారు. సాంకేతిక కారణాలపై కేటీఆర్‌కు వెంటనే బెయిల్ రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పుష్ప–2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఒక దురదృష్టకర సంఘటనలో ఓ మహిళ మృతి చెందిన కేసులో ఆ సినిమా హీరో అల్లు అర్జున్‌ను అనూహ్యంగా అరెస్టు చేయించడం, ఇప్పుడు మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత కేటీఆర్‌పై కేసు పెట్టించడం ద్వారా తాను ఏమిటో చెప్పకనే చెప్పారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. ఈ రెండు చర్యల వల్ల రాజకీయంగా లాభమా? నష్టమా? అన్నది ఇప్పటికిప్పుడు తేలే అంశం కాదు గానీ 'సీఎం అంటే కేవలం కుర్చీ కాదు.. ఫైర్' అని రేవంత్‌రెడ్డి రుజువు చేస్తున్నారు. అంతే కాదు, పార్టీపైన, ప్రభుత్వంపైన తనకు పట్టు ఉందని కూడా రుజువు చేసుకున్నారు. అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడం చిత్ర పరిశ్రమలోనే కాదు ఎలీట్ సొసైటీలో ప్రకంపనలు సృష్టించింది. మహిళ మృతికి అల్లు అర్జున్ ప్రత్యక్ష కారణం కాకపోయినప్పటికీ, అంటే కుట్రపూరిత ఉద్దేశంతో వ్యవహరించనప్పటికీ కేసులో చిక్కుకున్నారు. దీంతో అల్లు అర్జున్ అరెస్టుకు మహిళ మృతి మాత్రమే కారణమా? లేక మరేదన్నా కారణం ఉందా? అని ప్రజలు ఆరా తీయడం మొదలుపెట్టారు. పుష్ప–2 ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అల్లు అర్జున్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు మర్చిపోయారు. ఏడాదిగా ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి పేరును హైదరాబాద్‌లో నివసిస్తున్న అల్లు అర్జున్ మర్చిపోవడాన్ని నెటిజన్లు సైతం హర్షించలేదు. అంతే, సినిమా హీరో అయితే ఏమిటి గొప్ప? ప్రజల్లో నేనే నిజమైన స్టార్‌ని! అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్నారు. గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వాళ్లు సినిమావాళ్ల జోలికి వెళ్లే వారు కాదు. ముఖ్యంగా హీరోలకు ఎంతో గౌరవం ఇచ్చేవారు. జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సినిమా హీరోలతో ఆడుకున్నారు. బడా బడా స్టార్లు తన వద్దకు పరిగెత్తుకుంటూ వచ్చి దేబిరించేలా చేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి జగన్‌లా క్రూరంగా కాకుండా చట్టాన్ని ఉపయోగించి తానేమిటో చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగిందని చెప్పి అక్కినేని నాగార్జునకు చెందిన 'ఎన్ కన్వెన్షన్'ను ఉన్నపళంగా కూల్చివేయించారు. ఇప్పుడు అల్లు అర్జున్‌ను అరెస్టు చేసి ఒక రాత్రి జైల్లో గడపాల్సిన పరిస్థితి కల్పించారు. దీంతో చిత్ర పరిశ్రమ వెన్నులో వణుకు పుట్టింది. చంద్రబాబు, రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రులు అయినప్పుడు సినీ ప్రముఖులు స్వయంగా వెళ్లి వారిని అభినందించేవారు. జగన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి విషయంలో ఇది వెంటనే జరగలేదు. హైదరాబాద్‌లో నివసిస్తున్నా కూడా తెలంగాణ ముఖ్యమంత్రి పేరును సినిమా వాళ్లు గుర్తుంచుకోకపోవడాన్ని రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేకపోయి ఉండవచ్చు. ఎన్నికల ముందు వరకు సినీ ప్రముఖులు పలువురు అప్పటి మంత్రి కేటీఆర్‌తో రాసుకు పూసుకు తిరిగేవారు. అల్లు అర్జున్ ఎపిసోడ్‌తో సినిమా వాళ్లకు గట్టి సందేశం పంపిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు కేటీఆర్ పని పట్టాలని నిశ్చయించుకున్నట్టుగా ఉంది.

రోజులు మారాయ్!

రాజకీయాలలో ఉన్నవారు పార్టీలు వేరైనా వ్యక్తిగత సంబంధాలను వదులుకొనేవారు కారు. ఇప్పుడు ఆ పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఆ కుటుంబం మొత్తం రేవంత్‌రెడ్డిని ఈసడించుకొనేవారు. రేవంత్ రెడ్డి కూడా ఎక్కడా తగ్గకుండా తన నోటికి పని చెప్పేవారు. దీంతో ఇరు పక్షాల మధ్య వ్యక్తిగత వైషమ్యాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఫార్ములా–ఈ కేసు వ్యవహారం రేవంత్‌రెడ్డి చేతికి చిక్కింది. ఈ వ్యవహారంలో ముడుపులు చేతులు మారాయా? లేదా? అన్నది తేలాల్సి ఉన్నప్పటికీ నిబంధనల ఉల్లంఘన మాత్రం జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా మంత్రివర్గం ఆమోదం కూడా లేకుండా 55 కోట్ల రూపాయలు చెల్లించడం తప్పిదమే అవుతుంది. మంత్రి హోదాలో కేటీఆర్ నోటి మాటగా ఇచ్చిన ఆదేశాలతో నాటి పురపాలక శాఖ కార్యదర్శి అర్వింద్ కుమార్ అనే అధికారి డబ్బు చెల్లించేశారు. కారణం ఏమైనా గానీ గత ప్రభుత్వాల హయాంలో ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. దాని పర్యవసానాలను ఇప్పుడు అనుభవిస్తున్నారు. తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ రెడ్డి సుదీర్ఘ కాలం పాటు అధికారంలో కొనసాగుతారని అంత చదువుకున్న అధికారులు కూడా ఎలా విశ్వసించారో అంతుపట్టదు. సామాన్య ప్రజలకు ఉన్న ఇంగితం కూడా అఖిల భారత సర్వీసు అధికారులకు లేకపోవడం విషాదమే. ఫార్ములా–ఈ రేసు వ్యవహారంలో తాను తప్పు చేయలేదని, రాష్ట్రాభివృద్ధితో పాటు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడంలో భాగంగానే సదరు కంపెనీకి నిధులు విడుదల చేశామని కేటీఆర్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ జరగాలని ఆయన కోరారు. కేసు అవినీతి నిరోధక శాఖ చేతుల్లోకి వెళ్లాక అసెంబ్లీలో చర్చ జరగదు. ఈ వ్యవహారంలో నిబంధనల అతిక్రమణ జరిగిందా? ముడుపులు చేతులు మారాయా? అన్నది నిగ్గు తేల్చాల్సిన బాధ్యత ఏసీబీపైనే ఉంటుంది. కేటీఆర్, అర్వింద్ కుమార్‌లను విచారణకు పిలిచిన తర్వాత మాత్రమే ఏసీబీ వైఖరి ఏమిటో స్పష్టం అవుతుంది. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు స్కిల్ కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును కనీసం విచారణకు కూడా పిలవకుండా అరెస్టు చేయించారు. ఆ కేసులో చంద్రబాబు యాభై రోజులకు పైగా జైల్లో గడపాల్సి వచ్చింది. ఇక ఫార్ములా–ఈ రేసు కేసులో ఏమి జరగబోతున్నది? కేటీఆర్ ఎంత కాలం జైల్లో ఉండాల్సి వస్తుంది? అన్నది ఇప్పుడే చెప్పలేం. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కేటీఆర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించినా ప్రస్తుతానికి ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను అరెస్టు చేయడం వల్ల ప్రజల్లో సానుభూతి ఏర్పడి అది భారత రాష్ట్ర సమితి బలపడటానికి ఉపయోగపడుతుందా? లేదా? కేటీఆర్ అరెస్టు వల్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లాభం జరుగుతుందా? నష్టం జరుగుతుందా? అన్నవి ఇప్పుడు చర్చనీయాంశాలుగా మారాయి.

రేవంత్ మార్క్..!

తెలంగాణ సమాజం ఇప్పటిదాకా చూసిన రేవంత్‌రెడ్డి వేరు.. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి వేరుగా ఉంటారని నేను గతంలోనే చెప్పాను. రేవంత్‌రెడ్డి బయటకు కనిపించినంత ఆషామాషీగా ఉండరు. ఆయన చాలా లోతైన మనిషి. కాంగ్రెస్ పార్టీ అంటేనే ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తుంటారు. మా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అని మురిపెంగా చెప్పుకొనే కాంగ్రెస్ నాయకులు బాహాటంగా అసంతృప్తి స్వరాలను వినిపిస్తుంటారు. విచిత్రంగా ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి పార్టీ నాయకులు ఒక్క తాటిపై ఉంటున్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ తీసుకొనే నిర్ణయాలను బాహాటంగా ఎవరూ తప్పుపట్టడం లేదు. అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో సుదీర్ఘకాలం పాటు అధికారానికి దూరంగా ఉండాల్సి రావడం కూడా కాంగ్రెస్ నాయకుల్లో ఈ మార్పునకు కారణం కావచ్చు. రేవంత్‌రెడ్డి కూడా అందరినీ కలుపుకొని వెళ్లడానికే ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సీనియర్ మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి వారు భిన్న స్వరాలను వినిపించడం లేదు. రాజకీయ ప్రత్యర్థుల కట్టడికి ఏమి చేయబోతున్నదీ బయటకు పొక్కకుండా రేవంత్‌రెడ్డి గుంబనంగా వ్యవహరిస్తున్నారు. ఔటర్ రింగు రోడ్డు వ్యవహారంపై సిట్ దర్యాప్తునకు ఆదేశిస్తున్నట్టు శుక్రవారంనాడు ఆయన ఉన్నపళంగా ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో నిర్ణయాలు ఇంత గోప్యంగా తీసుకోవడం అసాధారణం. కేసీఆర్ కుటుంబ సభ్యులను కేసులలో ఇరికించుకుంటూ పోతే భారత రాష్ట్ర సమితి క్రమేపీ బలహీనపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం కావచ్చు. ఫార్ములా–ఈ రేసు వ్యవహారంలో ప్రాథమిక ఆధారాలను గుర్తించని పక్షంలో కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ అనుమతించి ఉండేవారు కారు. అంతే కాదు, ఈ వ్యవహారాన్ని కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతితోనే కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ జిష్ణుదేవ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఉంటారన్న అభిప్రాయం కూడా ఉంది. బొగ్గు నిక్షేపాలకు దూరంగా నల్లగొండ జిల్లాలో యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందని ఈ అంశంపై విచారణ జరిపిన కమిషన్ నిర్ధారించింది. దీంతో ఈ నిర్ణయం తీసుకున్న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మెడపైనా కత్తి వేలాడుతోంది. తమ అధినాయకులపై వరుస కేసులు పెట్టి వేధిస్తూ పోతే తమకే మేలు జరుగుతుందని బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు భావిస్తున్నారు. అందుకే కేటీఆర్‌ను తొందరగా అరెస్టు చేయాలని వారు కోరుకుంటున్నారు. అయితే కేసీఆర్‌ను జైలుకు పంపితేనే ప్రజల్లో సానుభూతి ఏర్పడుతుందని క్షేత్ర స్థాయి సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. లిక్కర్ కేసులో కవితను అరెస్టు చేసి అన్ని నెలలు జైల్లో పెట్టినా తెలంగాణ సమాజం పట్టించుకోలేదు. ఇప్పుడు కేటీఆర్‌ను అరెస్టు చేసి జైల్లో పెట్టినా పెద్దగా సానుభూతి లభించకపోవచ్చు. ఎందుకంటే అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్, కవిత విపరీతమైన అధికార దర్పాన్ని ప్రదర్శించేవారు. ఈ ధోరణిని తెలంగాణ సమాజంతో పాటు పార్టీ శ్రేణులు కూడా జీర్ణించుకోలేకపోయారు. కేసీఆర్ కూడా అహంభావం ప్రదర్శించినప్పటికీ తెలంగాణ రాష్ట్రం సాధించిన వాడిగా ప్రజల్లో ఆయన పట్ల ఇప్పటికీ సానుకూలత ఉంది. ఈ కారణంగా కేసీఆర్‌ను టచ్ చేస్తే మాత్రం ప్రజల్లో సానుభూతి ఏర్పడుతుంది.

> ఫార్ములా–ఈ రేసు వ్యవహారంలో ముడుపులు చేతులు మారాయా? లేదా? అన్నది తేలాల్సి ఉన్నప్పటికీ నిబంధనల ఉల్లంఘన మాత్రం జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా మంత్రివర్గం ఆమోదం కూడా లేకుండా 55 కోట్ల రూపాయలు చెల్లించడం తప్పిదమే అవుతుంది.

కేసీఆర్‌కు బ్యాడ్ టైం!

ఏదిఏమైనా కేసీఆర్ కుటుంబానికి బ్యాడ్ టైం నడుస్తున్నట్టుగా ఉంది. కవిత జైల్లో ఉన్నప్పుడు బీజేపీతో పొత్తుకు సిద్ధపడినా ఆ పార్టీ ఢిల్లీ పెద్దలు కనికరించలేదు. కేసీఆర్ నిస్సహాయంగా ఉండిపోవాల్సి వచ్చింది. ఇప్పుడు కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారంటే బీజేపీ పెద్దలకు తెలియకుండా ఇది జరగదని కేసీఆర్‌కు కూడా తెలుసు. పరిస్థితులు అనుకూలించనప్పుడు ఎంతటి రాజకీయ గండరగండడు అయినా గుడ్లు అప్పగించి చూడటం మినహా ఏమీ చేయలేరు. అందుకే కేసీఆర్ చాలా రోజులుగా ఫాంహౌస్‌లోనే ఉంటూ మౌనాన్ని ఆశ్రయించారు. ఇప్పుడు కేటీఆర్ విషయంలో కూడా ఆయన స్పందించలేదు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చిన నాటి నుంచే కేసీఆర్‌కు దరిద్రం పట్టుకున్నట్టుగా ఉంది. అధికారం కోల్పోయారు. కన్నబిడ్డలు జైలు పాలవుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. తాను కక్ష కట్టి జైల్లో పెట్టించిన రేవంత్‌రెడ్డి చేతిలో వరుస పరాభవాలను ఎదుర్కోవలసి రావడాన్ని మించిన విషాదం కేసీఆర్ జీవితంలో మరేమి ఉంటుంది? ప్రతిపక్షంలో ఉన్నప్పుడే కక్ష రాజకీయాలకు బలై జైలు జీవితం గడిపి వచ్చిన రేవంత్‌రెడ్డికి భవిష్యత్తులో కొత్తగా జరిగే నష్టం ఏమీ ఉండదు. అధికారం శాశ్వతం అనుకొని ఎవరు విర్రవీగినా వారికి ఇటువంటి కష్టాలు కాచుకొని ఉంటాయి. ప్రజల సానుభూతి కూడా లభించదు. అధికారంలో ఉన్నప్పుడు వినయంగా మెలిగిన వారికే ప్రజల సానుభూతి లభిస్తుంది. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఇప్పుడు తెలంగాణలో కేటీఆర్ అండ్ కో, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి అండ్ కో ఆక్రోశిస్తున్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు పోలీసు వ్యవస్థను ఏ స్థాయిలో దుర్వినియోగం చేసిందీ మరచిపోతే ఎలా? సామాన్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలన్నా ఎమ్మెల్యేల అనుమతి పొందాల్సి ఉండేది. ప్రభుత్వం అంటే ప్రైవేటు లిమిటెడ్ కాదని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే మూల్యం చెల్లించక తప్పదని ఎందుకు గుర్తించరో తెలియదు.

గతం మరిస్తే ఎలా?

అధికారంలో ఉన్నప్పుడు రాజధర్మాన్ని పాటించని వాళ్లకు అధికారం కోల్పోయాక అన్యాయం జరుగుతోందని ఆక్రోశించే అర్హత కూడా ఉండదు. అందుకే ఇటు తెలంగాణలో, అటు ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు నిన్న ఏం జరిగిందో గుర్తుచేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగినన్ని అరాచకాలు మరెక్కడా జరిగి ఉండకపోవచ్చు. ఉదాహరణకు వైసీపీకి చెందిన మాజీ మంత్రి పేర్ని నాని తన భార్య పేరిట నిర్మించిన గిడ్డంగిలో ఉంచిన పౌర సరఫరాల శాఖకు చెందిన బియ్యాన్ని అమ్ముకున్నారు. ఇప్పుడు అది నిరూపితం కావడంతో అమ్ముకున్న బియ్యం విలువను తిరిగి చెల్లిస్తానని చెబుతున్నారు. ప్రభుత్వంలో ఇది సాధ్యమా? అయిందేదో అయిపోయింది.. తూచ్ అనుకోవడానికి ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలలో కుదరదు. రూల్ ఆఫ్ లా మాత్రమే పాటించాల్సిన అధికారులు అధికారంలో ఉన్న వారి మాటలకు గుడ్డిగా తలలాడిస్తే మూల్యం చెల్లించక తప్పదు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలా తలలాడించిన వాళ్లు జైలుకు వెళ్లాల్సి రావడంతో పాటు ఇప్పటికీ కేసుల నుంచి బయటపడలేదు. ఈ ఉదంతాలు తెలిసి కూడా ఇటు తెలంగాణలో అటు ఆంధ్రప్రదేశ్‌లో అఖిల భారత సర్వీసు అధికారులు రూల్ ఆఫ్ లా పాటించకుండా కష్టాలు కొని తెచ్చుకున్నారు. అధికారులు తప్పు చేయడానికి సిద్ధపడకపోతే రాజకీయ నాయకులకు కూడా ఇబ్బందులు రావు. ఫార్ములా–ఈ రేసు వ్యవహారమే ఇందుకు ఉదాహరణ. నిబంధనలకు విరుద్ధంగా తాను నిధులు విడుదల చేయలేనని హెచ్ఎండీఏ ప్రత్యేక కమిషనర్ హోదాలో అర్వింద్ కుమార్ స్పష్టంచేసి ఉంటే ప్రస్తుతం విచారణ ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడేది కాదు కదా. ఆయన నిబంధనలు పాటించి ఉంటే 55 కోట్ల రూపాయలు విడుదలయ్యేవి కావు. కేటీఆర్ మెడకు ఈ కేసు చుట్టుకునేదీ కాదు. అధికారులు విచక్షణతో వ్యవహరిస్తూ చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించబోమని స్పష్టం చేసినప్పుడు రాజకీయ నాయకులు కూడా తప్పు చేయలేరు. ఏదిఏమైనా తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టు బిగించారు. తనను ఇబ్బందులు పెట్టిన వారిపై ప్రతీకారం తీర్చుకొనే అవకాశం ఇప్పుడు ఆయనకు లభించింది. అంతిమంగా ఈ పోకడలు ఆయనకు లాభం కలిగిస్తాయా? నష్టం చేస్తాయా? అన్నది కాలమే నిర్ణయించాలి. ఏడాదిగా అమలుకు నోచుకోని పాత పథకాలను వచ్చే జనవరి నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నందున ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి తగ్గుముఖం పట్టవచ్చు. అదే సమయంలో కేటీఆర్‌ను అరెస్టు చేసి జైలుకు పంపితే ఆ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి లబ్ధి పొందే ఆలోచనలో ఉన్న బీఆర్ఎస్ ప్రయత్నాలు ఫలిస్తాయా? లేవా? అన్నది కూడా వేచి చూడాలి.

> గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వాళ్లు సినిమావాళ్ల జోలికి వెళ్లేవారు కాదు. ముఖ్యంగా హీరోలకు ఎంతో గౌరవం ఇచ్చేవారు. జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సినిమా హీరోలతో ఆడుకున్నారు. బడా బడా స్టార్లు తన వద్దకు పరిగెత్తుకుంటూ వచ్చి దేబిరించేలా చేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి జగన్‌లా క్రూరంగా కాకుండా చట్టాన్ని ఉపయోగించి తానేమిటో చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగిందని చెప్పి అక్కినేని నాగార్జునకు చెందిన 'ఎన్ కన్వెన్షన్'ను ఉన్నపళంగా కూల్చివేయించారు. ఇప్పుడు అల్లు అర్జున్‌ను అరెస్టు చేశారు. చంద్రబాబు, రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రులు అయినప్పుడు సినీ ప్రముఖులు స్వయంగా వెళ్లి వారిని అభినందించే వారు. జగన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి విషయంలో ఇది వెంటనే జరగలేదు. హైదరాబాద్‌లో నివసిస్తున్నా కూడా తెలంగాణ ముఖ్యమంత్రి పేరును సినిమా వాళ్లు గుర్తుంచుకోకపోవడాన్ని రేవంత్‌రెడ్డి జీర్ణించుకోలేకపోయి ఉండవచ్చు.

'ధర్మో రక్షతి రక్షితః' అంటారు. ధర్మాన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుంది. అధికారంలో ఉన్నప్పుడు ఈ కఠోర సత్యాన్ని అనుక్షణం గుర్తుంచుకునే వారిని కష్టాలు చుట్టుముట్టవు. తెలంగాణలో తన అధికారానికి తిరుగులేదని విర్రవీగిన కేసీఆర్ ప్రతిష్ఠ మసకబారుతోంది. ప్రస్తుతం ఆయనను కష్టాలు కమ్ముకుంటున్నాయి. ఈ పరిస్థితుల నుంచి తన కుటుంబాన్ని కాపాడుకుంటూ పార్టీని ఎలా బతికించుకుంటారు? అన్నది కేసీఆర్ అనుసరించబోయే వ్యూహాలపై ఆధారపడి ఉంటుంది. రేవంత్ రెడ్డిని తక్కువగా అంచనా వేసి కష్టాలను కొని తెచ్చుకున్నారు. కేటీఆర్‌ను జైలుకు పంపడంతో లెక్క సరిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతృప్తి చెందుతారా? తాను జైలుకు వెళ్లాల్సి రావడానికి ప్రధాన కారకుడైన కేసీఆర్‌ను కూడా అరెస్టు చేయించే వరకు వెనకడుగు వేయరా? అన్నదీ వేచి చూడాలి. ఔటర్ రింగ్ రోడ్, భూముల వ్యవహారంలో ఎవరెవరు చిక్కుకుంటారో తెలియదు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అందరూ కేసులలో చిక్కుకుంటే ఆ పార్టీ శ్రేణుల ఆత్మస్థైర్యం దెబ్బతినే ప్రమాదం లేకపోలేదు. అన్ని రోజులూ మనవి కావు అని కేసీఆర్ అండ్ కో ఇప్పటికైనా గుర్తుపెట్టుకుంటుందా?

> రూల్ ఆఫ్ లా మాత్రమే పాటించాల్సిన అధికారులు అధికారంలో ఉన్న వారి మాటలకు గుడ్డిగా తలలాడిస్తే మూల్యం చెల్లించక తప్పదు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలా తలలాడించిన వాళ్లు జైలుకు వెళ్లాల్సి రావడంతో పాటు ఇప్పటికీ కేసుల నుంచి బయటపడలేదు. ఈ ఉదంతాలు తెలిసి కూడా ఇటు తెలంగాణలో అటు ఆంధ్రప్రదేశ్‌లో అఖిల భారత సర్వీసు అధికారులు రూల్ ఆఫ్ లా పాటించకుండా కష్టాలు కొని తెచ్చుకున్నారు. అధికారులు తప్పు చేయడానికి సిద్ధపడకపోతే రాజకీయ నాయకులకు కూడా ఇబ్బందులు రావు. ఫార్ములా–ఈ రేసు వ్యవహారమే ఇందుకు ఉదాహరణ. నిబంధనలకు విరుద్ధంగా తాను నిధులు విడుదల చేయలేనని హెచ్ఎండీఏ ప్రత్యేక కమిషనర్ హోదాలో అర్వింద్ కుమార్ స్పష్టంచేసి ఉంటే ప్రస్తుతం విచారణ ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడేది కాదు కదా. ఆయన నిబంధనలు పాటించి ఉంటే 55 కోట్ల రూపాయలు విడుదలయ్యేవి కావు. కేటీఆర్ మెడకు ఈ కేసు చుట్టుకునేదీ కాదు. అధికారులు విచక్షణతో వ్యవహరిస్తూ చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించబోమని స్పష్టంచేసినప్పుడు రాజకీయ నాయకులు కూడా తప్పు చేయలేరు.



తాష్కెంట్ నుంచి తెలంగాణ దాకా...!

> భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని పార్లమెంటరీ మార్గంలో సాగించటంలోనూ, విప్లవోద్యమంగా మలచటంలోనూ నాయకత్వం విఫలమైంది. ఇది నాయకత్వ వైఫల్యమేగాని మార్క్సిజం వైఫల్యం కాదు.

భారత కమ్యూనిస్టు పార్టీ ఈ డిసెంబర్ 26న నూరవ ఏట ప్రవేశిస్తోంది. ప్రపంచంలో ఏ కమ్యూనిస్టు పార్టీలో లేని ఒక విచిత్ర వివాదం భారతీయ కమ్యూనిస్టుల్లో ఉంది. అది తమ మాతృసంస్థ (భారత కమ్యూనిస్టు పార్టీ) ఎప్పుడు ఆవిర్భవించింది? అన్న మీమాంస. 1920 జూలైలో జరిగిన కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సమావేశంలో వలస దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలను స్థాపించాలని నిర్ణయించగా, దాన్ని అమలు చేయటంలో భాగంగా ఎం.ఎన్.రాయ్ ఇండియా, స్పెయిన్ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీల స్థాపనకు కృషి చేశారు. 1920 అక్టోబర్‌లో సోవియట్ యూనియన్‌లోని తాష్కెంటులో భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. తాష్కెంటులో అప్పటికే ఉన్న భారతీయ ప్రవాసుల్లో కొంతమందిని కమ్యూనిస్టులుగా మార్చి, వారిలో కొందరికి శిక్షణ ఇచ్చి భారతదేశానికి పంపటానికి రాయ్ కృషి చేశారు. అయితే వారు బ్రిటిష్ వలస పాలకులకు దొరికిపోవటంతో వారిపై పెషావర్ కుట్రకేసు బనాయించి శిక్ష పడేట్లు చేశారు. వీరిలో మీర్ అబ్దుల్ మజీద్, మన్సూర్, రహ్మాన్‌ఖాన్, అక్బర్‌ఖాన్ తదితరులు తర్వాత కాలంలో ఇండియాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కృషి చేశారు.

అక్టోబర్ 17, 1920న తాష్కెంటు పార్టీ స్థాపన సమావేశంలో యం.యన్. రాయ్‌తో పాటు ఆయన భార్య ఎవలిన్ ట్రెండ్‌రాయ్, ఎ.ఎన్. ముఖర్జీ, రాసా ఫిటింగోవ్, మహమ్మద్ అలీ (అహ్మద్ హసన్), మహమ్మద్ షఫీర్ సిద్ధిఖ్, ప్రతివాద భయంకరాచారి తదితరులు పాల్గొన్నారు. మహమ్మద్ అలీని కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కారణాలేమైనా తాష్కెంటు పార్టీ స్థాపన భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం చేయటంలో పెద్దగా ఉపకరించలేదు. కాని కలకత్తా, బొంబాయి మద్రాసు, లాహోర్ లాంటి చోట్ల ఎవరికి వారుగా వారివారి తరహాలో కమ్యూనిస్టు గ్రూపులుగా పనిచేశారు.

ఈ స్థితిలో "ఇండియన్ కమ్యూనిస్టు పార్టీ" పేరుతో పనిచేస్తున్న 'సత్యభక్త' పై గ్రూపులన్నింటినీ ఆహ్వానించి 1925 డిసెంబర్ 26 నుంచి 28 వరకు కాన్పూర్‌లో 300 మందికి పైగా ప్రతినిధులతో ఒక సభ జరిపారు. ఇందులో ఎస్.వి. ఘాటే, కృష్ణస్వామి అయ్యర్, జోద్కర్, జానకీ ప్రసాద్, ముజఫర్ అహ్మద్, ఆర్.ఎస్ నింబకర్, అబ్దుల్ మజీద్, సయ్యద్ హసన్ తదితరులు పాల్గొనగా సభకు సింగారువేలు చెట్టియార్ అధ్యక్షత వహించారు. డాంగే తదితరులు జైల్లో ఉన్న కారణంగా హాజరు కాలేకపోయారు. ఈ సభకు ముందే కాన్పూరు కుట్ర కేసు బనాయించారు. కొంతమందికి శిక్షలు పడినా సింగారవేలు తదితరులపై కేసు కొట్టివేశారు. ఈ కేసులో ముద్దాయిగా పేర్కొన్న గులాం హుస్సేన్ జైలు నుంచి తప్పించుకున్నాడు. కాన్పూరు సభకు ఆహ్వానసంఘం అధ్యక్షునిగా హజరత్ మొహా వ్యవహరించారు.

పార్టీ పేరు ఇండియన్ కమ్యూనిస్టుగా ఉండాలని, జాతీయ కమ్యూనిస్టు పార్టీగా ఉంటే బహిరంగంగా పనిచేసే అవకాశం ఉంటుందని సత్యభక్త చేసిన వాదనని సభ తిరస్కరించింది. పార్టీకి 'కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా'గా పేరు స్థిరపరచింది. ఈ కారణంగా సత్యభక్త వెళ్లిపోయి ఇండియన్ కమ్యూనిస్టు పార్టీని స్థాపించుకొని ఆ తర్వాత కనుమరుగయ్యారు. కాన్పూరు సభలో పార్టీ కార్యదర్శులుగా ఎస్వీ ఘాటే, జానకీ ప్రసాద్, బాగేర్ హిట్టాల్‌ను ఎన్నుకున్నారు. కాని తర్వాత జానకీ ప్రసాద్‌ని పోలీసు ఏజెంటుగా అనుమానించి బయటకు పంపారు. ప్రారంభంలోనే బాలారిష్టాలు ఎదురైనా నాలుగైదు ఏళ్లలోనే పార్టీ స్థిరపడింది. కాన్పూరు కుట్ర కేసు పార్టీ ప్రచారానికి బాగా దోహదపడింది. సాంకేతికంగా పార్టీ ఆవిర్భావం 1920లో జరిగినా, 1925లో జరిగిన స్థాపననే కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కూడా గుర్తించింది. 1920 తాష్కెంటు సమావేశాన్ని పార్టీ స్థాపకదినంగా సీపీఎం, మరికొన్ని నక్సల్ గ్రూపులు భావిస్తుండగా, 1925 కాన్పూరు సమావేశాన్ని సీపీఐ, మరికొన్ని గ్రూపులు స్థాపకదినంగా భావిస్తున్నాయి.

1946 జూలై 4న రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దుం మొహియుద్దీన్‌ల పిలుపుతో ప్రారంభమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 2297 రోజులు సాగి, నాలుగువేల మంది వీరుల బలిదానం తర్వాత 1951 అక్టోబర్ 21న సుందరయ్య, రాజేశ్వరరావు, బసవపున్నయ్య, మద్దుకూరి చంద్రంల ప్రకటనతో విరమింపబడింది. నెహ్రూ ప్రభుత్వ పోలీసు చర్య తర్వాతనే ఎక్కువ మంది చంపబడ్డారు. పోలీసు చర్య తర్వాత పోరాటం కొనసాగించటం విషయంపై పార్టీలో తీవ్రస్థాయిలో విభేదాలు పొడచూపినా పోరాట ఫలాలను పరిరక్షించుకోవాలనే పేరుతో పోరాటం కొనసాగించాలని మెజారిటీగా వున్న అతివాదులు భావించారు. ఈనాటికీ వారు అదే వైఖరితో ఉన్నారు. అపరిమితమైన సంఖ్యలో అధునాతనమైన ఆయుధ సంపత్తితో ఉన్న ఆ సైన్యాన్ని కర్రలు, ఈటెలు, వడిసెలు, అరకొరగా ఉన్న పాతకాలపు తుపాకులతో ఎదుర్కోవటం ఔచిత్యం కాదని రావి నారాయణరెడ్డి లాంటి పెద్ద నాయకులు భావించినా, నిలబడి శ్రేణుల్ని ఒప్పించకుండా పోరాట ప్రాంతం నుంచి తప్పుకొని పోయినవారూ జరిగిన తప్పులకు పరోక్ష కారకులయ్యారు. మెరికల్లాంటి కార్యకర్తలు, నాయకుల ఈ కాలంలోనే తెలంగాణని తమ రక్తంతో పునీతం చేశారు.



నిజానికి డజన్ల సంఖ్యలో జరిగిన చీలికల్లో కూడా సిద్ధాంత భేదాలతో కూడిన నిబద్ధత కన్నా వ్యక్తిగత రాగద్వేషాలు, అవినీతి ఆర్థిక అరాచకాలు, లైంగిక బలహీనతలూ, పదవీలాలస ఇలా సమస్త దరిద్రాలు ఉద్యమంలో దాపురించాయి. పార్టీ ఏర్పడిన నాటి నుంచి రకరకాల సిద్ధాంత విభేదాలున్నా, ఎన్ని అవమానాలు జరిగినా 4 దశాబ్దాల పాటు పార్టీని చీల్చే సాహసం లబ్ధప్రతిష్ఠులైన అగ్రనాయకులు సైతం చేయలేకపోయారు. చివరకు గత్యంతరం లేని స్థితిలో 1964 జూలైలో తెనాలిలో సమావేశమై సీపీఎంగా ఏర్పడ్డారు. మళ్లీ అందులో నక్సల్‌బరి ఘటన మరో చీలికకు దారితీసింది. ఆ తర్వాత నక్సల్స్ డజన్ల సంఖ్యలో చీలిపోయినా అవన్నీ ఆయా నాయకులు తెచ్చి పెట్టుకున్న విభేదాలే కాని, వాటిలో నిజాయితీ పాళ్లు తక్కువ. దేశం సంగతేమో గాని, తెలుగు రాష్ట్రాల విషయం చెప్పాలంటే అందులో మావోయిస్టు పార్టీ, లిబరేషన్ పార్టీ తప్ప.. మిగిలిన డజను గ్రూపులూ ఒకనాటి నాగిరెడ్డి – పుల్లారెడ్డి నాయకత్వంలోని విప్లవకారుల సమన్వయ కమిటీ తాను నుంచి వచ్చిన పీలికలే. భిన్నాభిప్రాయానికి చీలికే పరిష్కారం అని పుల్లారెడ్డి చూపిన బాటనే తర్వాత తర్వాత అందరూ అనుసరించారు. అనుసరిస్తున్నారు. మూడు ఐక్యతలు, ఆరు చీలికలుగా వర్ధిల్లుతున్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల చరిత్రలో ఎన్నో కుటుంబాలు ధ్వంసమయ్యాయి, ఛితికిపోయాయి. అమరవీరుల త్యాగాలు నిష్ఫలమయ్యాయి. దశాబ్దాలుగా కమ్యూనిస్టు పార్టీలో కార్యకర్తలుగా ఉండి సేవలందించి సజీవులుగా ఉన్నవారు వారు చేసిన కృషి నిష్ప్రయోజనం అయిందనే వేదనకు గురవుతున్న సందర్భమిది. నాయకత్వం పట్ల కార్యకర్తలకు అపనమ్మకం ఉన్న స్థితి, ఎన్నో దశాబ్దాల కాలం పనిచేసిన కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి ఉన్నా మంచో, చెడో కాలక్షేపం చేద్దామనే నిరాశ ఈనాడు ఎర్రపార్టీల్లో కన్పిస్తున్న కఠోర వాస్తవం. సామరస్యం సాధ్యంకాని అనేక సమూహాల మధ్య సాధ్యమే అన్నట్లు చెబుతున్న కమ్యూనిస్టు ఉద్యమంలో ఎక్కువగా దుర్వినియోగం కాబడే పదాలు ఐక్యత, విలీనం. తెలిసి తెలిసి పదేపదే ఈ పదాన్ని వల్లిస్తూ అటు తమ శ్రేణుల్ని, ఇటు అసంఖ్యాక ప్రజానీకాన్ని వంచించే కపటత్వాన్ని నాయకత్వం గత శతాబ్ద కాలంగా సాగిస్తూనే ఉంది.

ఏమైనా భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని పార్లమెంటరీ మార్గంలో సాగించటంలోనూ, విప్లవోద్యమంగా మలచటంలోనూ నాయకత్వం విఫలమైంది. ఇది నాయకత్వ వైఫల్యమే గాని మార్క్సిజం వైఫల్యం కాదు.

• చెరుకూరి సత్యనారాయణ

తళుక్కు తార..

ప్రముఖ సినీనటి శ్రీలీల శనివారం కొత్తపేటలో తళుక్కున మెరిశారు. శ్రీవైభవం షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆమె ఫొటోలకు ఇలా పోజిచ్చారు.





అద్దాల మేడలు భద్రమేనా..?

సత్వా ప్రమాదంతో చర్చ

- రోడ్డుపై పడిన గాజు ముక్కలు
- ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో తప్పిన ముప్పు
- పక్కనున్న భవనం అద్దాలూ ధ్వంసం
- ఐటీ కారిడార్‌లో పెరుగుతోన్న అద్దాల మేడల సంస్కృతి
- ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంటే కష్టమే..?

కళ్లు జిగేల్‌మనేలా అందంగా కనిపించే అద్దాల మేడలు భద్రమేనా.. అన్న ప్రశ్న ప్రస్తుతం పలువురిని కలిచివేస్తోంది. అనుకోని దుర్ఘటనలు జరిగినప్పుడు కాంక్రీట్ నిర్మాణాలతో పోలిస్తే ప్రమాద తీవ్రత, నష్టం ఎక్కువా..? తక్కువా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది. రాయదుర్గంలోని సత్వా భవనంలో అగ్ని ప్రమాదం సంభవించిన నేపథ్యంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గంలోని నాలెడ్జిసిటీ సత్వా ఎలిగ్జర్‌లో శనివారం తెల్లవారు ఝామున జరిగిన ప్రమాదంతో భవనంలోని అద్దాలు పగిలాయి. వాటి ముక్కలు భవనం ముందున్న ప్రధాన రహదారిపై పడ్డాయి. ఐటీ సంస్థలకు సెలవు దినం కావడం.. ఆ సమయంలో రోడ్డుపై వాహనదారులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే గాజు ముక్కలు పక్కనున్న భవనంపై పడడంతో దాని అద్దాలూ పగిలాయి. దీంతో అద్దాల మేడల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగానే ఈ తరహా నిర్మాణాలు సురక్షితమేనా..? అన్న చర్చ మొదలైంది.

వెలుతురు ఎక్కువ.. వేడి తక్కువ

ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్(ఈసీబీసీ)లో భాగంగా మెజార్టీ సంస్థలు పర్యావరణహిత నిర్మాణాల వైపు మొగ్గు చూపుతున్నాయి. వెలుతురు వచ్చేలా.. భవనం లోపల వేడి తక్కువగా ఉండేలా వీటిని డిజైన్ చేస్తున్నారు. దీంతో ఎక్కువ లైట్లు ఆన్ చేయాల్సిన అవసరం ఉండదని, భవనం లోపల ఉష్ణోగ్రత తక్కువగా ఉంటే ఏసీ వాడకమూ తగ్గుతుందని, తద్వారా విద్యుత్ వినియోగం ఎక్కువ అవసరం ఉండదని నిపుణులు

మిగతా 8వ పేజీలో..

18 అంతస్తుల వరకే అగ్నిమాపక వ్యవస్థ

- ఆ పైన జరిగితే.. అంతే సంగతులు
- నగరవాసులను భయపెడుతున్న అగ్ని ప్రమాదాలు

హైదరాబాద్ సిటీ, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ఆకాశహర్మ్యాల్లో అగ్నిప్రమాదాలు ప్రస్తుతం ప్రతి ఒక్కరినీ భయపెడుతున్నాయి. నగరంలో ఎత్తయిన భవనాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే మంటలు ఆర్పే బ్రాంటో స్కై లిఫ్ట్ (భారీ నిచ్చెన)ను వినియోగిస్తున్నారు. ఇదీ సుమారు 18 అంతస్తులు (54 మీటర్లు) ఎత్తు వరకు వెళ్లి మంటలు ఆర్పేందుకు దోహదపడుతుంది. అయితే 18 అంతస్తులు పైబడిన ఆకాశహర్మ్యాల్లో మంటలు చెలరేగితే నివారించే వ్యవస్థ నగరంలోని అగ్నిమాపక శాఖకు లేదు. ఇదే అంశం ఇప్పుడు నగరవాసులను భయాందోళనలకు గురిచేస్తోంది. అందరూ ఎంతో ఇష్టంగా 20 అంతస్తులు పైబడిన భవనాల్లో ఉండేందుకు ఆసక్తి చూపుతుండగా, మరో వైపు భయాందోళన వారిని వెంటాడుతోంది.

రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

నేరేడ్‌మెట్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్‌లో జీకే ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో శనివారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. భవనంలోని రెండో అంతస్తులో ఏసీలో షార్ట్‌సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం సంభవించినట్లు నిర్వాహకులు గుర్తించారు. వెంటనే స్థానికులు పోలీసులకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, పెద్దగా ఆస్తి నష్టమూ జరగలేదని జవహర్‌నగర్ పోలీసులు తెలిపారు.



రెస్టారెంట్‌లో వ్యాపిస్తున్న మంటలు

ఐటీ జేటీసీగా మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్

- రవాణా శాఖలో పదోన్నతులు..
- పలువురు అధికారులకు స్థానచలనం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖలో పలువురు అధికారులకు పదోన్నతులతో స్థానచలనం కలిగింది. ఈ మేరకు పోస్టింగ్‌లిస్తూ శనివారం రవాణాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్‌కు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఐటీ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(జేటీసీ) బాధ్యతలు అప్పగించారు. నాగోల్ ఆర్‌టీఓ రవీందర్‌కుమార్‌కు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ)గా పదోన్నతి లభించిన నేపథ్యంలో ఆయనను ఆదిలాబాద్ డీటీసీగా, ఉప్పల్ ఆర్‌టీఓ ఎన్.వాణికి నల్గొండ డీటీసీగా పోస్టింగ్ ఇచ్చారు. ఖాళీ అయిన ఉప్పల్, నాగోల్ స్థానాల్లో ఆర్‌టీఓలకు సంబంధించి నేడు ఉత్తర్వులు వెలువడుతాయని రవాణా శాఖ వర్గాలు చెబుతున్నాయి.

గ్రీన్.. జెయింట్.. కోర్

- కోడ్ భాషలతో గంజాయి కొనుగోలు
- నీతూబాయ్ గంజాయి కస్టమర్స్‌పై ఎక్సైజ్ పోలీసులు నజర్
- రెండు రోజుల్లో అదుపులోకి 150 మంది..



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నానక్‌రామ్‌గూడలో గంజాయి డాన్‌గా పేరుగాంచిన నీతూబాయ్ వద్ద గంజా కోసం ఎగబడుతున్న కస్టమర్స్‌పై ఎక్సైజ్ పోలీసులు నజర్ పెట్టినట్లు తెలిసింది. ప్రస్తుతం నీతూబాయ్ వ్యవహారం అటు ఎక్సైజ్ ఇటు పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగి ఆమె వద్ద గంజాయి కొనుగోలు చేయడానికి ఎవరెవరు వస్తున్నారు..? ఎంత మంది వస్తున్నారనేది ఆరా తీస్తున్నారు. అయితే, కేవలం 15 నిమిషాల్లోనే 20 మంది కస్టమర్స్ గంజాయి కోసం వచ్చినట్లు గుర్తించిన పోలీసులు.. ఒక్క గంటలో వారి సంఖ్య 80-100మందికి చేరినట్లు గుర్తించారు.

రహస్యంగా విచారణ..

వినియోగదారులపై ప్రత్యేక నిఘా పెట్టిన ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ (స్టేట్ టాస్క్ ఫోర్స్) స్పెషల్ టీమ్స్.. రెండు రోజులపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 150మంది కస్టమర్స్‌ను అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వారిలో ఐటీ ఉద్యోగులు, ఇతర ప్రాంతాలకు చెందిన కార్మికులు ఉన్నట్లు సమాచారం. వారందరినీ శివారు ప్రాంతాల్లోని రహస్య ప్రాంతాలకు తరలించి సెల్‌ఫోన్‌లు సీజ్ చేసి విచారించినట్లు తెలుస్తోంది. ఎప్పటి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నారు..? సరుకును ఎక్కడ

మిగతా 6వ పేజీలో..

పుస్తకం మురిసింది..

ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న 37వ హైదరాబాద్ పుస్తక మహోత్సవం శనివారం కళకళలాడింది. వీకెండ్ కావడంతో భారీ ఎత్తున పుస్తకప్రియులు సందడిచేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



8

నృత్యం చేస్తున్న యువతి

మేరీ క్రిస్మస్ ..



ఎల్‌బీ స్టేడియంలో శనివారం రాత్రి తెలంగాణ క్రిస్టియన్ కార్పొరేషన్, మైనారిటీ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మేరీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారీ సంఖ్యలో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. చిన్నారు లకు ముఖ్యమంత్రి క్రిస్మస్ కానుకలను అందజేశారు.

విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

శంషాబాద్ రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి పుణే వెళ్తున్న ఎయిరిండియా విమానం శంషాబాద్ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండ్ అయింది. 160మంది ప్రయాణికులతో చెన్నై నుంచి పుణే బయల్దేరిన ఐఎక్స్1675 విమానం టేకాఫ్ తరువాత కాసేపటికి ఇంధనం తక్కువగా ఉందని గమనించిన పైలెట్లు ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఏటీసీ అధికారులను సంప్రదించారు. రన్‌వేపై ఇతర విమానాలను నిలిపివేసి అత్యవసర ల్యాడింగ్‌కు అనుమతిచ్చారు. ఇంధనాన్ని నింపుకున్న తరువాత విమానం పుణే వెళ్లినట్టు ఆర్‌జీఐఏ అధికారులు తెలిపారు.

ఆక్రమణలున్నా.. అనుమతి లేని లేఅవుట్‌లో ప్లాటున్నా

రిజిస్ట్రేషన్ చేయొద్దు

- హైడ్రాకు న్యాయ సలహాలందిస్తాం

8

ముగిసిన రాష్ట్రపతి శీతాకాల విడిది

గజానికి 81,000

ఓల్డ్‌సిటీ మెట్రో కోసం హెచ్‌ఏఎంఎల్ పరిహారం

- బాధితుల విజ్ఞప్తికి కలెక్టర్ అనుదీప్ సానుకూల ప్రకటన
- రసూల్‌పురా మెట్రోభవన్‌లో సమ్మతి లేఖల స్వీకరణ
- ఇప్పటివరకు 40 మంది నుంచి సంతకాలు..
- అనుకూలురకు పది రోజుల్లో చెక్కులు

పాతబస్తీలో మెట్రో కారిడార్-6 పనులు చకచకా సాగుతున్నాయి. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మించే మెట్రో రైల్ నిర్మాణ పనులకు ఒక్కొక్కటిగా అడ్డంకులు తొలుగుతున్నాయి. కారిడార్ పరిధిలో ఆస్తులు కోల్పోతున్న బాధితులకు పరిహారం ఇచ్చే విషయంలో గజానికి రూ.81వేలుగా చెల్లించేందుకు హెచ్‌ఏఎంఎల్ అంగీకరించింది. బాధితులు ఒక్కొక్కరుగా వచ్చి మెట్రో అధికారులకు తమ సమ్మతి పత్రాలను, డాక్యుమెంటేషన్లను అందజేస్తున్నారు.



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌సిటీ మెట్రో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొత్త సంవత్సరంలో పనులను ఎలాగైనా ప్రారంభించాలనే లక్ష్యంతో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్‌ఏఎంఎల్) అధికారులు ముందుకు సాగుతున్నారు. రెండో దశ విస్తరణలో భాగంగా కారిడార్-6 కింద ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల

మిగతా 6వ పేజీలో..

ఇప్పటివరకు 40 మంది సంతకాలు..

గజానికి రూ.81వేల చొప్పున పరిహారం ఇచ్చేందుకు కలెక్టర్ చేసిన ప్రతిపాదనకు అంగీకరించిన కొందరు మూడు రోజులుగా రసూల్‌పురాలోని మెట్రోభవన్‌కు వెళ్లి సంతకాలు, డాక్యుమెంటేషన్ పూర్తి చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు 40 మంది సంతకాలు చేసినట్లు సమాచారం. ఇదిలాఉండగా, భూవి విలువకు మాత్రమే గజానికి రూ.81వేలు ఇస్తున్నామని, ఇల్లు, భవన నిర్మాణ ఖర్చుల కింద యజమానులు, కిరాయిదారులకు రిహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ (ఆర్‌అండ్‌ఆర్) ప్యాకేజీ కింద అదనంగా మరికొంత పరిహారం చెల్లిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. కాగా, సమ్మతి లేఖలు ఇచ్చిన వారికి 10 రోజుల్లో పరిహారం ఇస్తామని హెచ్‌ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.



ఒప్పంద పత్రాలను చూపుతున్న ఎన్వీఎస్ రెడ్డి తదితరులు

మహిళల భద్రతకు ప్రాధాన్యం

- ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీలో ప్రత్యేక నంబర్
- మహిళా కెప్టెన్ల సేవలను 35 నుంచి 40 శాతం పెంచాలి
- త్వరలో ఓల్డ్‌సిటీలో కూల్చివేత పనులు ప్రారంభం
- హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైళ్లలో మహిళా ప్యాసింజర్ల భద్రతకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీలో భాగంగా విద్యార్థినులు, మహిళలకు ఇబ్బందులు ఎదురైతే తక్షణమే పోలీసు సేవలను పొందేందుకు ప్రత్యేక నంబర్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. నగరంలో మెట్రోకు అనుసంధానంగా నడిపిస్తున్న ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కింద శనివారం నగరంలో ర్యాపిడో సంస్థతో ఎల్అండ్‌టీ, హెచ్ఎంఆర్‌లు పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో 5 లక్షల మంది మెట్రోరైళ్లను వినియోగించుకుంటే.. అందులో లక్ష మంది ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కింద వివిధ ట్యాక్సీలు, ఆర్టీసీ బస్సుల ద్వారా సేవలు పొందుతున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్య 2 లక్షలకు పెరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. కాలుష్య నివారణ కోసం ప్రైవేట్ సంస్థలు ఎలక్ట్రిక్ బైక్‌లు, ఆటోలు, కార్లను మెట్రో స్టేషన్ల నుంచి నడిపించాలన్నారు. ప్రధానంగా 30-40 శాతం

మిగతా 7వ పేజీలో..

తల్లిదండ్రులకు చెబుతా అనడంతో..

భార్యను హత్య చేసిన భర్త.. అరెస్ట్


నిందితుడు వెంకట్

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్యను చేసిన భర్తను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాందేడ్ జిల్లా, ఉమ్రి మండలం, గోల్‌గావా గ్రామానికి చెందిన మాసేవాడ్ వెంకట్(30) అలియాస్ వ్యంకతి మరోటి మాసేవాడ్ బతుకుదెరువు కోసం కుటుంబ సభ్యులతో వలస వచ్చి కొంపల్లిలోని మసీదు సమీపంలో అద్దె ఇంట్లో ఉంటూ.. కూలి పనులు చేసుకుంటున్నాడు. మాసేవాడ్ వెంకట్, సోని అలియాస్ రేవని పావనితో సుమారు 12 సంవత్సరాల క్రింతం వివాహమైంది. దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. పిల్లలను నాందేడ్‌లోని మాసేవాడ్ వెంకట్ తల్లిదండ్రుల వద్ద ఉంచారు. వీరి జీవితం కొన్ని రోజులు సజీవంగా సాగింది. తాగుడుకు బానిసైన మాసేవాడ్ వెంకట్ తరచూ భార్యతో గొడవపడుతూ, వేధించేవాడు. బాధలు భరించలేని భార్య తల్లిదండ్రులకు తెలియజేసి, రెండు, మూడుసార్లు పంచాయితీ పెట్టుకొని, పుట్టింటికి వెళ్లింది. దీంతో పెద్దలసమక్షంలో భార్యను ఒప్పించి కొంపల్లికి తీసుకొచ్చాడు. ఈనెల 20న ఉదయం 6 గంటలకు పనికోసం వెంకట్ రోజూ మాదిరిగానే వెళ్లి, 11.30 గంటలకు మద్యం తాగి, ఇంటికి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. భార్య తల్లిదండ్రులకు చెబుతా అన్నది. దీంతో ఆవేశానికి గురైన వెంకట్ వంట కోసం తెచ్చుకున్న సెంట్రింగ్ కర్రతో భార్యతలపై మోదడంతో అక్కడికక్కడే మరణించింది. దీంతో అతడు పారిపోయాడు. స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా నిజామాబాద్ టోల్‌ప్లాజా వద్ద బైక్‌పై వెళుతున్న నిందితుడిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి, రిమాండ్‌కు తరలించారు.

గజానికి రూ.81వేలు

(5వ పేజీ తరువాయి)

పనులను ప్రతిపాదించిన విషయంతెలిసిందే. ఈ మార్గంలో చేపడుతున్న నిర్మాణంలో 1,100 ఆస్తులు ప్రభావితమవుతున్నట్లు హెచ్ఏఎంఎల్ అధికారులు గతంలో గుర్తించారు. ఇప్పటి వరకు 900 ఆస్తులకు నోటిఫికేషన్ జారీచేశారు. అందులో 400 ఆస్తులకు ప్రిలిమినరీ డిక్లరేషన్ ఇవ్వగా.. 200 ఆస్తులకు పరిహారం చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జనరల్ అవార్డు కింద రూ.65వేలు ప్రకటన..

7.5 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా రోడ్డు మధ్య నుంచి రెండు వైపులా 100 మీటర్ల చొప్పున భూసేకరణ చేస్తున్నారు. దీంతో దారుల్‌షిఫా నుంచి చాంద్రాయణగుట్ట వరకు కమర్షియల్ భవనాలు, ఇళ్లను పెద్దఎత్తున కోల్పోవాల్సి వస్తోంది. ఏయే ప్రాంతంలో ఎన్ని ఆస్తులు పోతున్నాయో ఇప్పటికే నోటిఫికేషన్ ద్వారా తెలియజేసిన హెచ్ఏఎంఎల్‌కు చెందిన రెవెన్యూ అధికారులు పరిహారం చెల్లింపు విషయాన్ని కూడా బాధితులకు వివరించారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ (ఎస్ఆర్ఓ) ధర గజానికి రూ.26,700 మాత్రమే ఉందని.. దానికంటే ఎక్కువగా రూ.65 వేలు ఇస్తామని కొన్నిరోజుల క్రితం వారు జనరల్ అవార్డు ప్రకటించారు. అయితే అధికారులు చెప్పిన పరిహారానికి చాలామంది అంగీకరించలేదు. తమకు గజానికి రూ.1.50 లక్షల వరకు ఇవ్వాలని పట్టుబట్టడంతో వారిని బుజ్జగిస్తూ వచ్చారు. బాధితులు అడుగుతున్న పరిహారం విషయాన్ని అధికారులు ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

కలెక్టర్‌ను కలిసిన..

తాము ఎన్నో ఏళ్లుగా ఇక్కడ నివాసముంటున్నామని, వ్యాపారాలు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఆస్తులను తొలగిస్తే ఉపాధి కరువై ఇబ్బందులు పడుతామని బాధితులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కారిడార్ నిర్మాణంలో 80 శాతం వరకు ఆస్తులను కోల్పోతున్న 50 మంది కమర్షియల్ భవన యజమానులు గత మంగళవారం కలెక్టర్ అనుదీప్‌ను కలిశారు. తమకు గజానికి రూ.1.50 లక్షల వరకు ఇచ్చి ఆదుకోవాలని వారు కోరినట్లు తెలిసింది. అయితే స్థానిక ఎస్ఆర్ఓ ధర రూ.26,700 మాత్రమే ఉందని, పలుచోట్ల రూ.20,300 వరకు మాత్రమే ఉందని కలెక్టర్ వారికి చెప్పినట్లు తెలిసింది. వాస్తవంగా అర్బన్ ఏరియాలో సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ (ఎస్ఆర్ఓ) ధరకు ఒకవంతు మాత్రమే అదనంగా రేటుపెంచి ఇస్తుంటారని, తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.81వేల వరకు ఇప్పిస్తానని, దీనికి ఒప్పుకుంటే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి సూచించడంతో అంగీకరించారు. దీంతో కలెక్టర్ శనివారం పరిహారం విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.

గ్రీన్.. జెయింట్.. కోర్

(5వ పేజీ తరువాయి)

తీసుకుంటున్నారు? ఎంతచొప్పున చెల్లిస్తున్నారనే కోణంలో విచారించి, స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నట్లు తెలిసింది.

కోడ్ భాషతో కొనుగోలు..

గంజాయిని కొనుగోలు చేసే క్రమంలో నీతూబాయ్ అడ్డా వద్ద వినియోగదారులు వివిధ కోడ్ భాషలను వినియోగిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. కొంతమంది ఐటీ ఉద్యోగులు గ్రీన్ అని, వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు జెయింట్ అని, మరికొంత మంది కోర్ అనే కోడ్ భాషతో గంజాయిని కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. అలా కస్టమర్స్ చెప్పిన కోడ్ బట్టి వారికి అడిగిన గంజాయి పొట్లాలను నీతూబాయ్ టీమ్ అందిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు గుర్తించినట్లుగా తెలిసింది. ఇలా రోజుకు 15-20 కేజీల గంజాయి విక్రయిస్తూ రూ.5 లక్షలు సంపాదిస్తున్న లేడీ డాన్ నీతూబాయ్ కోసం ఎక్సైజ్ పోలీసులు గాలిస్తున్నారు.

మూడో వంతే ట్రేడ్ లైసెన్స్‌లు

జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరిది

హైదరాబాద్‌సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో అనుమతి లేకుండా జోరుగా వ్యాపారాలు సాగుతున్నాయి. నివాసేతర కేటగిరిలో ఆస్తిపన్ను చెల్లిస్తోన్న వారిలో మూడో వంతు మాత్రమే ట్రేడ్ లైసెన్సులు తీసుకున్నారు. జీహెచ్ఎంసీలోని ఆస్తిపన్ను చెల్లింపుదారుల వివరాల ఆధారంగా ఈ విషయాన్ని అధికారులు గుర్తించారు. గ్రేటర్‌లో 3,17,033 గృహాలు నాన్ రెసిడెన్షియల్ పరిధిలో ఉంటే డిసెంబరు-19 నాటికి 1,09,702 మంది మాత్రమే ట్రేడ్ లైసెన్సు తీసుకొని ఫీజు చెల్లించాలన్నారు. నివాసేతర కేటగిరిలో పన్ను చెల్లిస్తోన్న ఆస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వారంతా డిసెంబరు 31లోగా ట్రేడ్ లైసెన్సులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఇలంబరిది శనివారం ఆదేశాలు జారీచేశారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | సినీ ప్లానెట్ - కొంపల్లి
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | ఏషియన్ రాధిక - కాప్రా
ఫోరం మాల్ - కూకట్‌పల్లి | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఆర్.కె. - బంజారాహిల్స్ | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
గలేరియా - పంజాగుట్ట | మిరాజ్ సినిమాస్ - బాలానగర్
ఐకాన్ - హైటెక్‌సిటీ | మిరాజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | సినీటౌన్ - మియాపూర్
పివిఆర్ సినిమాస్ - మూసారాంబాగ్ | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ప్రిస్టన్ మాల్ - గచ్చిబౌలి | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
అట్రియమ్ - గచ్చిబౌలి | మూవీటైమ్ - అమీర్‌పేట
ఎస్2 సోము - మల్లాపూర్ | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ | స్కైమాల్ - సనత్‌నగర్
ఎం.పి మాల్ - కాచిగూడ | టివోలి - సికింద్రాబాద్
జిఎస్ఎమ్ - మదీనగూడ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | షా షహెన్‌షా - చింతల్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి | లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
మంత్రామాల్ - అత్తాపూర్ | మూవీమ్యాక్స్ - మౌలాలి
సుధా - శాలిబండ | జె.పి.సినిమాస్ - చందానగర్
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ | అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్ | మరియు మీ అభిమాన థియేటర్లలో

మెట్రోలో మహిళల భద్రతకు ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

వరకు మహిళా కెప్టెన్ల ద్వారా ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని అందిస్తే ఆ వర్గానికి చెందిన ప్రయాణికులకు మరింత ధైర్యం, అనుకూలత ఉంటుందన్నారు. నగరంలో మెట్రో రెండోదశ విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, ఓల్డ్‌సిటీలో త్వరలో కూల్చివేత పనులను ప్రారంభిస్తామన్నారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 1100 ఆస్తులు మెట్రో నిర్మాణంలో పోతున్నాయని, ఆస్తులు కోల్పోతున్నవారికి గజానికి రూ.81వేల పరిహారం అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

గ్రీన్ ట్యాక్సీలు తీసుకొస్తాం: వరదరాజన్

రానున్న రోజుల్లో నగరంలో ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కింద మెట్రో స్టేషన్ల నుంచి రోజుకు 2లక్షల మందికి సేవలందిస్తామని ఎల్అండ్‌టీ చీఫ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ మురళీవరదరాజన్ అన్నారు. ప్రధానంగా గ్రీన్ ట్యాక్సీలను అందుబాటులోకి తీసుకొచ్చి కాలుష్యాన్ని అరికట్టేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఎల్అండ్‌టీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రిషివర్మ మాట్లాడుతూ 2021లో ర్యాపిడో సంస్థతో తాము ఒప్పందం చేసుకున్నామని, ప్రస్తుతం రోజుకు 45వేల మంది ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని సేవలు పొందుతున్నారని, రానున్న రోజుల్లో 75వేల మంది వినియోగించుకునేలా కృషి చేస్తామన్నారు. ర్యాపిడో కోఫౌండర్ పవన్ మాట్లాడుతూ.. నగరంలో బైక్‌లు, ఆటోలు, కార్ల ద్వారా తాము ప్రతిరోజు 2.7 లక్షల మందికి సేవలందిస్తున్నట్లు చెప్పారు. మెట్రో స్టేషన్ల నుంచి 0-3 కిలోమీటర్ల వరకు 30, 3-4 కిలోమీటర్లకు రూ.40, 4-5 కిలోమీటర్లకు రూ.50 చొప్పున చార్జీలను తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎల్అండ్‌టీ అధికారులు, ర్యాపిడో సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాథమెటిక్స్‌పై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి



విద్యార్థులు చేసిన గణితశాస్త్ర నమూనాలను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, తదితరులు

రాజేంద్రనగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): చిన్న నాటి నుంచే విద్యార్థులు మ్యాథమెటిక్స్‌లో ఆసక్తిని పెంచుకొని రాణిస్తే పెద్దయ్యాక మంచి భవిష్యత్తు ఉంటుందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ అన్నారు. మైలార్‌దేవుపల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లోని శ్రీ విద్యానికేతన్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థుల ఆధ్వర్యంలో మ్యాథమెటిక్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బోయ లక్ష్మణ్, ప్రిన్సిపాల్ బోయ నాగలక్ష్మీ, రాజేంద్రనగర్ మండల గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరవన్‌కుమార్, జిల్లా నాయకులు ఎ.యాదగిరి, మహ్మద్ వాజీద్, మ్యాథమెటిక్స్ టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం, శాంతి



యోగా వేడుకలో పాల్గొన్న నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏపీ రాజశేఖర్

బర్కత్‌పుర, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ఆరోగ్యం, శాంతి నెలకొంటుందని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏపీ రాజశేఖర్ అన్నారు. శనివారం నిజాం కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాతో మంచి అలవాట్లు, శారీరక మానసిక ఆరోగ్యం, ఆధ్యాత్మికత, విద్యాపరమైన విలువలు పెంపొందుతాయన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రావంతి మాట్లాడుతూ.. వేదకాలం నుంచి యోగా విద్యకు భారత్ పేరు గాంచిందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులు అజయ్, హరి, నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.ఉపేందర్‌రెడ్డి, అకాడమి కో-ఆర్డినేటర్ ఎస్.రేణుక, డాక్టర్ మిల్లిశా ఏలేనా, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.కవిత తదితరులు పాల్గొన్నారు.



● చార్మినార్ సర్కిల్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఓటర్ ఐడీ తదితర సమస్యలపై అన్ని పార్టీల నాయకులతో చర్చిస్తున్న చార్మినార్ సర్కిల్ డీఎంసీ సరిత, నాయకులు సలా ఉద్దీన్ లోదీ, హైదర్ జాఫ్రీ, ముసా ఖాసీం, తదితరులు - చార్మినార్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి)

గంజాయి విక్రయాలను అరికట్టాలి



ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రాజేంద్రనగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్, పద్మశాలిపురం, కాటేదాన్ పారిశ్రామిక వాడ, బుద్వేల్ రైల్వే స్టేషన్ పరిసర బస్తీలు, వెంకటేశ్వర కాలనీ, నేతాజీనగర్, శ్రీరాంనగర్ కాలనీలలో గంజాయి విచ్చల విడిగా విక్రయిస్తున్నారని సీపీఎం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యదర్శి జి.కురుమయ్య అన్నారు. ఈమేరకు శనివారం శంషాబాద్ ఎక్సైజ్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఇటీవల గంజాయి సేవించి ఎర్రబోడలో కొందరు యువకులు ఓ కారు డ్రైవర్‌పై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారని, వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తిని గాయపరిచారని గుర్తు చేశారు. దారిన పోయే మహిళలను వేధిస్తున్నారన్నారు. దీనిపై నిఘా పెట్టి గంజాయిని అరికట్టాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు జె.రుద్రకుమార్, బచ్చలకూర స్వామి, బి.వెంకటయ్య, మన్యం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘరానా నేరస్థుడు, రౌడీషీటర్ అరెస్టు



నిందితుడు మహ్మద్ ఇఫ్తేకర్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ట్రై కమిషనరేట్స్ పరిధిలో పోలీసులు కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న ఘరానా నేరస్థుడు, రౌడీషీటర్ ఆకట్టించారు సిటీ సీసీఎస్ పోలీసులు. నిందితుడిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. వివరాల్లోకి వెళ్తే.. చంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ ఇఫ్తేకర్ క్యాబ్‌డ్రైవర్. వచ్చే ఆదాయం సరిపోక దోపిడీలు, దొంగతనాలు, పలు నేరాలకు పాల్పతుండడంతో అతడిపై రౌడీషీట్ నమోదై ఉంది. ఈ క్రమంలో ట్రై కమిషనరేట్ పరిధిలో 2019 నుంచి ఇప్పటి వరకు సుమారు 20కేసులు నమోదయ్యాయి. అయినా నిందితుడు పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ప్రత్యేక దృష్టి సారించిన ఉన్నతాధికారులు నిందితుడిని పట్టుకోవాల్సిందిగా సీసీఎస్ డిటెక్టివ్ టీమ్‌ను ఆదేశించారు. డీసీపీ శ్వేత ఆదేశాలతో ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ భిక్షపతి టీమ్ రంగంలోకి దిగింది. ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసు లు శనివారం నిందితుడు మహ్మద్ ఇఫ్తేకర్‌ను అదుపులోకి తీసుకొని పంజాగుట్ట పోసులకు అప్పగించారు. ఇటీవల పంజాగుట్ట పరిధిలోని వరుస నేరాలకు పాల్పడడం గమనార్హం. నిందితుడిని రిమాండ్ చేసిన పంజాగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భాషా సంస్కృతుల పరిరక్షకుడు 'వరప్రసాద్ రెడ్డి'



శాంతా వసంతా ట్రస్ట్ ఆధ్వర్యంలో సుద్దాల అశోక్‌తేజ, మన్నం వెంకటరాయుడుకు పురస్కారాల ప్రదానోత్సవం.. చిత్రంలో వరప్రసాదరెడ్డి, రమణాచారి తదితరులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాణాధారమైన టీకాలను మానవాళికి అందించడమే కాకుండా, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణను ఒక మహోద్యమంలా నిర్వహిస్తున్న మానవతావాది శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకుడు వరప్రసాద్‌రెడ్డి అని ఆచార్య ఎల్లూరి శివారెడ్డి కొనియాడారు. ఆయన ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందిస్తూ, సమాజంపై తన బాధ్యతను నిర్వర్తిస్తున్న సౌజన్యశీలి అని శ్లాఘించారు. శాంతా వసంతా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వ త పరిషత్తు సభామందిరంలో మనసు ఫౌండేషన్ నిర్వాహకుడు మ న్నం వెంకటరాయుడుకు 'వేంకట రమణారెడ్డి సాహితీ సేవారత్న' పురస్కారాన్ని, ప్రఖ్యాత సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు 'డా.వరప్రసాద్‌రెడ్డి ఉత్తమ సాహితీవేత్త' అవార్డును తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారుడు కేవీ రమణాచారి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు పురస్కారాన్ని అందజేశా రు. అనంతరం రమణాచారి మాట్లాడుతూ తల్లిదండ్రులు శాంత, వేంక ట రమణారెడ్డి స్మారకంగా సాహితీమూర్తులు, కళాకారులను ప్రోత్సహిస్తూ అవార్డులు ఇవ్వడం గొప్పవిషయం అని ప్రశంసించారు. భాషా సంస్కృతుల పట్ల అపారమైన గౌరవంతోనే సమాజానికి తమ వంతు బాధ్యతగా సేవలందిస్తోన్న కవులు, కళాకారులను గుర్తించి, ఆ సేవామూర్తులను ప్రతి ఏటా సత్కరిస్తున్నామని శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకుడు పద్మభూషణ్ అవార్డు గ్రహీత వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. మనసు ఫౌండేషన్ ద్వారా మన్నం వెంకటరాయుడు చేస్తున్న సాహిత్య కృషి అనితరసాధ్యమైనది అంటూ కొనియాడారు. సుద్దాల అశోక్‌తేజ పాటలకు తాను అభిమాని అని వరప్రసాదరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధానకార్యదర్శి జె.చెన్నయ్య, శాంతా వసంతా ట్రస్ట్ కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మానవ రహిత వ్యవసాయాన్ని తీసుకొస్తాం

● ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య



రాజేంద్రనగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వాతావరణాన్ని కాపాడుకుంటూ మానవ రహిత వ్యవసాయాన్ని తీసుకురావడానికి కావాల్సిన అన్ని మార్గాలను అందిపుచ్చుకొని ముందుకు సాగడానికి ప్రయత్నిస్తానని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అభిప్రాయపడ్డారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాల సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. 2007-08లో దేశంలోని 78 వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో మొదటి ర్యాంకులో ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం, 2015 నాటికి 6వ ర్యాంక్‌కు చేరుకుందన్నారు. గడిచిన 10 సంవత్సరాల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయం తీవ్ర నిర్లక్ష్యానికి గురై దేశంలో 37వ ర్యాంకుకు పడిపోయిందన్నారు. వజ్రోత్సవాల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సహకారంతో చాలెంజ్‌గా తీసుకొని రాబోయే 3 సంవత్సరాల్లో దేశంలోనే 10వ ర్యాంకు లోపు వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. గతంలో అగ్రి ప్రొడక్షన్‌పై దృష్టి పెట్టేవారమని, ఆ తర్వాత అగ్రి ప్రొటెక్షన్ వచ్చిందని, నేడు క్లైమెట్ స్మార్ట్ అగ్రికల్చర్ నడుస్తోందని, వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రగతిని పునరుద్ధరించడానికి వాతావరణ మార్పులను కాపాడుకుంటు మానవ రహిత వ్యవసాయాన్ని ప్రవేశపెడతామన్నారు. వ్యవసాయ రంగంలో 1970లో యాంత్రీకరణ ప్రారంభమై ట్రాక్టర్లు వచ్చాయని, నేడు డ్రోన్‌ల సహకారంతో 70 నుంచి 75 శాతం వరిలో యాంత్రీకరణ ద్వారా పనులు జరుగుతున్నాయన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ వచ్చినప్పటికి అది మానవుల సహాయంతోనే చేయడం జరుగుతోందని, అలా కాకుండ అగ్రి రోబోటిక్స్ ద్వారా వ్యవసాయం చేయించే దశకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను ఉపయోగించి వ్యవసాయంలో ఖర్చు తగ్గించి నాణ్యత పెంచే విధంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. యువత వ్యవసాయ రంగంపై మొగ్గు చూపేందుకు వీలుగా ప్రయత్నం చేస్తామన్నారు. ఎగుమతి చేసేందుకు అనుకూలమైన వరి ఉత్పత్తులను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం రైస్ మిల్లర్స్‌ను కూడా సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్లైమెట్ చేంజ్ పై దృష్టి పెట్టడంతో పాటు వేస్ట్ నుంచి వెల్త్‌ను సృష్టించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అర్బన్ వేస్ట్, ఫుడ్ వేస్ట్ నుంచి ఆర్గానిక్ కెమికల్స్‌ను తయారు చేయడానికి కార్యచరణ సిద్ధం చేస్తున్నారు. యాంత్రీకరణలో అర్బన్ వేస్ట్, ఫుడ్ వేస్ట్‌ను ప్రాసెసింగ్ చేయడం ద్వారా వచ్చే గ్రాన్యువల్స్ నుంచి రసాయన మందులు లేని ఎరువులను తయారు చేసే విధంగా ప్రయత్నాలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే పద్ధతి వియాత్నంలో జరుగుతుందన్నారు. వ్యవసాయ విద్యలో ప్రొడక్షన్ రిలేటెడ్ సబ్జెక్ట్‌లే ఎక్కువగా ఉంటాయని, అలా కాకుండ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ రిలేటెడ్ సబ్జెక్ట్‌లను కూడా ప్రవేశ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కాలేజ్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, కాలేజ్ ఆఫ్ నేచురల్ రీసోర్సెస్ లాంటి కాలేజీలు రావాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణాన్ని కాపడుకుంటు అహార భద్రతను పెంపొందించే విధంగా పరిశోధనలు రావాలన్నారు. వియాత్నంలో యూనివర్సిటీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఉందని గుర్తు చేశారు.

ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి



శివరాంపల్లి చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న ఏఎన్ఎంలు

రాజేంద్రనగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): 20 సంవత్సరాలుగా రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను ఎలాంటి రాత పరీక్షలు లేకుండానే రెగ్యులర్ ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేస్తూ రెండు రోజులుగా శివరాంపల్లిలోని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట 110 మంది ఏఎన్ఎంలు ధర్నా నిర్వహించారు. అందులో భాగంగా శనివారం శివరాంపల్లి పిల్లర్ నెంబర్ 294 వద్దకు చేరుకుని రాస్తారోకో చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి సీపీఎం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జి.కురుమయ్య, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జె.రుద్రకుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఏఎన్ఎంలకు ఎలాంటి రాత పరీక్షలు లేకుండానే రెగ్యులర్ చేయాలన్నారు. ఏఎన్ఎంలు మాట్లాడుతూ.. జిల్లాలో 20 సంవత్సరాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని, తమను రెగ్యులర్ చేస్తామన్న ప్రభుత్వం రాతపరీక్షలని అనడం బాధాకరమన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఏఎన్ఎంలను రెగ్యులర్ చేస్తూ నిర్ణయం తీసుకోవాలన్నారు. లేనట్లయితే ఏఎన్ఎంల జేఏసీ పిలుపు మేరకు తమ కార్యచరణను ప్రకటిస్తామన్నారు. నిరసన కార్యక్రమంలో నాయకురాళ్లు అమృత, హసీనా, అరుణ, సువర్ణ, బాలమణి, అండాలు, సునీతతో పాటు సీఐటీయూ, భవన నిర్మాణకార్మిక సంఘం, సీపీఎం నాయకులు డి.వెంకటయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణ



రాజేంద్రనగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

రాజేంద్రనగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన హోంశాఖ మంత్రి అమిత్ షా జాతి ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని రాజేంద్రనగర్ సర్కిల్ కు చెందిన దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రాజేంద్రనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వారు పాలాభిషేకం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, దేశాన్ని మతాల పేరుతో విచ్చిన్నం చేయడానికే ఆర్ఎస్ఎస్, బీజేపీలు కుట్ర పన్నుతున్నాయన్నారు. రాజ్యాంగంపై దాడిచేస్తు వస్తున్న బీజేపీ నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై కూడా అనుచిత వాఖ్యలు చేసిందన్నారు. నిరసన కార్యక్రమంలో దళిత నాయకులు పచ్చ నర్సింగ్‌రావు, గొడుగు సంజీవ, పంబాల రాజు, పత్యార నర్సింహ్మ, ప్రసాద్, సంతోష్, కార్తీక్, నానీ, బండి రాజు, కిష్టయ్య, రవి కుమార్, సంజు, ఎస్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్‌కు బీఆర్ఎస్‌ను విమర్శించే హక్కులేదు



షర్ఫుద్దీన్ హమీద్

పహాడిషరీఫ్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీతో జత కట్టడం మజ్లిస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమీద్ అన్నారు. శనివారం ఆయన ఎర్ర కుంటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ని దేశ్ క నేతా అని, కేటీఆర్, హరీష్ రావును పొగడ్తలతో ముంచెత్తిన మజ్లిస్ పార్టీ.. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన కొద్ది రోజుల్లోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీతో జతకట్టి బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేయడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమని అన్నారు. పాతబస్తీలో కుటుంబ పాలన సాగిస్తున్న మజ్లిస్ పార్టీకి బీఆర్ఎస్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ఆయన అన్నారు. పాతబస్తీలో విద్యావంతుల సంఖ్య పెరిగిందని, ఎంఐఎం పార్టీ ముస్లింల అభివృద్ధి కోసం ఏం చేసిందో చెప్పాలన్నారు. పాతబస్తీలోని ముస్లింలు ఆర్థికంగా విద్యాపరంగా వెనకబాటుకు గురైతే మరో పక్క ఓవైసీ కుటుంబం ఆస్తులు వేలకోట్లకు ఎలా పెరిగాయో పాత బస్తీ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితే నేటికీ పాత బస్తీలోని నియోజకవర్గాల్లో ఎక్కిడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు.

రేపటి నుంచి నాణేలు, కరెన్సీ ప్రదర్శన

చార్మినార్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పాత బస్తీ మొఘల్ పురా ఉర్దూ ఘర్ మొగల్‌పురా ఆస్రా హాస్పిటల్ వద్ద ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నాణేలు, పేపర్ కరెన్సీ, స్టాంపులు, పెయింటింగ్‌ల ప్రదర్శన ఉంటుందని ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి అబ్దుల్ హై ఖాద్రి తెలిపారు.

ఈ ఎగ్జిబిషన్‌లో ప్రపంచంలోని అరుదైన కరెన్సీలు, నాణెలను ప్రదర్శకు ఉంచనున్నట్టు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సదర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు. స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 8500212306 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో జేఎస్ఆర్ ప్రతినిధులతో కలిసి ఉన్న ఫొటోను ప్రదర్శిస్తున్న బాధితురాలు సరిత

బర్కత్‌పుర, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేసిన కుషాయిగూడ పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, ఆధార్ కార్డు బస్సులలో ఎందుకు చెల్లదో ఆర్టీసీ ఎండీ సమాధా నం చెప్పాలని బాధితురాలు కె.సరిత డిమాండ్ చేశారు. జేఎస్ఆర్ సంస్థ తనపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని ఆమె కోరారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... భద్రాద్రీ కొత్తగూడెం జిల్లా చెర్ల వెంకటాపురానికి చెందిన తాను ఇటీవల ఉప్పల్‌లో కుషాయిగూడ వెళ్లడానికి ఆర్టీసీ బస్సు ఎక్కానని, తన ఆధార్‌కార్డుపై ఉమ్మడి ఏపీ ఉందని కండక్టర్ చెల్లదని చెప్పారని ఎందుకు చెల్లదని అడిగితే తనపై దుర్భాషలాడడమే కాక కుషాయిగూడ పీఎస్‌లో తప్పుడు ఫిర్యాదు చేసిందని ఆరోపించారు. పోలీసులు తనపై దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. బస్సు కండక్టర్ తాను మద్యం తాగి దాడి చేసినట్టు తప్పుడు కేసు పెట్టిందని ఆరోపించారు. తాను జేఎస్ఆర్ గ్రూపు సంస్థలలో పనిచేశానని, అయితే ఆ సంస్థ నిర్వాహకులు తాను పనిచేయలేదని తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. తనపై ఎలాంటి కేసులు లేవన్నారు. అక్రమ కేసులు బనాయించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.



ఆలయ షెడ్డు నిర్మాణానికి విరాళం అందజేసిన కరణ్‌కోట్ నాగేక్కర్ అమ్రేశ్వర్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆలయంలో షెడ్డు నిర్మాణానికి విరాళం

పహాడిషరీఫ్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పహాడీషరీఫ్ ఆంజనేయ స్వామి, భవానీ శంకర, లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ప్రాంగణం షెడ్డు నిర్మాణానికి కరణ్ కోట్ నాగేక్కర్ అమ్రేశ్వర్ తల్లి తండ్రుల పేరిట విరాళం అందజేశారు. శనివారం దాతల దంపతులకు ఆలయం కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పండెం కొండల్ యాదవ్ మాట్లాడుతూ... పహాడీషరీఫ్ గ్రామంలో అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయం షెడ్డు నిర్మాణానికి కీ.శే. కరణ్ కోట్ నాగేక్కర్ బాబురావు జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు కరణ్ కోట్ నాగేక్కర్ అమ్రేశ్వర్ షెడ్డు నిర్మిస్తున్నారని, మిగత వారు కూడా వారిని ఆదర్శంగా తీసుకోని ఆలయాల నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి సన్నిధానం గురు స్వామి రమేష్ గౌడ్, నరేందర్, కేఎస్ ప్రమోద్, బాలరాజ్ గౌడ్, ఆంజనేయ ఆలయ కమిటీ చైర్మన్ శేఖర్ యాదవ్, ప్రెసిడెంట్ ప్రశాంత్, కోశాధికారి సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం 2కే రన్



2కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు, యువత

ఖైరతాబాద్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై నిఘా పెడుతూ చెడు వ్యసనాల బారిన పడకుండా చూడాలని పద్మభూషణ్ కోడూరు ఈశ్వర వరప్రసాద రెడ్డి సూచించారు. శనివారం తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ 2కే రన్‌ను పాలకుర్తికి చెందిన ఝాన్సీ రాజేందర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ మానవ జీవితాలను నాశనం చేస్తున్నాయన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న పోలీస్, ఎక్సైజ్ శాఖలకు ప్రజలు సహకరించాలని సూచించారు. జలవిహార్ నుంచి ప్రారంభమైన 2కే రన్‌లో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తారక్ రవి, సి.గణేష్, అశోక్, సంతోష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ రహదారిలో భూసేకరణపై స్టేటస్ కో

● ఆస్తుల సేకరణ 10 రోజులు నిలిపివేయాలని హైకోర్టు ఆదేశం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జేబీఎస్ నుంచి శామీర్‌పేట వెళ్లే మార్గంలో రాజీవ్ రహదారిపై నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం చేస్తున్న భూసేకరణపై హైకోర్టు శనివారం యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశించింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) భూసేకరణ పనులను చేపట్టింది. ఇందుకోసం రోడ్ల విస్తరణ పనులను నిర్వహిస్తుండటంతో ఆస్తులు కోల్పోతున్నవారిలో కొంత మంది హైకోర్టును ఆశ్రయించారు. బాధితుల పిటిషన్లను విచారించిన హైకోర్టు భూసేకరణ పనులు చేయవద్దని, పది రోజుల పాటు యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈసందర్భంగా రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ ఫెడరేషన్ జేఏసీ కన్వీనర్ తెలుకుంట సతీష్ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వం రాజీవ్ రహదారిలో నిర్మించే ఎలివే టెడ్ కారిడార్ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే తమ ఆస్తుల సేకరణ చేసి ఇస్తున్న పరిహారం న్యాయబద్ధంగా లేదన్నారు. అదే విధంగా ఎలివేటెడ్ కారిడార్ కోసం 200అడుగుల వెడల్పుతో కాకుండా 100-120 అడుగులతో రోడ్డు విస్తరణ చేయాలని కోరుతున్నామన్నారు. ఇలా చేస్తే తమ ఆస్తులు కోల్పోకుండా ఉండేందుకు అవకాశం ఉందన్నారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను హెచ్ఎండీఏ అధికారులకు అందజేశామని ఆయన తెలిపారు.

ఆక్రమణలున్నా.. అనుమతి లేని లేఅవుట్‌లో ప్లాటున్నా

రిజిస్ట్రేషన్ చేయొద్దు

ప్రజావసర స్థలాలను కబ్జా చేస్తే నేరుగా చర్యలు

● హైడ్రాకు న్యాయ సలహాలందిస్తాం ● సదస్సులో న్యాయవాదులు, రిటైర్డ్ అధికారులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెరువులు, ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలున్నా, అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు ఉన్నా రిజిస్ట్రేషన్ చేయకుండా ఉండే వ్యవస్థ రావాలని పలువురు న్యాయవాదులు సూచించారు. మాస్టర్‌ప్లాన్‌లో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు దుర్వినియోగం అయితే నేరుగా చర్యలు తీసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. శనివారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో న్యాయ నిపుణులు, రిటైర్డ్ అధికారులతో సదస్సు నిర్వహించారు. చెరువుల పరిరక్షణ, పునరుజ్జీవానికి కృషి చేస్తోన్న హైడ్రాకు న్యాయసలహాలు అందించేందుకు అందుబాటులో ఉంటామని న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో వారు పలు సూచనలు చేశారు. చెరువుల పరిరక్షణ, ప్రభుత్వ భూముల సంరక్షణకు ఉన్న చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం తీసుకువచ్చి.. భవిష్యత్ తరాలకు పర్యావరణంతో కూడిన మెరుగైన జీవితం అందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. చెరువు శిఖం భూముల్లో పట్టాలున్నా.. వ్యవసాయం మాత్రమే చేసుకోవాలని, ఇతర హక్కులు ఉండవన్నారు. పలు ప్రాంతాల్లో చెరువుల మధ్య రహదారులు నిర్మించారని, ఇలాంటి చోట నీటికి అడ్డు లేకుండా వంతెనలు నిర్మించాలని అభిప్రాయపడ్డారు. అనుమతులు ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయచ్చని పేర్కొన్నారు. సదస్సులో హైడ్రా కమిషనర్ రంగనాథ్, హైకోర్టు న్యాయవాది రేను మహేందర్‌రెడ్డి, హైడ్రా హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు కె.రవీందర్‌రెడ్డి, సీహెచ్ జయకృష్ణ, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్లు ఎస్.శ్రీనివాసరావు, బి. మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, న్యాయవాదులు

ముగిసిన రాష్ట్రపతి శీతాకాల విడిది


రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు వీడ్కోలు పలుకుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి సీతక్క, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్

అల్వాల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఐదురోజుల దక్షిణాది పర్యటన శనివారం ముగిసింది. ఆమె తిరిగి న్యూఢిల్లీకి వెళ్లారు. నగర శివారులోని హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి సీతక్క, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, డీజీపీ డాక్టర్ జితేందర్, త్రివిధ దళాలకు చెందిన అధికారులతో పాటు మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి, పలువురు ఉన్నతాధికారులు రాష్ట్రపతికి వీడ్కోలు పలికారు. ఐదురోజుల పర్యటనలో రాష్ట్రపతి సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్(సీడీఎం)కు 'కలర్స్ ప్రజెంటేషన్ అవార్డు' అందజేశారు. డిసెంబరు 29 నుంచి 15 రోజుల పాటు రాష్ట్రపతి నిలయంలో నిర్వహించే ఉద్యాన్ ఉత్సవ్‌కు సంబంధించిన ఏర్పాట్లపై ఆమె సమీక్షించారు. ఏపీలోని మంగళగిరి ఎయిమ్స్ స్నాతకోత్సవంలో కూడా పాల్గొన్నారు. శుక్రవారం రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోమ్ కార్యక్రమంలో ఆమె గవర్నర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఇతర ప్రముఖులను కలిశారు. రాష్ట్రపతి ప్రతీ శీతాకాలం విడిదికి సంవత్సరానికి ఒకసారి సందర్శిస్తారు. రాష్ట్రపతి నిలయం నుంచే అధికారిక కార్యకలాపాలను నిర్వహిస్తారు. 1960లో 90 ఎకరాల్లో రాష్ట్రపతి నిలయాన్ని నిర్మించారు. 11 గదులు, సినిమాహాల్, డైనింగ్‌హాల్, ఇతర హాళ్లతో సహా నిలయంలో విలాసవంతమైన సౌకర్యాలు ఉన్నాయి.

అత్యంత ఇష్టపడే బ్రాండ్‌గా ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్

● ఓ సర్వేలో గుర్తింపు



అవార్డుతో చంద్రశేఖర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం, స్వచ్ఛత, రుచిలో నూతన ప్రమాణాలను నెలకొల్పడం ద్వారా ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 2024-25లో అత్యంత ఇష్టపడే బ్రాండ్లలో ఒకటిగా నిలిచింది. ఇండియా టుడేతో కలిసి మార్కెట్మెన్ డైలీ సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ గుర్తింపు దక్కిందని జెమినీ ఎడిబుల్స్, ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్, సేల్స్, మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో నంబర్.1 వంట నూనె బ్రాండ్ సాధించిన ఈ గుర్తింపు తమ వినియోగదారుల విశ్వాసం, విధేయతను ప్రతిబింబిస్తుందని ఆయన తెలిపారు. ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ వారి జీవితంలో అంతర్భాగంగా మారిందని, కస్టమర్ల అవసరాలను అర్థం చేసుకోవడంతో పాటు నాణ్యత, ఆరోగ్య ప్రయోజనాలు, రుచిలో అంచనాలను మించిన ఉత్పత్తులను అందించడంపై దృష్టి సారిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రశంసలు ఎడిబుల్ ఆయిల్ పరిశ్రమలో కొత్త ప్రమాణాలను నెలకొల్పేందుకు, కొనసాగించేందుకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. జెమిని ఎడిబుల్స్, ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ జీఎం మార్కెటింగ్ చేతన్ పింపాల్‌ఖుటే మాట్లాడుతూ నంబర్ వన్ బ్రాండ్ గుర్తింపు పొందడం చాలా గర్వంగా ఉందని, వినియోగదారుల అచంచలమైన నమ్మకం, మద్దతు ఈ మైలురాయిని సాధ్యం చేశాయని ఆయన తెలిపారు.

అట్టహాసంగా ధ్యాన మహాయాగం వేడుకలు

ప్రారంభించిన ఎంపీ మల్లు రవి

కడ్తాల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధ ధ్యాన కేంద్రం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రం జనసంద్రంగా మారింది. తెలుగు రాష్ట్రాల నుంచి అభ్యాసకులు వేలాదిగా తరలిరావడంతో పిరమిడ్ కిక్కిరిసిపోయింది. పత్రీజీ ధ్యాన మహాయాగం-3 వేడుకలు శనివారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 11 రోజులపాటు పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు జరగనున్నాయి. పిరవిండ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి, పత్రీజీ కూతుళ్లు పరిణత పత్రీజీ, పరిమళ పత్రీజీతో కలిసి తెలంగాణ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కన్వీనర్, ఎంపీ డాక్టర్ మల్లు రవి వేడుకలను ప్రారంభించారు. కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజు, మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి హాజరయ్యారు.


మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

నేడు నీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలకు ఆదివారం నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని వాటర్‌బోర్డు అధికారులు ప్రకటించారు. బోరబండ నుంచి లింగంపల్లి వరకు ఉన్న 800 డయా ఎంఎస్ పైపులైన్‌కు సఫ్దర్‌నగర్ వద్ద లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీని అరికట్టడానికి ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం ఆరు గంటల వరకు మరమ్మతు పనులను చేపట్టనున్నారు. దీంతో పలు ప్రాంతాలకు 24 గంటల పాటు నీటి సరఫరాలో అంతరాయం తలెత్తనుంది. ముఖ్యంగా ఎస్‌పీఆర్ హిల్స్ సెక్షన్ పరిధిలోని జైవంత్‌నగర్, సునీల్‌నగర్, వీకర్స్‌సెక్షన్, బోరబండ సెక్షన్ పరిధిలోని మహాత్మానగర్, వినాయక్‌నగర్, హబీబ్ ఫాతిమానగర్ ఫేజ్-1, ఫేజ్-2, ఇంద్రనగర్, టి.అంజయ్యనగర్, బాబా సైలానీనగర్, భరత్‌నగర్, గాయత్రీనగర్ సెక్షన్ పరిధిలోని పాత అల్లాపూర్, కొత్త అల్లాపూర్, సెంట్రల్ అల్లాపూర్, శివబస్తీ, అజీజ్‌నగర్, మిరాజ్‌నగర్, పద్మావతినగర్, గాయత్రీనగర్, తులసినగర్, వివేకానంద్‌నగర్, పర్వత్‌నగర్. మోతీనగర్ సెక్షన్ పరిధిలోని రామారావునగర్, హరినగర్, శివాజీనగర్, ఆర్కేసొసైటీ, రాధాకృష్ణనగర్, కేపీఎస్‌నగర్, రాణాప్రతాప్‌నగర్, గణేష్‌నగర్ ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం కలగనుందని అధికారులు తెలిపారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మణికొండ శాఖ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశ సేవలో 114 వసంతాలు పూర్తి చేసుకున్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నగరంలోని మణికొండలో శనివారం కొత్త శాఖను ప్రారంభించింది. మణికొండలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ జనరల్ మేనేజర్(ఏపీ, తెలంగాణ, కర్నాటక జోనల్ హెడ్) ధారాసింగ్ నాయక్ మాట్లాడుతూ మణికొండ పరిసర ప్రాంత ప్రజలు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హైదరాబాద్ రీజనల్ హెడ్ జి.రామకృష్ణన్, రిటైర్డ్ డీజీఎం డి.బాపన్న, మణికొండ బ్రాంచి మేనేజర్ ఎం.శ్రీనివాస్ సకారేతోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు.


మణికొండలో సెంట్రల్ బ్యాంక్ శాఖ ప్రారంభోత్సవంలో అధికారులు

అద్దాల మేడలు భద్రమేనా..?

(5వ పేజీ తరువాయి) చెబుతున్నారు. బయటి నుంచి వాహనాలు, ఇతరత్రా శబ్దాలు రాకుండా ఈ అద్దాలు నిలువరిస్తాయి. భవనం ఎత్తు.. స్థానిక వాతావరణ పరిస్థితులు.. గాలులు ఏ స్థాయిలో వీచే అవకాశముంది..? వడగళ్ల వానలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని అద్దాల మేడలను డిజైన్ చేస్తున్నారు. ఎంత సామర్థ్యం ఉన్న అద్దాలు వాడాలన్నది నిపుణులు డిజైన్ చేస్తున్నారు. భవనం కాంక్రీట్ నిర్మాణానికి సంబంధించి స్ట్రక్చరల్ ఇంజనీర్లు ప్లాన్‌లు రూపొందిస్తుంటే.. అద్దాల వినియోగం డిజైన్ ప్రత్యేక సంస్థలు చేస్తున్నాయని క్రెడాయ్ ప్రతినిధి శేఖర్‌రెడ్డి తెలిపారు. సాధారణ అద్దాలతో పోలిస్తే గాజు మేడల్లో వినియోగించే అద్దాలు నాలుగు నుంచి ఆరు రెట్లు దృఢంగా ఉంటాయని చెబుతున్నారు. వీటిలో అగ్ని ప్రమాదాలను తట్టుకునే సామర్థ్యమూ ఉంటుందని, అయితే ఉష్ణోగ్రత నిర్ణీతస్థాయి దాటితే మాత్రం ఇబ్బందులు ఉంటాయంటున్నారు.

నిర్మాణ రంగం ట్రెండ్ మారింది

బహుళ అంతస్తుల భవనాలకు సంబంధించి సిలిండర్లు భవనం కింద ప్రత్యేక ప్రాంతంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అక్కడి నుంచి పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతోంది. నివాస సముదాయాల్లో కూడా ఫ్లాట్ లోపల కాకుండా బయట సిలిండర్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సత్వా ఎలిగ్జర్ నాలుగో అంతస్తులోని బార్ అండ్ రెస్టారెంట్‌లో జరిగిన ప్రమాదానికి సిలిండర్ పేలడమే కారణమని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. అయితే, ఈ భవనంలో సిలిండర్ నాలుగో అంతస్తులో ఎందుకు ఉంది..? పైపులైన్ వ్యవస్థ లేదా...? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమగ్ర పరిశీలన అనంతరమే ఈ విషయంపై స్పష్టత వస్తుందని అగ్నిమాపక శాఖ అధికారొకరు తెలిపారు.

అభివృద్ధి చెందిన దేశాల్లో..

ఐటీ కారిడార్‌లోని పలు ప్రాంతాల్లో 20నుంచి 30 అంతస్తుల నివాసేతర భవనాలను అద్దాలతో నిర్మించారు. వీటికి టఫెండ్ గ్లాసులు వాడుతున్నారు. భవనం ఎత్తును బట్టి 20 నుంచి 40 మిల్లీమీటర్ అంతకంటే ఎక్కువ మందంతో కూడిన గ్లాసులు అమర్చుతున్నారు. కొన్ని భవనాలకు రెండు వరుసల అద్దాలు అమర్చుతున్నారు. ఒక్కో వరుస మధ్య ఖాళీ ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు. ఇది ప్రమాదాల తీవ్రత తగ్గించేందుకు తీసుకుంటోన్న జాగ్రత్త అని జీహెచ్‌ఎంసీ అధికారొకరు తెలిపారు. 'అద్దాల మేడల నిర్మాణం అమెరికా, సింగపూర్, జపాన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఎప్పటి నుంచో ఉంది. అన్ని విధాలుగా సురక్షితమనే ఉద్దేశంతోనే వీటిని ఇక్కడా వినియోగిస్తున్నాం. సత్వా భవనంలో ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. తీవ్రత ఎక్కువగా ఉండడం వల్లే గ్లాసులు పగిలి ఉంటాయని భావిస్తున్నా. రూ.వందల కోట్ల ప్రాజెక్టుల్లో రాజీ పడే ప్రసక్తి లేదు. దుర్ఘటనల సమయంలో ఇలాంటివి సంభవిస్తుంటాయి' అని శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

మురిసిన పుస్తకం

సరికొత్త పుస్తకాల 'ఛాయ'




స్టాల్ నెంబర్.241

తెలుగు ప్రచురణా రంగంలో 'ఛాయ' ప్రస్థానం ప్రత్యేకమైంది. ఈ సంస్థ పుట్టి పదేళ్లు కూడా కాలేదు. కానీ, వందేళ్లు నిలిచే విలువైన పుస్తకాలను పాఠకులకు అందిస్తోంది. ముఖ్యంగా జయమోహన్ 'నెమ్మినీలం', శరణ్ కుమార్ లింబాలే 'సనాతనం', కృష్ణమూర్తి చందర్ 'కాంచన సీత', గోర్ఖాలాండ్ ఉద్యమ నేపథ్యంలో లేఖ్‌నాథ్ ఛత్రి నవల 'విఫల', వసుదేంద్ర 'తేజో తుంగభద్ర' తదితర నవల, కథా సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. ప్రపంచాన్ని మనముందు నిలబెట్టే తొమ్మిది దేశదేశాల అనువాద కథలను 'ఆకుపచ్చ పిల్లి' పేరుతో ఈ ఏడాది వెలువరించారు. మంటో, బుర్రకథ ఈరమ్మ జీవిత చరిత్రలతో పాటు యువ కవులు, రచయితలను ప్రోత్సహిస్తూ వందకుపైగా పుస్తకాలు ప్రచురించారు. పాఠకులకు సరికొత్త అనుభవాన్ని అందించే ఛాయ ప్రచురణల కోసం పుస్తక ప్రదర్శనలో స్టాల్ నెంబరు-241 సందర్శించవచ్చు. సందర్శకులకు 20 శాతం రాయితీ ఇస్తున్నారు. పుస్తకం కొనే ముందు, ఆ రచన సారాంశాన్ని ఆడియో ద్వారా తెలుసుకొనే వెసులుబాటును ఛాయా అందుబాటులోకి తెచ్చినట్లు ఎడిటర్ అరుణాంక్ లత చెప్పారు.

వారాంతం కావడంతో పుస్తక మహోత్సవ ప్రాంగణం సందర్శకులతో కిటకిటలాడింది. పుస్తక స్టాళ్లన్నీ రద్దీగా కనిపించాయి. అందులోనూ ఈ ఏడాది యువత పెద్ద సంఖ్యలో కనిపిస్తుండడం విశేషం. శనివారం 50 వేల మందికిపైగా పుస్తక ప్రదర్శన సందర్శించినట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ఆర్.వాసు చెబుతున్నారు. డిజిటల్ యుగంలోనూ అచ్చు పుస్తకానికి ఆదరణ తగ్గలేదనడానికి ఇదే నిదర్శనం.
- హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి)

'ప్రేమ-సెక్స్ సంబంధాలపై మార్క్సిస్టు దృక్పథం'

స్టాల్ 342



సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విషయాలపై మార్క్సిస్టు దృక్పథం నుంచి ఎన్నో, మరెన్నో విమర్శనాత్మకమైన విశ్లేషణలు అందుబాటులోకి వచ్చాయి. అయితే, స్త్రీ, పురుష సంబంధాలు... మరీ ముఖ్యంగా ప్రేమ, సెక్స్ వంటి విషయాల మీద మార్క్సిస్టు ఆలోచనల నుంచి విశ్లేషణలు పెద్దగా రాలేదన్నది విమర్శకుల మాట. సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా(ఎస్‌యూసీఐ) కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుడు శిబ్దాస్ ఘోష్ మార్క్సిస్టు దృక్పథంతో 'ప్రేమ-సెక్స్ సంబంధాలపై' విశ్లేషణాత్మక వ్యాఖ్యానాన్ని అదే పేరుతో తెలుగులోకి అనువదించారు. ఆ పుస్తకం రైటర్స్ హాల్‌లోని, 'సోషలిస్టు విప్లవం' స్టాల్ 342లో లభ్యమవుతుంది. శిబ్దాస్ ఘోష్ మార్క్సిస్టు దృక్పథంతో రచించిన 'ప్రేమ - సెక్స్ సంబంధాలు' పుస్తకం ధర రూ.30

బాలగోపాల్ రచనలు

స్టాల్ 74

ప్రఖ్యాత మానవ హక్కుల ఉద్యమ నేత దివంగత బాలగోపాల్‌ను తెలుగు సమాజపు కన్షైన్స్ కీపర్‌గా మేధావులు, బుద్ధిజీవులు అభివర్ణిస్తారు. జటిలమైన సమస్య ఎదురైన సందర్భాల్లో బాలగోపాల్ అభిప్రాయం కోసం ఆలోచనాపరులు, సామాజిక కార్యకర్తలు ఎదురుచూసేలా తనను తాను మలుచుకున్న వ్యక్తిగా ఆయనను కొనియాడతారు. ఆ సత్యాన్వేషి రచనలన్నీ హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలోని 'మానవ హక్కుల వేదిక' స్టాల్ నెంబరు.74లో లభ్యమవుతాయి. 'రిజ్వరేషన్ల వర్గీకరణ ప్రజాస్వామిక దృక్పథం', 'రాజ్యం మతం కులం', 'కమిషన్ నివేదికలు సామాజిక న్యాయం', 'హింస అహింసలకు ఆవల' వంటి కొత్తపుస్తకాలతో పాటు 'మనిషి మార్క్సిజం', 'చరిత్ర రచనపై బాలగోపాల్', 'కులాన్ని అర్థంచేసుకోవడం ఎలా.?', 'మతతత్వంపై బాలగోపాల్', 'ముస్లిం ఐడెంటిటీ-హిందూత్వ రాజకీయాలు', 'అభివృద్ధి-విధ్వంసం', 'దళిత' తదితర రచనలన్నీ ఈ స్టాల్‌లో ఉన్నాయి.

పిల్లల పుస్తక ప్రపంచం 'మంచిపుస్తకం'

స్టాల్ 154

బాలల సాహిత్యం అంతిమ లక్ష్యం నీతి బోధనలు కాదు, ఆ రచనల్లో నీతి, నైతిక విలువలు అంతర్భాగం కావాలి అన్నది మంచి పుస్తకం ప్రచురణ కర్తల ముఖ్య ఉద్దేశం. ఆ లక్ష్యంతో ఇరవై ఏళ్లుగా పిల్లల కోసం 550టైటిల్స్‌కుపైగా పుస్తకాలను ప్రచురిస్తున్నారు. పసి వయసు నుంచి పుస్తక పఠనాసక్తి కలిగించేందుకు అనువైన బొమ్మల కథలు, కాల్పనిక, జానపద కథలు, నవలలు, మనోవైజ్ఞానిక, ఖగోళ, శాస్త్ర విజ్ఞాన రచనలు, వివిధ రంగాల్లో విశేష కృషిచేసిన మహనీయుల జీవిత చరిత్రలు, ఇంకా మరెన్నో బాలల సాహిత్యం కోసం మంచిపుస్తకం స్టాల్ నెంబరు-154ను సందర్శించవచ్చు. పది శాతం రాయితీ ఇస్తున్నారు.

అపురూప పుస్తకాల 'అనల్ప'

స్టాల్ 119

ఆంగ్ల, తెలుగు సాహిత్యంలోని ఆణిముత్యాల్లాంటి రచనలకు చిరునామా అపురూప పుస్తకాల అద్భుత ప్రపంచం 'అనల్ప' ప్రచురణలు. గురుదత్ శతజయంత్యుత్సవం సందర్భంగా పి.జ్యోతి రాసిన 'ఓ వెన్నెల ఎడారి', 'ది ఇల్లస్ట్రేటెడ్ రామాయణ, మహాభారత', 'ది బిగ్ క్వశ్చన్స్ ఇన్ సైన్స్', 'స్పానిష్ షార్ట్ స్టోరీస్' తదితర ఆంగ్ల పుస్తకాలతో పాటు షేక్స్పియర్ రచనలు, కాల్పనిక, కాల్పనికేతర సాహిత్యం, పిల్లల పుస్తకాలు, సినిమా విశ్లేషణలు, జీవిత చరిత్రలు, ఆత్మకథలు తదితర అరుదైన రచనలకు అనల్ప స్టాల్ నెంబరు-119లో సంప్రదించవచ్చు.



పుస్తక పఠనం ద్వారా దివ్యమైన జ్ఞానం

● హరియాణా గవర్నర్ దత్తాత్రేయ

కవాడిగూడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం ద్వారా దివ్యమైన జ్ఞానాన్ని సంపాదించుకోచ్చని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. లక్షలాది మంది ఆలోచనలు పుస్తక రూపంలో తెచ్చి ప్రజల్లోకి తీసుకెళ్లే రచయితల కృషి అభినందనీయమని అన్నారు. ఎన్‌టీఆర్ స్టేడియంలో జరుగుతున్న హైదరాబాద్ 37వ జాతీయ పుస్తక ప్రదర్శనను శనివారం సాయంత్రం ఆయన సందర్శించారు. బుక్ స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడానికి పుస్తకాలు అవసరమని, లోతైన విజ్ఞానం రావాలంటే పుస్తక పఠనం చాలా అవసరమని అన్నారు. నేటియువతరం సెల్‌ఫోన్‌లు చూస్తూ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, గ్రంథాలయాలు, బుక్‌ఫెయిర్‌లు ఏర్పాటు చేసి వారిని పుస్తక పఠనం వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం కూడా అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకుబ్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్(వాసు) పాల్గొన్నారు.


పుస్తకాన్ని పరిశీలిస్తున్న హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, బుక్ ఫెయిర్ నిర్వాహకులు

డిజిటల్ వేదికలతో పుస్తకానికి ప్రమాదం లేదు

● సమావేశంలో పలువురు వక్తలు

హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ శనివారం 'బుక్స్ ఇన్ డిజిటల్ ఇయర్స్' అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రచయిత్రి అపర్ణ ఠాకూర్ మాట్లాడుతూ... "నేను ఎనిమిది ఏళ్లుగా పిల్లల కోసం ప్రత్యేకంగా లైబ్రరీ నడుపుతున్నాను. కరోనా కాలంలో పిల్లలంతా ఇళ్లకే పరిమితం కావడంతో, సామాజిక మాధ్యమాల ద్వారా వారికి చేరువ కావాలి అనుకున్నాను. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పుస్తక పరిచయం ప్రారంభించాను. అవి చదివి, లైబ్రరీకి వచ్చే వారి సంఖ్య పెరిగింది. అలా పుస్తక పఠనానికి అలవాటైన పిల్లలు అచ్చు పుస్తకాన్ని చదవడానికే ఇష్టపడుతున్నారు" అని చెప్పారు. ప్రొఫెసర్ ఉషారామన్ మాట్లాడుతూ "యువతరమంతా డిజిటల్ వేదికలమీదే క్రియాశీలంగా ఉంటుంది. డిజిటల్ ఫార్మెట్‌లోని పుస్తకాలు చదువుతున్నప్పుడు కూడా, అందులో వారికి నచ్చిన అంశాలను మార్క్ చేసుకోవచ్చు. వాటిని సామాజిక మాధ్యమాల ద్వారా ఇతరులతో పంచుకోవచ్చు. కనుక అచ్చుపుస్తకానికి డిజిటల్ పుస్తకాన్ని పోటీగా భావించనక్కర్లేదు" అన్నారు. రచయిత్రి పూర్ణిమ తమ్మిరెడ్డి మాట్లాడుతూ మంటో కథలను తెలుగులోకి అనువదించాలి అనుకున్నప్పుడు సామాజిక మాధ్యమాలు తనకెంతో సాయపడ్డాయని తెలిపారు. హైదరాబాద్ సాహిత్య ఉత్సవం నిర్వాహకుడు ఆచార్య టి.విజయకుమార్ అధ్యక్షతన సాగిన సమావేశంలో ప్రొఫెసర్ అపర్ణ రాయప్రోలు తదితరులు పాల్గొన్నారు.



తెలుగు చిత్రపరిశ్రమలో శ్రీకాంత్ వంటి అదృష్టవంతుడు మరెవరూ లేరని అంటుంటారు. ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించడమే కాకుండా ఏనాడూ వివాదాల జోలికి పోకుండా కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. పరిశ్రమలో అందరితో మంచి సంబంధాలు కలిగి ఉన్న శ్రీకాంత్.. వచ్చే జనవరిలో విడుదల కానున్న గేమ్ ఛేంజర్ చిత్రంలో తన తండ్రిని పోలిన గెటప్‌తో నటిస్తుండడం విశేషం. ఈ నేపథ్యంలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలు 'నవ్య'తో పంచుకున్నారు శ్రీకాంత్.

అదృష్టం అంటే ఇదే కదా అనిపిస్తుంటుంది!

ముప్ఫై మూడేళ్ల కెరీర్.. 130కి పైగా చిత్రాలు.. ఎలా అనిపిస్తుంటుంది?

నిజం చెప్పాలంటే ఇన్నేళ్ల కెరీర్‌ను నేను ఊహించలేదు. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్నప్పుడు సినిమాల్లో నటించాలనే కోరిక ఉండేది తప్ప ఇలా 30 ఏళ్ల పాటు ఇండస్ట్రీలో కొనసాగుతానని అనుకోలేదు. నేనే కాదు బహుశా ఎవరూ అలా అనుకోలేరేమో! 'పీపుల్స్ ఎన్‌కౌంటర్' చిత్రంలో తొలి అవకాశం దొరకడమే ఒక అదృష్టంలా భావించాను ఆ రోజు. ఎక్కడో ఒక గ్రామంలో పుట్టి పెరిగి ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా పరిశ్రమలోకి రావడం, ఒక్కో మెట్టు ఎదుగుతూ 130 పైగా చిత్రాల్లో నటించడం.. ఎలా సాధ్యమైందా అని ఆలోచిస్తుంటే నాకే ఆశ్చర్యంగా ఉంటుంది. అదృష్టం అంటే ఇదే కదా అనిపిస్తుంటుంది.

కెరీర్ ఆరంభంలో మిమ్మల్ని గైడ్ చేసినవాళ్లు ఎవరైనా ఉన్నారా?

'పీపుల్స్ ఎన్‌కౌంటర్'లో చేస్తుండగానే 'మధురానగరిలో' సినిమాలో నలుగురి హీరోల్లో ఒకరిగా అవకాశం వచ్చింది. ఆ సినిమా అయిన తర్వాత ఆరు నెలలు గ్యాప్. చాలా టెన్షన్ పడ్డా. ఇక ఇంటికి తిరిగి వెళ్లిపోవాల్సిందేనా అనుకున్నాను. అటువంటి తరుణంలో 'సీతారత్నంగారి అబ్బాయి' చిత్రంలో అవకాశం వచ్చింది. కాకపోతే విలన్ వేషం. హీరోగా రెండు చిత్రాల్లో నటించి, ఇప్పుడు విలన్‌గా నటించాలా అనిపించింది. ఆ సమయంలో దర్శకుడు శరత్ నన్ను గైడ్ చేశారు. 'చిత్ర పరిశ్రమలో నిలబడడం ముఖ్యం. ఒకసారి పేరు వచ్చిన తర్వాత హీరో కావడం సులభమే' అన్నారు. ఇక ఆలోచించకుండా సరే అనేశా. ఇక అప్పటినుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. విలన్‌గా కొన్ని చిత్రాల్లో నటించి ఆ తర్వాత మళ్లీ హీరో అయ్యా. ఇప్పటికి 130కి పైగా చిత్రాలు పూర్తి చేశా. మధ్యలో కింద పడ్డాను, మళ్లీ పైకి లేచాను. 'అఖండ' చిత్రం తర్వాత మళ్లీ ట్రాక్‌లోకి వచ్చి సెటిల్ అయ్యా. వస్తున్న క్యారెక్టర్స్ ఎంజాయ్ చేస్తూ నటిస్తున్నా. ఇంట్లో ఖాళీగా ఉంటే చిరాకుగా అనిపిస్తుంది. ఏదో ఒకటి చేయాల్సిందే. రిలాక్స్ మూడ్ అనేది ఇంకా రాలేదు. ప్రయాణం సాఫీగా సాగుతోంది. లక్కీగా ఇప్పుడు నాకు అన్నీ మంచి పాత్రలే వస్తున్నాయి.

ఎక్కువగా ట్రావెల్ చేస్తుంటారెందుకు?

నాకు ట్రావెలింగ్ అంటే బాగా ఇష్టం. ఫ్రెండ్స్‌తో కలసి తిరుగుతుంటాను. సాధ్యమైనంత వరకూ కారులో వెళ్లడానికే ప్రయత్నిస్తుంటా. ఇదివరకు అన్నీ జాలీ ట్రిప్పులే. గోవా, బ్యాంకాక్ ఇలా.. పదేళ్ల నుంచి రూట్ మార్చి ఆధ్యాత్మిక యాత్రలు చేస్తున్నాను. అమరనాథ్ యాత్ర, కేదార్‌నాథ్ వంటి కొన్ని ప్రదేశాలకు తప్ప శక్తి పీఠాలు, జ్యోతిర్లింగాలు.. అన్నీ చూసేశా. గత నెల కుటుంబంతో కలసి నేపాల్ వెళ్లి వచ్చాను. రుద్రాక్షలు మెళ్లో వేసుకుని నుదుటిన ఇంతింత బొట్లు, విభూతి పెట్టుకుని అక్కడి వీధుల్లో తిరుగుతుంటే మనసు చాలా ప్రశాంతంగా అనిపించింది. ఇప్పుడు కాశీ, అయోధ్య వెళ్లాలని ప్లాన్ చేస్తున్నా. ఇంట్లో వాళ్లు మాత్రం కారులో ఎందుకు అని అంటున్నారు. కారులో వెళుతుంటే ఆ కిక్కే వేరు. మన తెలుగు రాష్ట్రాల్లో చేయలేని పనులు అక్కడ స్వేచ్ఛగా చేయవచ్చు. దారిలో ఎక్కడన్నా చిన్న టీ కొట్టు కనిపించిందనుకోండి... ఆగి తాపీగా టీ తాగవచ్చు. తెలియని ప్రదేశంలో మనల్ని గుర్తు పట్టేవాళ్లు ఎవరూ ఉండరు కదా. ఒకసారి లడఖ్ వెళ్లి కారులో తిరిగి వస్తున్నాం. చండీఘడ్ దాటిన తర్వాత రోడు పక్కన ఒక దాబా కనిపించింది. కారు అక్కడ ఆపుకొని, భోజనం చేసి అక్కడున్న నులక మంచాల మీద పడుకుని తెల్లారిన తర్వాత బయలుదేరి వచ్చేశాం. ఇదంతా థ్రిల్లింగ్‌గా అనిపించింది. జనం మనల్ని గుర్తు పట్టనప్పుడు ఏమైనా చేయవచ్చు.

భక్తి భావం ఎప్పటినుంచి మొదలైంది?


నాకు మొదటి నుంచీ ఉంది. పదేళ్ల నుంచి మరింత ఎక్కువైంది. గుళ్లో ఉన్నంతసేపూ మనసు ఎంతో ప్రశాంతంగా అనిపిస్తుంది. నాకే కాదు... ఊహకి కూడా భక్తి ఎక్కువ. తరచూ ఇంట్లో పూజలు, హోమాలు చేయిస్తుంటుంది.

క్రికెట్ ఆటకు దూరమయ్యారా?

లేదు లేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా వెళ్లి ఆడి వచ్చాం. సంగీత దర్శకుడు తమన్, తరుణ్... మేమంతా ఒక టీమ్. వచ్చే ఏడాది అమెరికాలో మ్యాచ్ ఉంది. దాని కోసం సన్నద్ధం అవుతున్నాం.

గేమ్ ఛేంజర్‌లో మీ నాన్నగారి గెటప్‌లో కనిపిస్తున్నారట!

ఆ సినిమాలో నాకు అవకాశం రావడం చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. కానీ మొదట కథ విన్న తర్వాత ఈ పాత్రకు నన్ను ఎందుకు అనుకున్నారా అనిపించింది. ఎందుకంటే అది వయసు పైబడిన పాత్ర. ముఖ్యమంత్రి పాత్ర. చాలా డెప్త్ ఉన్న వేషం.. నేను చేయగలనా అనిపించింది .కాకపోతే ఫ్లాష్ బ్యాక్‌లో యంగ్ గెటప్ కూడా ఉంది. ఇది పాజిటివ్ కాదు, నెగెటివ్ కాదు. ఒక్కో సమయంలో ఒక్కోలా అనిపిస్తుంటుంది. ఇలాంటి పాత్ర చేసే అవకాశం నాకు రావడం నిజంగా అదృష్టమే. శంకర్ దర్శకత్వంలో నటించడం లక్కీనే కదా. అందులోనూ నాన్నగారి గెటప్‌లో కనపించడం మరింత ఆనందం కలిగించింది. ఆ గెటప్ ఎంతవరకూ సెట్ అవుతుందా అని భయపడ్డాను. ముంబైలో మేకప్ టెస్ట్ జరిగింది. ఆ గెటప్‌లో నన్ను చూసి శంకర్ చాలా సంతృప్తి చెందారు. ఎవరూ గుర్తు పట్టలేదు. ఆఖరికి మా అమ్మ కూడా. గెటప్ కుదిరితే నేను పాస్ అయినట్లే అనుకున్నాను. చాలా చక్కగా ఉంది. శంకర్ ఎలా చెబితే అలా నటించా.



మీ కారు నంబర్, ఫోన్ నంబర్.. అన్నీ ఫ్యాన్సీగా ఉంటాయి. న్యూమరాలజీ మీద బాగా నమ్మకమా?

అలా ఏమీ లేదండీ. ఫ్యాన్సీ నంబర్లు అంటే ఇష్టం. అందుకే అలా ఉంటాయి. కానీ ఐదు అంకెకూ నాకూ ఏదో తెలియని అనుబంధం ఉందని చెప్పాలి. నా అదృష్ట సంఖ్య ఐదు అని చెబుతారు. ఇంటి నంబర్ 23. అది కావాలని మనం అనుకున్నది కాదు. నా ఫోన్ నంబర్‌లో అంకెలన్నీ కలపితే ఐదు వస్తుంది. నా పేరులోని అక్షరాలు కలిపితే ఐదు.

మీ ముగ్గురు పిల్లల్లో ఒకరు హీరో. మిగిలిన వారి సంగతి?

పాప కెనడాలో చదువుతోంది. రెండో అబ్బాయి టెన్త్ చదువుతున్నాడు. పెద్ద అబ్బాయి రోషన్ కంటే వాళ్లిద్దరూ బాగా చదువుతారు.

మీ ఇంట్లో పెత్తనం ఎవరిది.. మీదా.. ఊహదా?

ఇంటి విషయాల్లో ఆవిడదే పెత్తనం. డబ్బు తెచ్చి ఇవ్వడమే నా పని. పిల్లల చదువుల దగ్గర నుంచీ అన్నీ తనే చూసుకుంటుంది.

ఆవిడ సినిమాల్లో నటించకూడదని కండిషన్ పెట్టారా?

అదేమీ లేదండీ. పెళ్లయిన తర్వాత నటన వద్దని తనే అనుకుంది. పిల్లలు పుట్టిన తర్వాత ఆ నిర్ణయానికి మరింత కట్టుబడింది. ముగ్గురు పిల్లలను పెట్టుకుని మేం ఇద్దరం సినిమాల్లో నటించడం కరెక్ట్ కాదుగా. మధ్యలో కొందరు అడిగారు కానీ తనే చేయనని చెప్పేసింది. నేను నటించే సినిమాల వేడుకలకు కూడా ఆమె రాదు.

సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారా?

నాకు అకౌంట్స్ ఉన్నాయి కానీ అరుదుగా పోస్టులు పెడుతుంటాను. వివాదస్పద విషయాలకు దూరంగా ఉంటాను. వాటి గురించి తెలుసుకుంటాను కానీ ఎక్కడా కామెంట్ చేయను.

● వినాయకరావు



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది ఫోర్జ్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 22
ఓరిజిన్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 25
స్క్విడ్ గేమ్ 2	కొరియన్ సిరీస్ (తెలుగులో)	డిసెంబర్ 26
భూల్ భూలయ్య 3	హిందీ చిత్రం	డిసెంబర్ 27
సొర్గవాసల్	తమిళ చిత్రం (తెలుగులో)	డిసెంబర్ 27
అమెజాన్ ప్రైమ్		
సింగం ఎగైన్	హిందీ చిత్రం	డిసెంబర్ 27
థానర	మలయాళ చిత్రం	డిసెంబర్ 27
జియో సినిమా		
డాక్టర్స్	హిందీ సిరీస్	డిసెంబర్ 27
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
వాట్ ఇఫ్? 3	యానిమేషన్ సిరీస్	డిసెంబర్ 22
డాక్టర్ హూ	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 25
జీ5		
ఖోజ్	హిందీ చిత్రం	డిసెంబర్ 27
మనోరమా మ్యాక్స్		
పంచాయత్ జెట్టీ	మలయాళ చిత్రం	డిసెంబర్ 24
ఐ యామ్ కథలన్	మలయాళ చిత్రం	డిసెంబర్ 25
డిస్కవరీ ప్లస్		
హ్యారీపోటర్: విజర్డ్ ఆఫ్ బేకింగ్	వెబ్‌సిరీస్	డిసెంబర్ 25
లయన్స్ గేట్ ప్లే మదర్స్ ఇన్‌స్టింక్ట్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 27

మళ్లీ వస్తోన్న స్క్విడ్ గేమ్



ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్న కొరియన్ వెబ్‌సిరీస్ 'స్క్విడ్ గేమ్'కు కొనసాగింపుగా సీజన్ 2 వస్తోంది. తొలి సీజన్ తరహాలోనే రెండో సీజన్‌లోనూ స్క్విడ్ గేమ్‌లో పాల్గొన్న పోటీదారులు ఒక్కో టాస్క్ పూర్తి చేస్తూ ముందుకెళతారు. సీజన్ 2లో మొత్తం తొమ్మిది ఎపిసోడ్స్ ఉన్నాయి. కొత్త రూల్స్‌తో, తొలి సీజన్‌కు మించిన మలుపులతో ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. హోయాన్ జంగ్, లీ జంగ్ జే, పార్క్ హేసూ ప్రధాన పాత్రలు పోషించారు. డిసెంబర్ 26 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవనుంది.

ముఖానికి మీగడ రాస్తే...


చలికాలంలో ముఖం మీద చర్మం పొడిగా మారి పగులుతుంది. చిన్న పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. దీనికి మన పెద్దలు చెప్పిన పరిష్కారం పాల మీగడ రాయడమే. పాలను బాగా కాచి చల్లార్చిన తరవాత దానిపై ఒక పొర ఏర్పడుతుంది. దీనినే మీగడ అంటారు. దీనిని ఎక్కువగా స్వీట్ల తయారీలో ఉపయోగిస్తుంటారు. శీతాకాలంలో చర్మ సంరక్షణకు మీగడను మించింది లేదు.

ఎలా రాయాలంటే...

● ముందుగా ముఖాన్ని సున్నిపిండితో రుద్ది శుభ్రం చేసుకోవాలి. తరవాత కొద్దిగా పాల మీగడను తీసుకుని ముఖానికి రాసి వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావు గంట తరవాత మీగడ పూర్తిగా చర్మంలోకి ఇంకిపోతుంది. గోరువెచ్చని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకుని మెత్తని టవల్‌తో అద్దుకోవాలి. సాధ్యమైనంత వరకు సబ్బులు వాడకపోవడం మంచిది.

మీగడ రాయడం వల్ల...

● ముఖానికి, చేతులకు మీగడ రాసుకోవడం వల్ల చర్మం మీద పేరుకున్న మృతకణాలు తొలగిపోతాయి.



మీగడలోని లాక్టిక్ యాసిడ్ చర్మం మీద ఉన్న ఎపిడెర్మల్, డెర్మల్ పొరల్లో కొత్త కణాలను ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల చర్మం మృదువుగా కొత్తకాంతితో మెరిపిసోతుంది.

● చలి గాలుల వల్ల చర్మం తేమను కోల్పోతుంది. ఇలాంటపుడు మీగడను తరచూ రాస్తూ ఉంటే చర్మానికి తేమ అంది పగుళ్లు ఏర్పడవు. చిన్న పిల్లల చర్మం కోమలంగా ఉంటుంది. రసాయనాలతో కూడిన క్రీమ్‌లు రాయడం అంత మంచిది కాదు. వీరికి పాల మీగడ అద్భుతంగా పనిచేస్తుంది. మీగడలోని కొవ్వు పదార్థం చర్మానికి పోషణను అందిస్తుంది.

● ముఖానికి మీగడ రాసి మర్దన చేయడం వల్ల చర్మ రంధ్రాలన్నీ తెరచుకుంటాయి. వాటిలో చేరిన మురికి, ఇతర వ్యర్థ పదార్థాలన్నీ తొలగిపోతాయి. చర్మం శుభ్రపడడం వల్ల మొటిమలు, గుల్లలు రావు.


● బయటికి వెళ్లే ముందు ముఖానికి కొద్దిగా పాల మీగడ రాసుకుంటే ఎండ వల్ల చర్మం నల్లబడకుండా ఉంటుంది. సూర్యరశ్మిలోని ప్రమాదకర కిరణాలనుంచి చర్మానికి రక్షణ లభిస్తుంది.

● మీగడలో కొద్దిగా ఓట్స్ పొడి లేదా పంచదార కలిపి దానితో ముఖాన్ని మెల్లగా రుద్దితే చర్మం మృదువుగా మారుతుంది. మీగడలోని పోషకాలు చర్మంలోకి చేరి ముడతలు రాకుండా కాపాడతాయి. ముఖం ప్రకాశవంతంగా మారుతుంది. మీగడను చేతులకు రాసుకున్నా మంచి ప్రయోజనం కనిపిస్తుంది.

● కొంతమందికి ఎండ తగలగానే ముఖం ఎర్రగా కందిపోతుంది. ఇటువంటి వారికి పాల మీగడ బాగా పనిచేస్తుంది. ఎండ వల్ల కలిగే సురుకుపోటును నివారిస్తుంది.

అంతా 'రామ' మయం

వెండితెర వేలుపు, తెలుగువారి ప్రియతమ నేత ఎన్.టి.రామారావు. ఆయన సినీ జీవిత విశేషాలతో కూడిన వ్యాసాల సమాహారం 'తారకరామం' పుస్తకం ఇటీవల విడుదలైంది. అందులోని కొన్ని ఆసక్తికర అంశాలు ఇవి...



విశాఖలో శ్రీరామపట్టాభిషేకం

● 'రామా! అయిదు ఘడియలు దాటకముందే యుద్ధాన్ని ప్రారంభించు! అది దాటెనా, నీవు లంకేశ్వరుని నిర్జించలేవు!' ఈ సలహా శ్రీరామునికి ఇచ్చింది మరెవరో కాదు. సాక్షాత్తూ రావణుడే. అంతేకాదు 'సమస్త సన్మంగళానిభవన్తు! విజయోస్తు!' అని కూడా శ్రీరాముని ఆశీర్వదిస్తాడు లంకాధినాథుడు. ఈ దృశ్యాన్ని 'శ్రీరామ పట్టాభిషేకం' చిత్రానికై అత్యంత సహజమైన రీతిలో విశాఖపట్టణం సముద్రతీరాన గల జోడుగుళ్ల పాలెం వద్ద రామారావు చిత్రీకరించారు.

ఈ విధంగా తల పండిన విద్వాంసునిగా, మహోదాత్తునిగా రావణుని వ్యక్తిత్వాన్ని ప్రస్ఫుటం చేసి ఇప్పటికే తెరకెక్కిన ఎన్నెన్నో రామాయణ గాథల కన్నా మిన్నగా, రికార్డ్ బ్రేక్ చిత్రంగా శ్రీరామపట్టాభిషేకం గాథను ప్రజలకందించాలని తలపెట్టినట్టు రామారావు స్వయంగా తెలియజేశారు.

● భీమునిపట్నం వెళ్లే దారిలోగల ముప్వలవాని పాలెం సమీపాన సుమారు పన్నెండు రోజులపాటు ఈ సినిమా నిర్మాణం జరిగింది. లంకకు వానరసేన వారధి నిర్మించడం, రామ-రావణ యుద్ధం, సంజీవి మూలికను ఉపయోగించి లక్ష్మణుని మూర్ఛ నుంచి బతికించడం, రావణ వధ, సీతాదేవి అగ్ని ప్రవేశం లాంటి అనేక కీలక ఘట్టాలను ఇక్కడ చిత్రీకరించారు.

● మరునాడు యుద్ధభూమిలో రావణుడు నేలకూలు తాడనగా భార్య మండోదరి(జమున) 'ఆలపించనా ఈ వేళ! మధురస్మృతులే, హృదిని మీటగా, శ్రీలంకేశుని జీవనకావ్యం' అంటూ గానం చేస్తుంది.

● స్టంట్ మాస్టర్ సాంబశివరావు వానర సేనకు సూచనలిచ్చి షాట్‌కు సిద్ధం చేశారు. 'యాక్షన్' అని అసోసియేట్ డైరెక్టర్ సాయిబాబు ఆదేశం ఇచ్చినా, ఎవ్వరూ గదలు కదపలేదు. కట్, కట్ అంటూ ముందుకు వచ్చిన రామారావు 'ఎవ్వరూ యాక్షన్ చెయ్యరేం!' అని ప్రశ్నించారు. 'అవునండీ మరి గదలు, తోకలు విరిగితే మాకిచ్చే డబ్బుల్లో కోతపెడతామని రంగులేసే దగ్గర వార్నింగిచ్చారు. అందుచేత అవి పాడవకుండా చూస్తున్నాం!' అని జవాబిచ్చాడు ఒక ధర్మబుద్ధి. 'ఛ ఛ! అదేం లేదు గదలు విరిగినా పర్వాలేదు. మీ తలలు పగలకుండా చూసుకుని, స్టంట్ మాస్టర్ చెప్పినట్టు బాగా ఫైటింగ్ చేయండి. మీ డబ్బులేమీ తగ్గించరు' అని రామారావు వారికి అభయం ఇచ్చాక వానర మూక షాట్‌లో చెలరేగిపోయారు.

కథేమిటని అడిగితే...

(గుడిపూడి శ్రీహరి ఇంటర్వ్యూలో ఎన్‌టీఆర్ చెప్పిన విశేషాలు)

● నేను ఈ రోజు దర్శకుణ్ణవడానికీ, దీక్షతో చిత్రాలు తీయడానికీ- గతంలో ప్రముఖ దర్శకుల వద్ద పనిచేసే రోజుల్లో ఒంటబట్టించుకున్న సారమే ప్రోత్సహించింది. నా జీవితంలో మొదటి మలుపు తీసుకొచ్చిన దర్శకులు కే.వీ.రెడ్డి, బీయన్ రెడ్డి, యల్.వీ.ప్రసాద్. ఈ రోజు వరకూ ఇంతకన్నా గొప్ప దర్శకులు తెలుగు సినిమా రంగంలో రాలేదు. వీరి దర్శకత్వంలో నేను రెండు సంవత్సరాల్లో (పాతాళభైరవి తీస్తున్న రోజులు) పైకి రాలేకపోతే మద్రాసునీ, చలనచిత్ర రంగాన్ని శాశ్వతంగా వదిలి వెళ్లిపోవాలని నిశ్చయించుకున్నా! వారి దర్శకత్వంలో హీరోగా క్రమశిక్షణతో కృషి చేసి పైకి రావడానికి అదే సరైన సమయమనీ, అదొక పరీక్ష అనీ భావించుకున్నా! ఈ రోజు నేను దర్శకుణ్ణవడానికి కూడా నా మీద పడిన వారి ప్రభావమే కారణం.

● ఇప్పుడు నటనలో, సినిమా తీసే విధానాల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, కార్యదీక్ష చాలావరకూ తగ్గిపోయాయి. ఉదాహరణకు ఒక విషయం చెబుతాను. మద్రాసుకు యాభై మైళ్ల దూరంలో ఉన్న తడకి తెల్లవారుఝామునే వెళ్లి మేకప్ వేసుకుని అక్కడి నుంచి అయిదు మైళ్లు కారులో వెళ్లి రిహార్సల్సు చేసుకుని షూటింగ్‌కి సూర్య భగవానుడి కోసం ఎదురుచూసేవాళ్లం. ఇప్పుడు అలా ఉండడం లేదు. జగదేక వీరుని కథ తీస్తున్న సమయంలో ఎవరో అరవై మంది ప్రముఖులు షూటింగ్ చూడడానికి స్టూడియోకి వచ్చారు. నాగిరెడ్డి వారిని సెట్ మీదికి తీసుకు వచ్చారు. శివశంకరీ... శివానంద లహరీ... పాట చిత్రీకరించాలి. మేమంతా మేకప్ వేసుకుని రెడీగా ఉన్నాం. అంతలో 'రామారావు గారూ! మనం షాట్ తీద్దాం!' అన్నారు రెడ్డిగారు. ఆరున్నర నిమిషాల పాట అది. 'రెడీ' అన్నాను. అంతే! షూటింగ్ మొదలైంది. ఒకే టేక్‌లో పాటంతా షూట్ చేశారు. ప్రతి దృశ్యానికీ మా సంసిద్ధత అలా ఉండేది.

● అప్పుడప్పుడూ నేను 'కథేమిటి?' అని అడిగేవాణ్ణి. కే.వీ. రెడ్డి, బీయన్.రెడ్డి వెంటనే నవ్వేసేవారు. 'రామారావూ! స్క్రిప్టు తీసుకు చదవాలిగానీ కథ అడుగుతావేమిటి?' అనేవారు. చివరికి షాట్ ఏమిటో అడిగినా సరే హాస్యాస్పదంగా ఉండేది. ఎందుకంటే స్క్రిప్టు రెడీగా ఉండేది. చదువుకుని సిద్ధపడేవాళ్లం. ఈ రోజుకి కూడా నాకు వారి పద్ధతులే ఒక ఇన్‌స్పిరేషన్. వాటితోనే దర్శకత్వం నిర్వహించడానికి కృషి చేస్తున్నా! నాకే కాదు తెలుగు పరిశ్రమకే వారు గురుతుల్యులు. వారి అడుగుజాడల్లోనే నడుస్తున్నా! ఒక చిత్రం ప్రారంభించిన తరవాత అది ముగిసేదాకా మరో చిత్రం గురించి ఆలోచించకూడదు. దాన్ని పూర్తిచేయాలంటే కనీసం ఆరేడు నెలలైనా పడుతుంది. ఇప్పుడేముంది? స్పీడ్... స్పీడ్... అంటూ చిత్రం త్వరగా పూర్తిచేయాలంటారు. మేం నటించడం లేదు. పాత్రలతో ఆడుకుంటున్నాం. అంతే!

● నేను కూడా ఇదే గాలివానలో కొట్టుకుపోతున్నందుకు బాధగా ఉంది. నా అభిమానులంతా నేను అలాగే నటించాలంటున్నారు. అలాగే నటిస్తున్నా! కానీ ఇది నా అభిమతం కాదు. కమర్షియల్ ఆర్టిస్టుని కదా! పొరపాటున ఈ గాలికి అడ్డం తిరిగానంటే కొట్టుకుపోతాను. నిజానికి నాలోని కళాకారుడు నేను వేస్తున్న వేషాలకి ప్రతిక్షణం తిరగబడుతున్నాడు. ఇప్పటికి 280 పాత్రలు ధరించాను. ఇతరులను తృప్తిపరచగలిగాను కానీ నన్ను నేను తృప్తిపరచుకోలేకపోతున్నా! అభిమానులు చాలామంది ఇప్పటికీ నా పాత్రల గురించి ప్రస్తావిస్తుంటారు. వాటినే వారు గుర్తుంచుకున్నారు. వైవిధ్యం గల పాత్రలవి. అటు శ్రీరామ, శ్రీకృష్ణ, సుయోధన, భీష్మ, భీమ..... ఇటు ఉమ్మడి కుటుంబం, కోడలు దిద్దిన కాపురం, పెళ్లి చేసి చూడు తదితర చిత్రాల్లోని పాత్రలు.... వీటిని నటించడానికి ఎంతో నేర్పు, సామర్థ్యం అవసరం.

ఆనాటి కోతిబావ ఈనాటికీ...

● అందరూ ఎన్.టీ.ఆర్‌ని నటరత్న అని రాస్తుంటే ఏ ఒక్కరూ కూడా అందగాడని అనరేంటి? అనుకునేదాన్ని. దానికి కారణం లేకపోలేదు. రామారావు నటన కంటే మనిషిని మెచ్చిన కుర్రతనం అది. మల్లీశ్వరి సినిమాని ప్రముఖ జర్నలిస్ట్ ఖాసా సుబ్బారావుతో కలిసి చూశా. అప్పటికి నాకు తెలుగు వచ్చు. కానీ అది పరీక్షల చదువుతో వంటబట్టిన తెలుగు మాత్రమే. మల్లీశ్వరి పేరుతో సినిమా వచ్చినప్పటికీ అది హీరో సబ్జెక్ట్ అని ఈ రోజుకీ అంటున్నా. మల్లీశ్వరిలో మొదటిసారి హీరో రామారావుని చూశా. అంతకుముందు ఎక్కడో షావుకారు సినిమా వేస్తుంటే వెళ్లి చూశా. కానీ మల్లీశ్వరిలో రామారావు పంచె కట్టు, జుబ్బాతో అచ్చ తెలుగు యువకుడిలా అందంగా కనిపించాడు. మల్లీశ్వరిలో రామారావు గురించి ఎందుకు చెప్పుకోరు? నిజానికి ఆయన లేకపోతే కథేది? అని నేను వాదిస్తే 'అది నిజమే' అని ఖాసా నవ్వారు.

● ఎన్.టీ.ఆర్ ఇదివరకు చాలా తక్కువ మాట్లాడి ఎక్కువ నటించేవారు. అలా ఆలోచిస్తే నాకు తట్టే కారణం ఒక్కటే. పురాణ పురుషుల వేషాలు వేసిన రామారావుకి ఆ హుందా ఒంటబట్టేసింది. ఆ నిదానం, ఆ సుతిమెత్తని చిరునవ్వు, ఆ చేతుల కదలిక, ఆ నడక తీరు అతనికి అలవాటై పోయాయి. నిజానికి మీరే ఆలోచించండి! రాముడు, కృష్ణుడు ఎలా ఉండేవారు? మనకి తెలియదు. వారికొక రూపకల్పన ఇచ్చి మన ముందు సజీవ ప్రతిమలుగా నిలబెట్టారు రామారావు. దైవరూపాల్లో అక్షరాస్యులనే ఆకట్టుకున్న ఎన్‌టీఆర్ నిరక్షరాస్యులకు దైవంగా తోచడంలో ఆశ్చర్యం ఏముంటుంది.

● ఇప్పటికీ ఎన్‌టీఆర్ సినిమాలు చూస్తూ ఉంటా. నా అభిప్రాయం ఎప్పుడూ ఒక్కటే. రామారావు అందగాడు. అందుకే హీరోగా నిలబడ్డారు. ఆ అందంలో హుందాతనం, వృత్తిపై గౌరవం, తన శక్తిపై నమ్మకం ఉండడం వల్ల ఇంకా అందంగా కనిపించారు. అంతఃసౌందర్యమే కదా బాహ్య రూపానికి జీవకళనిచ్చేది! ఆ అంతరంగికమైన నిర్మలత్వం అండగా నిలిచి వయసుని తోసి రాజును చేసింది. అందుకే ఆనాటి 'కోతి బావ' ఈనాటికీ 'మగాడు' అని పించుకుంటున్నాడు.

- రామలక్ష్మి ఆరుద్ర



> ● ప్రేక్షకుల అభిరుచిలో మార్పు వస్తోంది. శంకరాభరణం లాంటి చిత్రాలను ప్రేక్షకులు అభిమానిస్తే నాలాంటి కళాకారుడికి ఎంతో ఆనందం కలుగుతుంది. కానీ అలాంటి చిత్రాలు అరుదుగా వస్తున్నాయి. ఒక్కోసారి అలాంటి చిత్రాలు ప్రేక్షకుల అభిమానానికి నోచుకోకపోయినా నాలాంటి వారు ఆ చిత్రాలను తీసినవాళ్లని అభినందించకుండా ఉండలేరు. అలాంటి చిత్రాలకు ప్రేక్షకాదరణ లభిస్తే అంతకన్నా ఏం కావాలి? పుణ్యం, పురుషార్థం రెండు దక్కడమే అవుతుంది. శంకరాభరణం, సిరిసిరి మువ్వ సినిమాలు చూసి విశ్వనాథ్ అభిమానిని అయ్యాను. ఇలాంటి చిత్రాలు చూసినపుడు మళ్లీ మంచి రోజులు వస్తున్నాయా అనిపిస్తుంది. అయితే విశ్వనాథ్ లాంటి దర్శకులు నాలాంటి ఆర్టిస్టులతో ఇలాంటి చిత్రాలు తీయడానికి ధైర్యం చేయరు. నాలాంటి నటులు నటించడానికీ ధైర్యం చేయరు. ఎందుకంటే మా నుంచి ప్రేక్షకులు చూడదలచింది వేరేగా ఉంటుంది.

ఇక పంచాయతీరాజ్‌లో ఒకే విడత రిజర్వేషన్

- ఉప సర్పంచినీ సస్పెండ్ చేసే అధికారం కలెక్టర్‌కు
- ప్రతి మండలానికి కనీసం అయిదుగురు ఎంపీటీసీలు
- చట్టంలో సవరణలకు శాసనమండలి ఆమోదం

హైదరాబాద్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ వ్యవస్థలో భాగమైన గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లలో రిజర్వేషన్లు ఇక నుంచి ప్రతిసారి మారనున్నాయి. ఇంతవరకు రిజర్వేషన్లు రెండు పర్యాయాలు అమల్లో ఉండగా దీనిని తొలగిస్తూ పంచాయతీరాజ్ చట్టంలో సవరణలు చేశారు. ఇకపై రిజర్వేషన్లు ఒక పర్యాయానికే పరిమితం కానున్నాయి. దీంతో పాటు పలు సవరణలకు శనివారం శాసనమండలి ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయకపోవడం, నిధుల దుర్వినియోగంపై సర్పంచిని సస్పెండ్ చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉండేది. ఆ తర్వాత ఉప సర్పంచి.. సర్పంచిగా బాధ్యతలు స్వీకరిస్తే అతడు కూడా అవినీతికి పాల్పడితే తొలగించే అధికారం కలెక్టర్‌కు ఉండేది కాదు. తాజా సవరణల్లో సర్పంచిగా బాధ్యతలు నిర్వహించే ఉప సర్పంచిని సస్పెండ్ చేసే అధికారం కూడా కలెక్టర్‌కు అప్పగించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులతోపాటు వార్డు సభ్యులు సైతం తమ ఎన్నికల ఖర్చు వివరాలను ఎన్నికల సంఘానికి సమర్పించాల్సి ఉండేది. తాజా సవరణల్లో వార్డు సభ్యులకు మినహాయింపు ఇచ్చారు. ప్రస్తుతం 3-4వేల జనాభాకు ఒక ఎంపిటిసి సభ్యుడు చొప్పున ఉండగా.. దీనిని మార్చారు. ఇక నుంచి ప్రతి మండల పరిషత్ పరిధిలో కనీసం అయిగురు ఎంపిటిసిలు ఉంటారు. ఔటర్ రింగురోడ్డు పరిధిలోని 51 గ్రామ పంచాయతీలను సమీప పురపాలికల్లో విలీనం, రాష్ట్రవ్యాప్తంగా 80 గ్రామ పంచాయతీలను స్థానిక పురపాలికల్లో విలీనం చేస్తూ చట్టంలో సవరణలు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ఎన్నికల సంఘం, ట్రిబ్యునల్ సూచనల మేరకు చట్టంలో సవరణలు చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.

ఆదివాసీల కోసం సివిల్స్‌కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయండి

- జిల్లాల్లో స్టడీ సర్కిళ్లు పెట్టండి
- ఆదివాసీ భాషలో విద్యకు చర్యలు తీసుకోండి
- సీఎంకు వినతి

హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ విద్యార్థుల కోసం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సివిల్స్ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఆదివాసీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరారు. గడిచిన 70 ఏళ్లుగా తెలంగాణ నుంచి ఆదివాసీ వర్గానికి చెందిన ఒక్క సివిల్ సర్వెంట్ కూడా ఎంపిక కాలేదని సీఎం దృష్టికి తెచ్చారు. కనీసం గ్రూప్ 1 అధికారిగా కూడా ఎంపిక కాలేదన్నారు. ప్రత్యేకంగా సివిల్స్ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఆదివాసీ బిడ్డలను ఐఏఎస్, ఐపీఎస్‌లుగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని.. శనివారం ఆయన ఛాంబర్లో కలిసిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, వెడ్మ బొజ్జు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ ప్రత్యేక సివిల్స్ కోచింగ్ సెంటర్లో 500 మంది విద్యార్థులకు సరిపడా సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే ఆదివాసీ జిల్లాల్లో ఆదివాసీలకు ప్రత్యేకంగా స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆదివాసీ విద్యార్థుల కోసం జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్లనూ ఏర్పాటు చేయాలన్నారు. ఎంబీబీఎస్, ఇంజినీరింగ్ తదితర కోర్సులకు ఎంపికైన విద్యార్థులకు ఐటీడీఏల ద్వారా ఆర్థిక సాయం అందించాలన్నారు. పోడు పట్టాలు పొందిన ఆదివాసీలకు ఉచిత విద్యుత్తు సౌకర్యం అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆదివాసీ భాషలో విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఉత్తుత్తి భద్రత!

మండలిలో పనిచేయని డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్.. అలంకార ప్రాయంగా ఫ్రేమ్ ఏర్పాటు

భద్రత గాలి కొదిలేసి సెల్‌ఫోన్లలో నిమగ్నమైన సిబ్బంది.. ఉదయం నుంచి అదే పరిస్థితి

హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో భద్రతా లోపం బహిర్గతమైంది. చైర్మన్, సభ్యులు కొలువుదీరిన పెద్దల సభ వద్ద ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన భద్రతా సిబ్బంది నిర్లక్ష్యం బయటపడింది. శనివారం మండలిలో కీలక బిల్లులపై చర్చ జరిగింది. సభలో మంత్రులు, సభ్యులు ఉన్నారు. ఇంతటి కీలకమైన ప్రాంతంలో ఏ మాత్రం పని చేయని డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ ఒకటి ఉంచారు. మండలి ప్రధాన ద్వారం వద్ద ఉంచిన డోర్ ఫ్రేమ్ నుంచి లోనికి వెళ్లే వారిని తనిఖీ చేసి పంపిస్తారు. ఆ తర్వాత అధికారులు, ఇతర సిబ్బంది వేళ్లే మార్గంలో ఓ ఫ్రేమ్, మీడియా సభ్యులు వెళ్లేందుకు మరో ఫ్రేమ్‌ను సిటీ సెక్యూరిటీ వింగ్(సీఎస్‌డబ్ల్యూ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అయితే మీడియా ప్రతినిధులు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ ఏ మాత్రం పనిచేయలేదు. ఊరికే పైపులు బిగించి అలంకార ప్రాయంగా ఫ్రేమ్ ఏర్పాటు చేశారు. బాక్స్‌కు ఎలాంటి విద్యుత్ కనెక్షన్ లేదు. బ్యాటరీ చార్జింగ్ లేకపోవడం, అత్యవసరంగా బ్యాటరీలు అమర్చకపోవడంతో డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ పనిచేయడం లేదు. ఈ ఫ్రేమ్ ఏర్పాటు చేసి నలుగురు సిబ్బంది పక్కనే కుర్చీలు వేసుకుని కూర్చున్నారు. ఏ మాత్రం సంబంధం లేకుండా భద్రతను గాలికొదిలేసి వచ్చి పోయే వారిని గమనించకుండా పిచ్చాపాటిగా మాట్లాడుకోవడం, సెల్‌ఫోన్లు చూసుకోవడంలో నిమగ్నమయ్యారు. డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ ఎందుకు పనిచేయడం లేదని అక్కడే ఉన్న భద్రతా సిబ్బందిని ప్రశ్నించగా చార్జింగ్ లేదని సమాధానం ఇవ్వడం కొసమెరుపు. అయితే ఇది ఏ కొద్ది సమయమో కాదు ఉదయం నుంచి సాయంత్రం వరకు అదే పరిస్థితి కనిపించింది.


శాసన మండలిలో పని చేయని డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్

7 రోజులు.. 38 గంటలు!

- వాడీవేడిగా అసెంబ్లీ శీతాకాల సమావేశాలు
- తెలంగాణ తల్లి ఆవిర్భావోత్సవ ప్రకటనతో షురూ
- ఆఖరి రోజున రైతు భరోసాపై చర్చతో ముగింపు
- భూభారతి సహా 8 బిల్లులకు ఆమోదం



హైదరాబాద్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): శాసనసభ శీతాకాల సమావేశాలు వాడీవేడిగా జరిగాయి. తెలంగాణ తల్లి ఆవిర్భావ ఉత్సవంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనతో మొదలైన సమావేశాలు.. శనివారం రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చ తర్వాత నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ సమావేశాల్లో తెలంగాణ భూ భారతి సహా 8 బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. 7 రోజుల్లో సుమారుగా 38 గంటల పాటు సమావేశాలు జరగ్గా.. సీఎం, మంత్రులతోపాటు 71 మంది సభ్యులు చర్చల్లో పాల్గొన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్.. యథా ప్రకారం శీతాకాల సమావేశాలకూ హాజరు కాలేదు. వాస్తవానికి డిసెంబరు 9న సమావేశాలు ప్రారంభం కాగా.. తెలంగాణ తల్లి ఆవిర్భావ ఉత్సవంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారు. తిరిగి 16న ప్రారంభమైన సమావేశాలు.. శనివారం వరకూ కొనసాగాయి. 16న.. ఆ తర్వాత లగచర్ల ఘటనపై చర్చకు బీఆర్ఎస్ పట్టు పట్టింది. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. అయితే, వివిధ బిల్లులకు ఆమోద ముద్ర వేయడానికి సమావేశమైన క్యాబినెట్.. ఫార్ములా-ఈ కేసులో ఏసీబీ విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒక్క సారిగా ఫార్ములా-ఈ కేసు తెరపైకి రావడం, ఏ1గా కేటీఆర్ ఉండడంతో సమావేశాలు ఒక్క సారిగా వేడెక్కాయి. ఫార్ములా-ఈ రేసుపై చర్చకు బీఆర్ఎస్ సభ్యులు పట్టు పట్టడంతో సభలో తీవ్ర గందరగోళం చోటు చేసుకుంది. సభ నిర్వహణ తీరు పట్ల, పలు అంశాలపై సభలో చర్చల సందర్భంగా అసహనం వ్యక్తం చేస్తూ వచ్చిన మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ.. సభ ముగిసే సమయానికి కాంగ్రెస్ వైపు మళ్లారు. ఫార్ములా ఈ రేసుపై చర్చ కోసం బీఆర్ఎస్ సభ్యులు పట్టు పడుతున్న క్రమంలో ఆయన సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. అనంతరం సభను బీఆర్ఎస్ సభ్యులు అడ్డుకుంటున్న తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తద్వారా అధికార కాంగ్రెస్ పార్టీకి మజ్లిస్ పూర్తిస్థాయిలో మద్దతుగా ఉంటుందన్న సంకేతాన్ని ఇచ్చారు.

హరీశ్ సవాల్.. స్వీకరించిన రేవంత్

సభలో అధికార, విపక్షాల మధ్య వాద, ప్రతివాదనలు నడుస్తున్న క్రమంలో సభలో ఓఆర్ఆర్ టోల్ లీజు వ్యవహారం ప్రస్తావనకు వచ్చింది. ఈ అంశంపై ప్రభుత్వం విచారణ చేసుకోవచ్చని హరీశ్‌రావు సవాల్ విసిరారు. అయితే, ఆ సవాల్‌ను స్వీకరించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఓఆర్ఆర్ టోల్ లీజు వ్యవహారంపైన సిట్ విచారణకు ఆదేశించారు. మరో వైపు రాష్ట్ర అప్పులపై ఆర్బీఐ నివేదికకు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటనకూ తేడా ఉందంటూ హరీశ్‌రావు, కేటీఆర్ ఆరోపించారు. వారి కోరిక మేరకు రాష్ట్ర అప్పులపైన స్వల్పకాలిక చర్చను చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. సమగ్ర వివరాలు వెల్లడించారు. ఏడు రోజుల పాటు సాగిన శాసనసభలో తెలంగాణ భూ భారతి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీ, తెలంగాణ యూనివర్శిటీలు, తెలంగాణ జీఎస్టీ, వేతనాలు-పెన్షన్ల చెల్లింపులు, జీహెచ్ఎంసీ, తెలంగాణ మున్సిపాలిటీలు, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు సంబంధించి సవరణ బిల్లులపైనసభలో చర్చించి.. ఆమోదించారు. మండలిలోనూ 8 బిల్లులను ఆమోదించడంతోపాటు 3 అంశాలపై స్వల్పకాలిక చర్చ జరిగింది.

ప్రజావసరాల దృష్టితో చర్చ జరిపాం: శ్రీధర్‌బాబు

ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకునే శీతాకాలం అసెంబ్లీ సమావేశాలు నిర్వహించామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రజాస్వామిక పద్ధతిలో ఏడాది కాలంగా సభలో ఒక్క సస్పెన్షన్‌కూ తావు ఇవ్వకుండా సభను నడిపామన్నారు. సభ వాయిదా అనంతరం ఏర్పాటు చేసిన మీడియాతో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామని చెప్పిన తాము.. అసెంబ్లీలో భూ భారతి బిల్లును పెట్టి ఆమోదింపజేశామన్నారు. స్పీకర్ నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సభను అడ్డుకోవడానికి చేసిన ప్రయత్నాన్ని ఖండిస్తున్నామన్నారు. సినీ పరిశ్రమ తమకు ముఖ్యమని, అయితే ఎంత పెద్ద వారైనా మానవీయ కోణం మరిచిపోవద్దని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారన్నారు.


మండలి చైర్మన్ గుత్తాసుఖేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న పొంగులేటి

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 'భూ భారతి' మాకు రెఫరెండం

- ఈ చట్టం మాకు శ్రీ రామరక్ష
- ధరణితో పోయిన భూములు భూభారతితో హక్కుదారుల సొంతం
- మండలిలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నో సమావేశాలు, చర్చలు, సంప్రదింపుల తర్వాతే భూ భారతి చట్టాన్ని రూపొందించినట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నాలుగేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పనితీరుకు భూ భారతి రెఫరెండంగా నిలుస్తుందన్నారు. మండలిలో భూ భారతి బిల్లుపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి మాట్లాడారు. భూ భారతి చట్టం తమ ప్రభుత్వానికి శ్రీ రామరక్షగా నిలుస్తుందని చెప్పారు. "మనిషికి అన్నింటికంటే విలువైంది భూమి. ప్రపంచంలో అన్నింటికంటే విలువైంది, ప్రాణప్రదమైంది భూమి ఒక్కటే" అని ఆయన పేర్కొన్నారు. మనిషికి తన భూమి అంటే ప్రాణమని, అలాంటి ప్రాణాన్ని యమధర్మరాజు లాంటి ధరణి తీసుకుపోతే వారి గతి ఏమిటి? యముడి నుంచి తెలివిగా తన భర్త ప్రాణాలు తెచ్చుకున్న సతీసావిత్రిలాగా ఇప్పుడు భూ భారతితో ధరణిలో పోయిన భూములు తిరిగి హక్కుదారులకు చేర్చే పరిస్థితి ఏర్పడిందని మంత్రి వివరించారు. గత నియంతృత్వ ప్రభుత్వం నలుగురికోసం ఒకరిద్దరుకలిసి చట్టాన్ని తయారు చేశారని ఆరోపించారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో 4కోట్ల మంది కోసం అందరి అభిప్రాయాలు, ఆలోచనలు, సూచనలు, సలహాలు, ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని చట్టం రూపొందించామని తెలిపారు. 'భూ భారతి రానున్నకాలంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు మార్గదర్శికానుంది. భూ భారతి ప్రజామోదం పొందిందన్న ఉక్రోషంతో బీఆర్ఎస్‌కు నిద్రపట్టడం లేదు. భూ భారతి భూ యజమానుల జీవితాల్లో సరికొత్త కాంతుల్ని ప్రసరింపజేస్తుంది. ఇది అమల్లోకి వస్తే... బీఆర్ఎస్ పెద్దలు దోచుకున్న భూముల వివరాలు బయటపడతాయి' అని మంత్రి అన్నారు. 2020 నూతన రెవెన్యూ చట్టం, ధరణి పోర్టల్.. కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన నాటి సీఎం కేసీఆర్.. తెలంగాణ సమాజంలో సృష్టించిన విధ్వంసం ఏంటో అందరికీ తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత ముగింపు పలికేలా భూ భారతి చట్టాన్ని తెచ్చామని మంత్రి వివరించారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో ఉన్న ఆర్వోఆర్ చట్టాలను పూర్తిగా అధ్యయనం చేసి ఈ నూతన చట్టానికి ప్రాణం పోశామన్నారు. దేశంలోనే నంబర్‌వన్‌గా, రోల్‌మోడల్‌గా భూ భారతి చట్టం నిలుస్తుందని మంత్రి పొంగులేటి చెప్పారు.


నవ్య | చిత్రజ్యోతి

నాదైన ముద్ర కోసం తపిస్తా



'ప్రతి పాటను ఒక సవాల్‌గా తీసుకొని కొరియోగ్రఫీ చేస్తాను. పనిలో నాదైన ముద్ర ఉండాలని తపిస్తాను. దాని వల్లే ఇండస్ట్రీలో, ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు దక్కింది' అని విజయ్ పోలాకి మాస్టర్ అన్నారు. టాలీవుడ్‌లో పలువురు అగ్రహీరోల సినిమాలకు డాన్స్ మాస్టర్‌గా పనిచేస్తూ బిజీగా ఉన్న విజయ్ పోలాకి తన సినీ ప్రయాణం గురించి మీడియాతో మాట్లాడారు. 'కెరీర్ ఆరంభంలో డాన్స్ మాస్టర్‌గా అవకాశాల కోసం చాలా కష్టపడ్డాను. నా వీడియోలు చూసిన హీరో రామ్ పోతినేని ప్రోత్సహించారు. చాలా సినిమాలకు కొరియోగ్రఫీ చేసినా తొలిసారి ప్రేక్షకులు, ఇండస్ట్రీలో గుర్తింపు దక్కింది మాత్రం 'పలాస' చిత్రంలోని 'నాది నక్కిలీసు గొలుసు' పాటతోనే. ఆ తర్వాత హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ 'పుష్ప' చిత్రంలోని 'ఊ అంటావా మావా' పాటకు కొరియోగ్రఫీ చేసే అవకాశం ఇచ్చారు. 'పుష్ప 2' చిత్రంలో టైటిల్ సాంగ్, జాతర పాటకు ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన చాలా సంతృప్తినిచ్చింది. ఈ సినిమా నా కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోతుంది' అని అన్నారు.

త్రీడీలో చేయడం సవాల్‌గా అనిపించింది



మోహన్‌లాల్

"'బరోజ్ 3డీ' దర్శకుడిగా నాకు తొలి సినిమా. మొదటి చిత్రాన్నే త్రీడీలో చేయడం సవాల్‌గా అనిపించింది. నటుడిగా, దర్శకుడిగా ఈ చిత్రం నాకు సరికొత్త అనుభూతిని ఇచ్చింది. గత 40 ఏళ్లలో మలయాళ పరిశ్రమలో ఇలాంటి సినిమా రాలేదు' అని మోహన్‌లాల్ అన్నారు. అగ్ర కథానాయకుడిగా మలయాళ పరిశ్రమను ఏలుతున్న మోహన్‌లాల్ 'బరోజ్'తో మెగాఫోన్ చేపట్టారు. ఆయన టైటిల్ రోల్ పోషిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'బరోజ్ 3డీ'. ఆంటోని పెరుంబవూర్ నిర్మించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ తెలుగులో విడుదల చేస్తోంది. ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా మోహన్‌లాల్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. "గార్డియన్ ఆఫ్ డి గామాస్ ట్రెజర్' నవల ఆధారంగా ఒక కల్పిత ప్రపంచాన్ని సృష్టించాం. ఒక రహస్య నిధిని కాపాడుతూ అందులోని సంపదను నిజమైన వారసులకు అందించేందుకు బరోజ్ అనే పాత్ర చేసే ప్రయత్నాలు అద్భుతంగా ఉంటాయి. కథనం కొత్తగా ఉంటుంది. ప్రేక్షకులు తర్కాన్ని పక్కనపెట్టి, సినిమాను ఆస్వాదించాలని కోరుతున్నాను. త్రీడీ సినిమా చేయడం అంత సులువు కాదు. ప్రేక్షకుడికి గొప్ప అనుభూతిని ఇవ్వడానికి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రఖ్యాత సాంకేతిక నిపుణులు పనిచేశారు. హాలీవుడ్ పాపులర్ కంపోజర్ మార్క్ కిల్లియన్ బీజీఎం, లిడియన్ నాదస్వరం సంగీతం, సంతోశ్ శివన్ కెమెరా వర్క్ 'బరోజ్'ను ప్రత్యేకంగా నిలుపుతాయి. టాప్ హాలీవుడ్ టెక్నీషియన్స్ గ్రాఫిక్స్‌ను అందించారు. ప్రేక్షకులకు సరికొత్త థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. పిల్లలు, పెద్దలు అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని అన్నారు.

మీ అభిమానానికి మాటలు రావడం లేదు

- రామ్‌చరణ్



శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటించిన భారీ చిత్రం 'గేమ్ ఛేంజర్'. కియారా అద్వానీ హీరోయిన్. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. ప్రపంచ వ్యాప్తంగా జనవరి 10న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా యూఎస్‌లోని డల్లాస్‌లో మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో రామ్‌చరణ్ మాట్లాడుతూ 'ఇక్కడి వారు చూపించిన అభిమానానికి మాటలు రావడం లేదు. మీరు స్వాగతం పలికిన తీరుకు ఆశ్చర్యపోయాను. ఆంధ్ర, తెలంగాణలో ఉన్నామా లేక డల్లాస్ వచ్చామా అని కూడా అర్థం కావడం లేదు. ఇక్కడి నుంచే మూవీ ప్రమోషన్స్‌ను మొదలుపెడుతున్నాం. మీ అందరి ఆశీస్సులు కావాలి' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'గేమ్ ఛేంజర్' అనే టైటిల్‌ను పెట్టినప్పుడే సరికొత్తగా ప్రమోషన్స్ చేయాలని నిర్ణయించుకున్నాం. అందులో భాగంగా డల్లాస్‌ను ఎంపిక చేసుకున్నాం. ఇక్కడ ఈవెంట్ నిర్వహణకు రాజేశ్ ముందుకొచ్చి సహకరించారు' అని చెప్పారు.

క్రిస్మస్ గిఫ్ట్‌లాంటి సినిమా



అనన్య నాగళ్ల

"'శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్' చిత్రంలో నా పాత్ర పేరు భ్రమరాంబ. నేను ఇప్పటివరకూ ఇలాంటి పాత్ర చేయలేదు. అందమైన ప్రేమకథతో పాటు థ్రిల్, సస్పెన్స్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. ప్రేక్షకులకు ఈ సినిమా మంచి క్రిస్మస్ గిఫ్ట్ అవుతుంది' అని హీరోయిన్ అనన్య నాగళ్ల అన్నారు. వెన్నెల కిశోర్ టైటిల్ పాత్ర పోషించిన ఈ చిత్రానికి మోహన్ దర్శకత్వం వహించారు. వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. చిత్రం ఈ నెల 25న విడుదలవుతున్న సందర్భంగా అనన్య నాగళ్ల మీడియాతో ముచ్చటించారు. 'మోహన్ కథ చెప్పినప్పుడు కొత్తగా అనిపించింది. సంఘటన ఒకటే అయినా దాన్ని చూసిన వాళ్లలో ఒక్కొక్కరు ఒక్కోలా స్పందిస్తారు అనే పాయింట్‌తో విభిన్న కోణాల్లోంచి కథను నడిపించడం ఆసక్తికరంగా అనిపించింది. తెలుగులో డిటెక్టివ్ సినిమా అనగానే చిరంజీవి గారి 'చంటబ్బాయ్' గుర్తుకొస్తుంది. మా సినిమా కథ కూడా అందరికీ కనెక్ట్ అయ్యే విధంగా 'చంటబ్బాయ్ తాలూకా' అనే ఉపశీర్షిక పెట్టారు. మోహన్ స్పష్టత ఉన్న దర్శకుడు. రమణారెడ్డి సినిమాకు అవసరమైన వాటన్నింటినీ సమకూర్చారు' అని తెలిపారు.

రామ్‌గోపాల్‌వర్మకు బిగ్ షాక్!

'వ్యూహం' వెబ్‌సిరీస్‌కు చెల్లింపులపై ఫైబర్‌నెట్ లీగల్ నోటీసులు

- వచ్చిన వ్యూస్ 2,228.. కానీ 2 లక్షలంటూ తప్పుడు ఇన్‌వాయిస్‌లు
- రూ.1.14 కోట్లు ఇచ్చిన గత పాలకులు

అమరావతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు, సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మకు కూటమి ప్రభుత్వం గట్టి షాకిచ్చింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు జగన్‌కు, వైసీపీకి ప్రయోజనం చేకూర్చేలా ఆయన తీసిన 'వ్యూహం' వెబ్‌సిరీస్‌కు నిబంధనలు, ఒప్పందానికి విరుద్ధంగా రూ.1,14,96,610 చెల్లించడాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) తీవ్రంగా పరిగణించింది. దీనివల్ల సంస్థకు ఆర్థికంగా నష్టం జరిగిందంటూ ఎండీ దినేశ్‌కుమార్ దర్శకుడు వర్మకు, చిత్ర నిర్వాహకులకు శనివారం లీగల్ నోటీసులు జారీచేశారు. సదరు మొత్తాన్ని 12 శాతం వడ్డీతో, 18 శాతం అపరాధ రుసుముతో.. నోటీసు అందుకున్న 15 రోజుల్లో చెల్లించాలని ఆదేశించారు. గతంలో ఫైబర్‌నెట్ ఏజీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన వయ్యూరు గుణశంశాక్ రెడ్డి, మాజీ ఎండీ మద్దిరాల మధుసూదన్‌రెడ్డి, మెస్సర్స్ ఆర్జీవీ ఆర్వీ గ్రూప్ భాగస్వామి రవిశంకర్ వర్మ గొట్టుముక్కల, ఆర్జీవీ ఆర్వీ గ్రూప్ మేనేజింగ్ పార్ట్‌నర్ రాంగోపాల్ వర్మ పెనుమత్స, మెస్సర్స్ ఆర్జీవీ ఆర్వీ గ్రూప్‌లకు లీగల్ నోటీసులు పంపారు. 'వ్యూహం' తొలిభాగానికి 1,845 వ్యూస్, రెండో భాగానికి కేవలం 383 వ్యూస్ వచ్చాయని.. అయితే ఏకంగా 2,09,000 వ్యూస్ వచ్చాయంటూ రూ.2.09 కోట్లకు వర్మ అండ్ కో ఇన్వాయిస్ సమర్పించారని తెలిపారు. తప్పుడు ఇన్వాయిస్ ఇవ్వడం ద్వారా సంస్థకు ఆర్థికంగా భారీ నష్టాన్ని చేకూర్చారని తెలిపారు. 25 సినిమాలను ప్రసారం చేసేందుకు వర్మతో ఫైబర్‌నెట్ అవగాహన కుదుర్చుకుంది. ప్రతి సినిమాకు వచ్చే 'వ్యూస్'తో సమకూరే ఆదాయాన్ని చెరిసగం తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. కానీ 'వ్యూహం' వెబ్‌సిరీస్ రెండు భాగాలకు కలిపి కేవలం 2,228 వ్యూస్ రాగా.. 2 లక్షల వ్యూస్ వచ్చినట్లు చూపించారు. ఇందుకు చెల్లించే మొత్తంలో 75 శాతం ఆర్జీవీకి ఇచ్చారని నోటీసులో పేర్కొన్నారు. మొత్తం పన్నులతో కలిపి రూ.2,09,00,000 చెల్లించారు. వ్యూహం తొలి భాగానికి 1,845 వ్యూస్‌తో రూ.1,86,225, రెండో భాగానికి 383 వ్యూస్‌తో రూ.50,046 (మొత్తం రూ.2,36,271) మాత్రమే ఆదాయం వచ్చింది. అయితే గత యాజమాన్యం వర్మకు ఏకంగా రూ.1,14,96,610 చెల్లించడాన్ని ప్రస్తుత యాజమాన్యం తీవ్రంగా పరిగణిస్తోంది. దీనిపై విచారణ జరపాలని ఫైబర్‌నెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను చైర్మన్ జీవీ రెడ్డి ఆదేశించారు. దీని ఆధారంగా సంబంధిత సిబ్బందిపై క్రిమినల్ చర్యలు చేపడతామని ఆయన 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

'సత్వా ఎలిగ్జిర్'లో భారీ అగ్ని ప్రమాదం

- నాలుగో అంతస్తులోని రెస్టారెంట్‌లో పేలుడు
- పేలుడు తీవ్రతతో కుప్పకూలిన సీలింగ్, గోడలు
- 100 మీటర్ల వరకు దూసుకెళ్లిన అద్దాల ముక్కలు
- సమీపంలో ఎవరూ లేకపోవడంతో తప్పిన ముప్పు
- ఇద్దరు ఉద్యోగులకు స్వల్ప గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- రూ.10 కోట్ల ఆస్తి నష్టం.. ఉలిక్కిపడ్డ ఐటీ కారిడార్


ప్రమాదం జరిగిన భవనం

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని సత్వా ఎలిగ్జిర్ అద్దాల భవనంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. శనివారం ఉదయం 6 గంటల సమయంలో ఐదంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఐటీ కారిడార్ ఉలిక్కిపడింది. ఆ భవనంలోని నాలుగో అంతస్తులో ఉన్న 'డిస్ట్రిక్-51' బార్ అండ్ కిచెన్ రెస్టారెంట్‌లో పేలుడు సంభవించి ప్రమాదం జరిగింది. గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే ఇంత భారీ అగ్ని ప్రమాదం జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. కిచెన్‌లో సిలిండర్ పేలిందా? లేక గ్యాస్ పైపులైన్ వల్ల ఏదైనా ప్రమాదం జరిగిందా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పేలుడు తీవ్రతకు రెస్టారెంట్‌లోని ఇంటీరియర్ సీలింగ్ కుప్పకూలింది. భారీ ఇనుప ఫ్రేమ్‌లు సైతం విరిగి కింద పడ్డాయి. భవనం చుట్టూ ఉన్న అద్దాలు పగిలి వంద మీటర్ల మేర దూసుకెళ్లాయి. కిచెన్‌లో గోడలు కూలిపోవడంతో పాటు రెస్టారెంట్ లోపల భాగంలో వస్తువులకు మంటలు అంటుకొని పెద్ద ఎత్తున అగ్ని కీలలు ఎగిసిపడ్డాయి. అగ్నికీలల ధాటికి అద్దాల భవనం నాలుగు, ఐదు అంతస్తులతోపాటు మూడో అంతస్తు పాక్షికంగా దెబ్బతింది. ఎడమవైపు ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీకి చెందిన భవనంలో ఓ వైపు అద్దాలు ధ్వంసం కాగా, ఇద్దరు ఉద్యోగులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం వారిని ఆస్పత్రికి తరలించారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో చుట్టూ ఐటీ కంపెనీల భవనాల్లో పెద్దగా ఎవరూ లేకపోవడం, రోడ్లపై జనాసంచారం తక్కువగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదం సాయంత్రం జరిగి ఉంటే ప్రమాద తీవ్రత భారీగా ఉండేదని భావిస్తున్నారు. భవనం ముందు భాగంలో రోడ్డుపై, చుట్టు పక్కల కుప్పలుగా పడి ఉన్న అద్దాలను తొలగించేందుకు ప్రైవేట్ సిబ్బంది 3 గంటల పాటు శ్రమించారు. అగ్ని ప్రమాదంపై ఉదయం 6.12 నిమిషాలకు ఫైర్ స్టేషన్‌కు, 6.15 నిమిషాలకు కంట్రోల్ రూంకు సమాచారం అందింది. 10 నిమిషాల్లో అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది.. రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. నాలుగు ఫైర్ ఇంజన్లతోపాటు బ్రాంటో స్కై లిఫ్ట్ ఫైరింజన్ సాయంతో మంటలు అదుపులోకి తెచ్చినట్లు అధికారులు తెలిపారు. నాలుగో అంతస్తులో సీలింగ్ కుప్పకూలడంతో ఆ ప్రాంతానికి వెళ్లలేకపోయినట్లు జిల్లా ఫైర్ ఆఫీసర్ ఖాజా ఖరీముల్లా, మాదాపూర్ ఏడీఎఫ్ఓ గోవర్ధన్ తెలిపారు. అగ్ని ప్రమాదంపై సత్వ యాజమాన్యం రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుమారు రూ.10 కోట్ల మేర ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సత్వా ఎలిగ్జిర్ భవనంలో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు తీసుకున్నా.. ఇంత భారీ ప్రమాదం ఎలా జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెస్టారెంట్‌లో స్ప్రింక్లర్లు, ఫైర్ సేఫ్టీ వ్యవస్థ ఉన్నా గ్యాస్ లీకై ఎక్కువ వ్యాప్తి చెంది పేలుడు జరిగిందా, లేదా కిచెన్ స్టవ్‌పై ఏమైనా పెట్టి మరిచిపోవడంతో మంటలు చెలరేగాయా? అనే కోణంలో అధికారులు విశ్లేస్తున్నారు. ఉద్యోగులు, సందర్శకుల రక్షణకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన సేఫ్టీ ప్రొటోకాల్ పాటిస్తున్నామని సత్వా గ్రూపు అధికార ప్రతినిధి తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని, ప్రాణాపాయం కలగలేదన్నారు. అత్యవసర బృందాలు అందుబాటులో ఉండడం, అగ్నిమాపక శాఖ సిబ్బంది త్వరగా స్పందించడంతో వెంటనే మంటలను అదుపులోకి తెచ్చామన్నారు.

నగ్నంగా వీడియో కాల్

- డిజిటల్ అరెస్టులో.. సైబర్ కేటుగాడి హుకుం
- భయంతో ఫిర్యాదుకు బాధితురాలి వెనుకంజ
- మరో కేసు దర్యాప్తులో.. వెలుగులోకి తతంగం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరు చెప్పగానే భయపడ్డ ఓ బాధితురాలికి సైబర్ కేటుగాడు లైంగికంగా వేధించిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మరో కేసులో పోలీసుల దర్యాప్తులో ఈ విషయం బయటపడింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరాదికి చెందిన ఓ యువతి, హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగం చేస్తూ.. స్నేహితులతో కలిసి ఉంటోంది. కొంతకాలం క్రితం ఆ యువతికి సైబర్ కేటుగాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. డిజిటల్ అరెస్టు మోసాల్లో భాగంగా ఓ కేటుగాడు పోలీసు యూనిఫాంలో ఆ యువతికి వీడియోకాల్ చేసి, "మీ పేరిట వచ్చిన ఓ పార్సిల్‌లో డ్రగ్స్ వచ్చాయి" అని బెదిరించాడు. బాధితురాలి కుటుంబసభ్యుల వివరాలు, ఆమె జరిపే ఆన్‌లైన్ పేమెంట్ల చిట్టాను వాట్సా‌ప్‌లో పంపి.. ఎఫ్ఐఆర్ కాపీని చూపాడు. దాంతో ఆ యువతి భయపడిపోవడంతో.. నగ్నంగా మారాలంటూ వేధించాడు. కేటుగాడు చెప్పినట్లు చసినా.. వేధింపులు ఆగకపోవడంతో బాధితురాలు నిందితుల ఫోన్ ఎత్తడం మానేసింది. పోలీసులు ఇటీవల ఓ డిజిటల్ అరెస్టు కేసులో నిందితులను అరెస్టు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు ఫిర్యాదు ఇచ్చేందుకు వెనుకంజ వేస్తున్నట్లు తెలిసింది.

ఉప్పల్‌లో రజక ఆత్మగౌరవ భవన్‌ను నిర్మించండి

- సీఎంకు రజక సంఘాల సమన్వయ కమిటీ వినతి

తార్నాక, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్‌లోని భగాయాత్‌లో 3 ఎకరాల విస్తీర్ణంలో రజక ఆత్మగౌరవ భవన్‌ను నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రజక సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆధ్వర్యంలో సీఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కొన్నే సంపత్, దుబ్బాక రమేశ్ మాట్లాడుతూ.. రజకుల ఆత్మగౌరవం కోసం ఉప్పల్‌లోని భగాయాత్‌లో ఓ భవనం నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని, దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పిల్లల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

- 'అధికారమా నీకు ఇంతటి కాఠిన్యమా' ఆంధ్రజ్యోతి కథనంపై సంక్షేమాధికారి స్పందన
- అందులోని విషయాలన్నీ అవాస్తవాలంటూ ఆరోపణ
- పిల్లల మానసిక స్థితిపై మాత్రం మౌనం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతిలో ఈ నెల 13న 'అధికారమా నీకు ఇంతటి కాఠిన్యమా?' పేరిట వచ్చిన కథనం పై అధికారులు ఎట్టకేలకు స్పందించారు. చట్టబద్ధంగా దత్తత తీసుకోలేదన్న కారణంగా, ఆరునెలల కిందట 13మంది పిల్లలను పెంచుతున్న అమ్మానాన్నల నుంచి తెలంగాణ స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవడం గురించి ఆ కథనంలో ఆంధ్రజ్యోతి ప్రస్తావించింది. తల్లిదండ్రుల ఆవేదనను, పిల్లల మానసిక స్థితిని అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొంది. దీనిపై స్పందిస్తూ, ఆ కథనంలోని అంశాలు పూర్తిగా నిరాధారమైనవి, అవాస్తవమైనవని పేర్కొంటూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సంక్షేమాధికారి పేరుతో శనివారం జవాబు పంపారు. శిశువిహార్‌లో పిల్లలకు రోజూ పెట్టే ఆహార పట్టిక వివరాలతో పాటు అక్కడున్న వైద్యసేవలు తదితర సౌకర్యాల గురించి అందులో ప్రస్తావించారు. తమ స్వాధీనంలో ఉన్న పిల్లల సంరక్షణలో ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు కూడా వెల్లడించారు. అయితే ఆరునెలలుగా తమను పెంచిన తల్లిదండ్రులకు దూరంగా ఉన్న పిల్లల ప్రస్తుత మానసిక పరిస్థితి గురించి మాత్రం కనీస ప్రస్తావన చేయలేదు. కడుపున పుట్టకున్నా, ఆ పిల్లలమీదే పంచప్రాణాలు పెట్టుకొన్న పెంచిన తల్లిదండ్రుల ఆవేదనను.. ఊహ తెలిసిన నాటి నుంచి తాము తల్లితండ్రులుగా భావించిన వారికి దూరంగా శిశువిహార్‌లో ఉంటున్న పిల్లల మానసిక, శారీరక ఆరోగ్య స్థితులకు అధికారులు విలువ ఇవ్వడంలేదన్నది అంతిమంగా ఆంధ్రజ్యోతి కథనం ప్రధాన ఉద్దేశం. దీనిపై వివరణ ఇవ్వడం మాని, కథనంలోని అంశాలన్నీ అవాస్తవాలంటూ మరొకసారి అధికారులు తమ కాఠిన్యాన్ని ప్రదర్శించారు.

ఐపీఎస్ సంజయ్ ప్రాసిక్యూషన్

- ఏసీబీకి అనుమతించిన ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి, సీఐడీ మాజీ చీఫ్ ఎన్.సంజయ్ ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న ఆయన అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సీఐడీ చీఫ్‌గా, ఫైర్ సర్వీసెస్ డీజీగా విధులు నిర్వహించిన సమయంలో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయి. విజిలెన్స్ అధికారులు లోతైన విచారణ జరిపి అక్రమాలు జరిగినట్టు గుర్తించారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇటీవల ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. అఖిల భారత సర్వీసుల క్రమశిక్షణ చట్టం 1969లోని సెక్షన్ 3(1) కింద చర్యలు తీసుకుంది. అక్రమాలపై విచారణ చేయాలని ఏసీబీ అధికారులను ఆదేశించింది. ఏసీబీ అధికారులు ఆయనను ప్రాసిక్యూషన్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అవినీతి నిరోధక చట్టం 17ఎ ప్రకారం ఒక ప్రభుత్వ అధికారిపై విచారణ జరపాలంటే ఆయనను తొలగించే అధికారం ఉన్న అధికారి అనుమతి తప్పసరిగా తీసుకోవాలి. దాంతో ఏసీబీ అధికారులు ప్రభుత్వ అనుమతి కోరారు. సంజయ్‌పై కేసుల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వం ఏసీబీ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అనుమతి లేకుండా విజయవాడ దాటి వెళ్లకూడదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఆయన్ను అరెస్టు చేసే అవకాశం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

శ్రీతేజ చికిత్సకు అవసరమైతే
అమెరికా వైద్యులనూ రప్పించండి

వైద్యులకు మంత్రి కోమటిరెడ్డి సూచన.. బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా

- శ్రీతేజ్ తండ్రికి రూ.25లక్షల చెక్ అందజేత
- చికిత్సకయ్యే ఖర్చంతా భరిస్తామని హామీ
- ఇక పై సందేశాత్మక చిత్రాలకే బెనిఫిట్ షో అనుమతులపై ఆలోచిస్తామని మంత్రి వెల్లడి
- బాలుడి ఆరోగ్యం స్థిరంగా ఉంది: వైద్యులు



శ్రీతేజ్ తండ్రి భాస్కర్‌కు ప్రతీక్ ఫౌండేషన్ తరఫున రూ. 25 లక్షల చెక్కును అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ సిటీ/రాంగోపాల్‌పేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద జరిగిన తోపులాటలో గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరామర్శించారు. అతడి చెయ్యి పట్టుకొని, పిలిచి, భావోద్వేగానికి గురయ్యారు. బాలుడి తండ్రి భాస్కర్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. భాస్కర్ ఆరోగ్య పరిస్థితి గురించి కూడా మంత్రి అడిగి తెలుసుకున్నారు. "తండ్రిగా ఇద్దరు పిల్లల్ని కాపాడాల్సిన బాధ్యత మీ మీద ఉంది. ఆరోగ్యం జాగ్రత్త భాస్కర్, అధైర్యపడొద్దు.. ఏ అవసరం వచ్చినా నేనున్నాను" అంటూ ఆయనకు భరోసా ఇచ్చారు. ప్రతీక్ ఫౌండేషన్ నుంచి రూ.25 లక్షల చెక్కును ఆయనకు అందించారు. అలాగే.. శ్రీతేజ్ కోలుకునేందుకు ఎంత సమయం పడుతుందని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అవసరం అనుకుంటే అమెరికా నుంచైనా వైద్యులను రప్పించాలని.. మందులు తెప్పించాలని సూచించారు. శ్రీతేజ్ చికిత్సకయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుందని, ఒక్క రూపాయి కూడా బాలుడి తండ్రి భాస్కర్‌ను అడగొద్దని కిమ్స్ యాజమాన్యానికి స్పష్టం చేశారు. తన కాలేయాన్ని భర్తకు ఇచ్చి ప్రాణదానం చేసి రేవతి.. థియేటర్‌లో తొక్కిసలాటలో తనువు చాలించడం బాధకరమని మంత్రి ఆవేదన వెలిబుచ్చారు. ఏడాది క్రితమే ఆమె తన భర్తకు కాలేయదానం చేశారని.. ఆ చికిత్సకు అయిన ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇప్పించే ఏర్పాటు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

కోలుకునేందుకు సమయం..

శ్రీతేజ్ ఆహారం తీసుకునే పరిస్థితి లేదని వైద్యులు తెలిపారని.. అతడి ఆరోగ్యం కుదుటపడేందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉందని వైద్యులు వెల్లడించారని, కోలుకోవడానికి ఇంకా సంవత్సరమైనా... రెండు సంవత్సరాలైనా పట్టవచ్చన్నారని మంత్రి చెప్పారు. ఆరోగ్యం మెరుగుపడినా మాటలు వస్తాయో... లేదో తెలియదని వైద్యులు చెప్తున్నారని.. ప్రస్తుతం శ్రీతేజ్ గొంతులో పైప్ వేసి ఆహారం అందిస్తున్నారని, చాలా బలహీనంగా ఉన్నాడని, కదలికలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రేవతి భర్త భాస్కర్‌కు ధైర్యం ఇవ్వడానికి ఆస్పత్రికి వచ్చానని ఆయన చెప్పారు. తాను అధికారంలో ఉన్నా, లేకున్నా భాస్కర్ పిల్లల ఖర్చును ప్రతీక్ ఫౌండేషన్ తరఫున చూసుకునే ప్రయత్నం చేస్తానన్నారు. కాగా.. శ్రీతేజ్‌కు ఆక్సిజన్ సాయం లేకుండా చికిత్స అందిస్తున్నామని, అతడు శ్వాస తీసుకోగలుగుతున్నాడని, శుక్రవారం కంటే శనివారం అతడి ఆరోగ్యం మరింత మెరుగుపడిందని వైద్యులు తెలిపారు.

ఆ సినిమాలకే..

ఇకపై ఇకపై తెలంగాణలో బెనిఫిట్ షోలు ఉండవని.. దేశ భక్తి, తెలంగాణ చరిత్రకి సంబంధించిన సినిమాలు, సందేశాత్మక సినిమాలకు మాత్రమే బెనిఫిట్ షో గురించి ఆలోచిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటిరెడ్డి స్పష్టం చేశారు. సినిమా హీరోలు బాధ్యతతో మెలగాలని, నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. పోలీసులు పర్మిషన్ ఇవ్వకపోతే సినిమా వాళ్లు సినిమా ప్రమోషన్ చేయడానికి బయటకి వచ్చి ఓపెన్ టాప్ కార్లలో తిరగవద్దన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. "సినిమా ఇండస్ట్రీని ప్రోత్సహిస్తాం. పరిశ్రమగా గౌరవిస్తాం. అంతేతప్ప దురుసు చర్యలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించం" అని తేల్చిచెప్పారు.

మానవత్వం లేదా!?

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లారు. కేవలం సినిమా చూసి వెళ్లిపోతే అభ్యంతరం ఉండేది కాదు. కానీ, ఆర్టీసీ క్రాస్ రోడ్ నుంచే కారు రూఫ్ టాప్ ఓపెన్ చేసి రోడ్ షో చేసుకుంటూ వెళ్లారు. దీంతో, పక్కన ఉన్న అన్ని థియేటర్ల నుంచి అభిమానులు ఒక్కసారిగా థియేటర్ వైపు వచ్చారు. హీరో కారు థియేటర్ లోపలికి పంపేందుకు గేట్లు తెరిచారు. దాంతో ఆయన్ను చూసేందుకు అభిమానులంతా ఒక్కసారిగా లోపలికి తోసుకుంటూ వచ్చారు. వారిని నిలువరించేందుకు హీరో ప్రైవేటు సెక్యూరిటీ, బాడీ గార్డ్స్ గట్టిగా వెనక్కు నెట్టారు. అది తొక్కిసలాటకు దారి తీసింది. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో రేవతి చనిపోయారు. ఆమె కుమారుడికి ఆక్సిజన్ అందక బ్రెయిన్ డ్యామేజ్ అయింది. కోమాలోకి వెళ్లాడు. అంత తొక్కిసలాటలో కూడా ఆ తల్లి కొడుకు చేయి విడిచిపెట్టలేదు. కొడుకు చేయి పట్టుకుని ఆ తల్లి చనిపోయింది. హీరో థియేటర్ లోపల ఉండడంతో అక్కడ కూడా తొక్కిసలాట జరిగింది. ఈ విషయాన్ని సంధ్య థియేటర్ యాజమాన్యానికి చెప్పి, హీరోను అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు చెప్పారు. అయినా, వారు వినలేదు. సరికదా బాడీ గార్డ్‌లు పోలీసులను నిలువరించారు. పరిస్థితి చేజారే ప్రమాదం ఉందని గుర్తించి ఏసీపీ రంగంలోకి దిగారు. శాంతి భద్రతలు చేయి దాటే ప్రమాదం ఉందని, ఇప్పటికే ఒకరు చనిపోయారని, మరొకరు ఆస్పత్రి పాలయ్యారని హీరోకు ఏసీపీ వివరించారు. తక్షణమే థియేటర్ నుంచి వెళ్లిపోవాలని సూచించారు. అయినా.. సినిమా మొత్తం అయిపోయిన తర్వాతే వెళ్తానని అంటూ బయటకు వెళ్లడానికి హీరో ఒప్పుకోలేదని సిటీ కమిషనర్ చెప్పారు. దీంతో డీసీపీ వెళ్లి ఇక్కడి నుంచి కదలకపోతే అరెస్టు చేస్తామని హెచ్చరించి హీరోను కారు ఎక్కించారు. థియేటర్ నుంచి వెళ్లేటప్పుడు కూడా కార్ రూఫ్ టాప్ ఓపెన్ చేసి రోడ్ షో చేస్తూ వెళ్లారు" అని వివరించారు. ఈ నేపథ్యంలోనే హీరోపై, యాజమాన్యంపై పోలీసులు కేసు పెట్టారని, తర్వాత హీరో ఇంటికి వెళ్లినప్పుడు కూడా దురుసుగా ప్రవర్తించాడని, బాధ్యతారహితంగా సమాధానాలు ఇచ్చాడని, అందుకే పోలీసులు వారి విధి నిర్వహించారని వివరించారు.

కేటీఆర్‌ది పైశాచికత్వం

ఒకరి మృతికి కారణమైన వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళితే.. కొన్ని రాజకీయ పార్టీలు పైశాచికత్వం ప్రదర్శించాయని మాజీ మంత్రి కేటీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "రేవతి భర్త చిరుద్యోగి. నెలకు రూ.30 వేలే జీతం. అయినా.. తన కొడుకు ఆ హీరో అభిమాని అని తనయుడి కోసం ఒక్కో టికెట్ రూ.3 వేల చొప్పున రూ.12 వేలు పెట్టి కొన్నారు. హీరోపై అభిమానంతో అంత డబ్బు వెచ్చించారు. థియేటర్‌లో ఒక తల్లి చనిపోతే ఆ కుటుంబాన్ని, ఆ పిల్లవాడిని హీరో పరామర్శించలేదు. అలాంటి మానవత్వం లేని వాళ్లను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తే పదేళ్లు మంత్రులుగా పని చేసిన వాళ్లు కూడా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. తప్పు పట్టి ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూశారు. సోషల్ మీడియాలోనూ, యూట్యూబ్ చానెల్స్‌లోనూ ఎంతో నీచమైన భాష వాడారు" అని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమాలు చేశామని చెప్పుకొనే వాళ్లు, పదేళ్లు మంత్రిగా పనిజేసిన వ్యక్తులు సోషల్ మీడియాలో అడ్డగోలుగా పోస్టులు పెట్టారని పరోక్షంగా కేటీఆర్‌ను ఉద్దేశించి ధ్వజమెత్తారు. ఉద్యమ సమయంలో సినిమా షూటింగులు ఆపి.. వీళ్లంతా దాడులు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఈరోజు ఆ హీరో వాళ్లకు భగవత్‌స్వరూపుడు అయ్యాడని ఎద్దేవా చేశారు. హీరోను ఒక్కరోజు అరెస్టు చేయగానే హైకోర్టులో స్పెషల్ పిటిషన్, లంచ్ మోషన్ వేశారని, బెయిల్‌పై వచ్చేలా చేశారని వ్యాఖ్యానించారు. సినిమా పరిశ్రమను ప్రోత్సహించాలని భావించి తమ ప్రభుత్వం ప్రత్యేక షోలకు అనుమతి ఇచ్చిందని, ప్రాణాలు బలి తీసుకున్నా వాళ్లను ఏమీ అనొద్దు అంటే ఇదేం న్యాయమని సీఎం ప్రశ్నించారు. ఫిల్మ్ స్టార్స్, సూపర్ స్టార్స్, పొలిటికల్ స్టార్స్ హత్యలు చేసినా వాళ్లను విచారించవద్దని మీరు చట్టం చేస్తే తాము అమలు చేస్తామని ఎద్దేవా చేశారు. సంధ్య థియేటర్ ఘటనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన వారిపై బరాబర్ కేసులు పెట్టి విచారించాల్సిందేనని స్పష్టం చేశారు. తన తమ్ముడికే కేసుల నుంచి మినహాయింపు ఉండబోదన్నారు. "సినీ ప్రముఖులకు ఒక విషయం స్పష్టంగా చెబుతున్నా. అమానవీయ ఘటనలను ఈ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదు. సినిమాలు తీసుకోండి. వ్యాపారం చేసుకోండి. డబ్బులు సంపాదించుకోండి. ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు తీసుకోండి. షూటింగులకు సంబంధించి ప్రత్యేక అనుమతులు కూడా తీసుకోండి. ప్రజల ప్రాణాలు పోతుంటే మాత్రం మా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. నేను కుర్చీలో ఉన్నంత వరకూ ఇలాంటి ఘటనలను ఉపేక్షించను. ప్రాణాలు పోయే ఘటనలు జరిగితే ప్రత్యేక మినహాయింపులు ఉండవు. తెలంగాణ ప్రజల ప్రాణాలు కాపాడడమే నా బాధ్యత. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినీ ఈ ప్రభుత్వం వదిలి పెట్టదు" అని సీఎం రేవంత్ తేల్చి చెప్పారు. ఆ పిల్లాడి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు.



రూ.25 లక్షల ఆర్థికసాయం ప్రకటించిన సర్కారు

సంధ్య థియేటర్ ఘటనలో చనిపోయిన రేవతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.25 లక్షలు అందించనున్నట్లు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శాసనసభలో ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇక నుంచి సినిమా విడుదలకు ముందు రోజు ఎటువంటి బెనిఫిట్ షోలు ఉండబోవని తేల్చి చెప్పారు. టికెట్ల రేట్లు పెంచేందుకు కూడా అనుమతి ఇవ్వబోమన్నారు. బాలుడి కుటుంబానికి పరిహారం ఇస్తామన్న హామీని కూడా అల్లు అర్జున్ నిలబెట్టుకోలేదన్నారు. శ్రీతేజ్ వైద్య చికిత్స కోసం అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు.

గుడిహత్నూర్‌లో పోలీసులపై దాడి

- యువకుడు బాలికతో ఉండగా బంధించిన స్థానికులు
- అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన పోలీసులపై దాడి
- ఇచ్చోడ సీఐ, ఎస్ఐ సహా పలువురికి గాయాలు



గుడిహత్నూర్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్రంలో పోలీసులపై దాడి ఘటన కలకలం రేపింది. గుడిహత్నూర్ మండల కేంద్రంలో ఓ యువకుడు బాలికతో కలిసి ఉండగా స్థానికులు గదిలో బంధించారు. కూలీ పనులకు వెళ్లిన బాలిక తల్లిదండ్రులు ఇంట్లో తమ కుమార్తె లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బంధించిన యువకుడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఆ యువకుడిని తమకు అప్పగించాలని బాలిక తల్లిదండ్రులు, బంధువులు పోలీసులతో ఘర్షణకు దిగారు. ఇచ్చోడ సీఐ భీమేష్, గుడిహత్నూర్ ఎస్సై మహేందర్‌తో పాటు పలువురు పోలీసులపై వారు దాడి చేశారు. ఘటనలో సీఐతో పాటు పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. అంతటితో ఆగని బాలిక బంధువులు, స్థానికులు యువకుడి ఇంటికి నిప్పు పెట్టారు. చివరకు పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. గాయపడిన పోలీసులకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మరో వైపు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించారు. పరిస్థితిని ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, ఇచ్చోడ ఎస్సై తిరుపతి పరిశీలించారు.

టీజీవో విస్తృత స్థాయి కార్యవర్గం ఎన్నిక

హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు మరిన్ని సేవలు అందించేందుకు వీలుగా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) కేంద్ర కార్యవర్గంలో మరో 33 మందిని ఎన్నుకుంది. అధ్యక్షుడిగా ఏలూరి శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షులుగా జగన్మోహన్‌రావు, ఎస్.సహదేవ్, ఎం.రామకృష్ణ గౌడ్, దీపారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా బాగారి శ్యామ్, ప్రధానకార్యదర్శిగా ఏనుగుల సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కార్యవర్గం ఎన్నిక అనంతరం నాంపల్లిలోని కేంద్ర కార్యాలయంలో శనివారం అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీజీవో అధ్యక్షుడు ఏలూరి మాట్లాడుతూ, ఉద్యమాల రూపకల్పన, ఉద్యోగులకు సేవలు చేసే విషయంలో టీజీవో పాత్ర ఎనలేనిదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగులు నిబద్ధతతో పనిచేస్తున్నారని, ఉద్యోగుల మౌలిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. అనంతరం పెండింగ్ బిల్లులు యద్ధ ప్రాతిపదికన క్లియర్ చేయాలని, నాలుగు డీఏలు ఇవ్వాలని, ఆరోగ్య రక్షణ పథకం అమలు, వేతన సవరణ కమిటీ నివేదిక, స్థానికత ప్రాతిపదికన 317 జీవో అమలు, అన్ని శాఖల్లో పదోన్నతుల కమిటీల ఏర్పాటు, ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి వారి సొంత ప్రాంతాలకు బదిలీ చేయడం వంటి 8 తీర్మానాలను ప్రతిపాదించారు.

23న సంగీత ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన

గురుకులాల్లో సంగీత ఉపాధ్యాయుల ఖాళీల భర్తీలో భాగంగా ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు ట్రిబ్ చైర్మన్ బడుగు సైదులు శనివారం తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు మాసబ్ ట్యాంకులో ఉన్న డీఎస్ఎస్ భవన్‌లో ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. తదుపరి వివరాలకు https://treirb.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

27 నుంచి ఏఈల ధ్రువపత్రాల పరిశీలన

హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విభాగంలో ఉన్న వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీలో భాగంగా.. అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ అధికారుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ శనివారం వెల్లడించారు. ఈ పరిశీలన 27న ఉదయం 10:30 గంటలకు ప్రారంభమై డిసెంబరు 31వ తేదీ వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పరిశీలన జరుగుతుందని చెప్పారు. ఈ షెడ్యూల్‌లో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాని వారికి జనవరి 2న వెరిఫికేషన్‌కు మరో అవకాశం ఉంటుందని చెప్పారు. అభ్యర్థుల వివరాలు http://www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో ఉన్నాయని, ఇందులోని చెక్‌లిస్ట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వెరిఫికేషన్‌కు హాజరుకావాలని అభ్యర్థులకు నికోలస్ సూచించారు.

నాపై తప్పుడు ఆరోపణలు!

(మొదటిపేజీ తరువాయి)



ఈ ప్రమాదం జరగడం బాధాకరం. ఈ విషయంలో నాకంటే బాధపడేవాడుండడు. నేను గంటగంటకూ బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుంటున్నాను. మంచి విషయం ఏంటంటే తను కదులుతున్నాడు.. కొంచెం కొంచెం కోలుకుంటున్నాడని తెలిసింది. ఇప్పుడు ఉన్న పరిస్థితిలో ఇది ఊరటనిచ్చే విషయం" అని పేర్కొన్నారు. అయితే, ఈ విషయంలో తనపై కొన్ని తప్పుడు ఆరోపణలు, అవాస్తవాలు ప్రచారం అవుతున్నందునే పత్రికా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బహుశా కమ్యూనికేషన్ లోపం వల్లే తనపై ఈ తప్పుడు ప్రచారం జరుగుతుండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. "ఈ ప్రమాదం విషయంలో నన్ను పూర్తిగా అపార్థం చేసుకున్నారు. నేను ఎవర్నీ నిందించడం లేదు. ఏ డిపార్టుమెంటునీ, ప్రత్యేకించి ఏ రాజకీయ నాయకుడిని, ప్రభుత్వాన్ని అనడం లేదు. నిజానికి మాకు సినిమా విషయంలో ప్రభుత్వం ఎంతో సాయం చేసింది. ప్రత్యేక టికెట్ రేట్ మంజూరు చేసింది. ముఖ్యంగా ప్రభుత్వం విషయంలో చాలా సంతృప్తితో ఉన్నాను. ఇది ఎవ్వరినీ ఉద్దేశించి కాదు. నాపై జరుగుతున్న ప్రచారం.. క్యారెక్టర్ ఎసాసినేషన్ (వ్యక్తిత్వ హననం) గురించి మాత్రమే నేను స్పష్టతనివ్వాలనుకుంటున్నాను" అని స్పష్టం చేశారు. "నన్ను మీరంతా 20 ఏళ్లుగా చూస్తున్నారు. నేను ఎప్పుడైనా ఇలా నిర్లక్ష్యంగా ఉన్నానా? ప్రీమియర్ రోజు ఈ ఘటన జరిగాక సినిమా ప్రమోషన్స్ కోసం హాజరు కాలేకపోయా. ప్రమోషనల్ ఈవెంట్స్ అన్నింటినీ రద్దు చేసుకున్నా. దాదాపు 15 రోజుల నుంచి ఎక్కడికీ పోలేదు. ఇంట్లోనే విచారంగా ఉండిపోయాను. నేను మూడేళ్లు కష్టపడి చేసిన ఈ సినిమాను ఇప్పటివరకూ థియేటర్‌లో చూడలేదు" అని ఆవేదన వెలిబుచ్చారు.

ఎప్పుడూ ఇలా జరగలేదు..

ఈ ప్రమాదం విషయంలో తన తప్పేమీ ప్రత్యక్షంగా లేదని సర్దిచెప్పుకొంటున్నానని అల్లు అర్జున్ పేర్కొన్నారు. "ఇటువంటి సమయంలో నేను ఇలా అన్నాను.. అలా అన్నాను.. కాళ్లూచేతులూ విరిగిపోయినా ఫర్లేదన్నానంటూ నా వ్యక్తిత్వాన్ని జాతీయ మీడియా ముందు తప్పుగా ప్రచారం చేస్తున్నారు. దాదాపు 20 ఏళ్లకుపైగా నా సినిమాలతో పాటు ప్రతి సినిమాకూ నేను ఈ థియేటర్‌కే వెళ్లేవాణ్ని. ఎప్పుడూ ఏ ప్రమాదం జరగలేదు. ఈ సినిమా నా మూడేళ్ల కష్టం. అందుకే థియేటర్లో అభిమానులతో చూడాలనుకున్నాను. నేను నిర్లక్ష్యంతో థియేటర్‌కు వెళ్లానని.. పర్మిషన్ లేకుండా వెళ్లాలనేది తప్పుడు సమాచారం. థియేటర్ వారు పర్మిషన్ తీసుకుని ఉంటారనే అక్కడికి వెళ్లాం. అక్కడికి వెళ్లాక పోలీసులు దారి క్లియర్ చేస్తున్నారు. దాంతో పర్మిషన్ ఉందనే ముందుకు వెళ్లాము. ఒకవేళ పర్మిషన్ లేకుంటే పోలీసులు ముందస్తుగా చెప్పేవారు అనే ఆలోచనతో మేం ఉన్నాం. నాపై ఆరోపణలు వచ్చినట్లు నేను అక్కడ ఎటువంటి రోడ్ షో.. ఊరేగింపు చేయలేదు. చేతులు కూడా ఎందుకు ఊపానంటే.. కొద్ది దూరం వెళ్లాక అక్కడ ట్రాఫిక్ బ్లాక్ అయిపోయింది. కారులో ఉన్న నేను బయటకి రాకుంటే అభిమానులు బాధ పడతారని బయటకి వచ్చి చేతులు ఊపా. ఒక్కసారి అయినా వారికి కనిపించి 'థాంక్యూ' చెప్పడానికి అలా చేయాల్సి వచ్చింది. లేదంటే.. కారులోంచి బయటకు రాకుండా దాక్కున్నానని వారు నన్ను తప్పుగా అర్థం చేసుకుంటారు. చేతులు ఊపితే అయినా ముందుకు వెళ్లడానికి దారి ఇస్తారని అలా చేశాను. నేనే కాదు, ప్రతీ ఒక్క లీడర్, సెలబ్రిటీ చేసే పనే అది" అని వివరణ ఇచ్చారు. థియేటర్లోకి వెళ్లాక కూడా పోలీసులు తనను సంప్రదించలేదని.. ఏం చెప్పలేదని.. సినిమా చూస్తుండగా థియేటర్ సిబ్బంది వచ్చి 'బయట ప్రజలను అదుపుచేయలేని స్థితి, దయచేసి వెళ్లిపోండి' అని చెప్పారని.. దీంతో తాను బయటకు వచ్చేశానని స్పష్టం చేశారు. "ఆ తర్వాతి రోజే నాకు ఓ మహిళ చనిపోయారని.. బాలుడికి పరిస్థితి విషమంగా ఉందని తెలిసి షాక్ అయ్యా" అని చెప్పారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే బన్నీవాసుకు ఫోన్ చేసి.. హాస్పిటల్‌కు వెళ్లాలని సూచించినట్లు తెలిపారు. తాను థియేటర్‌కు వస్తానంటే వాసు వద్దన్నారని.. అయినా వినకుండా ఆస్పత్రికి వెళ్దామనుకుంటే తన లీగల్ టీమ్ వారించిందని వెల్లడించారు. ఆ పరిస్థితిలో ఏమి చేయాలో తోచకే.. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని వీడియో చేసినట్లు చెప్పారు. "నాకు విషయం తెలిసినా నేను థియేటర్లోనే ఉన్నానని అంటున్నారు. అలా నిజంగా, తెలిసి ఉంటే, ఆ క్షణమే థియేటర్ నుంచి నా భార్య, పిల్లలతో బయటకు వచ్చేసేవాణ్ని. అభిమానుల విషయంలో నేను ఎప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుంటానని అందరికీ తెలిసిందే. ఎన్నోసార్లు నేరుగా అభిమానులను స్వయంగా వెళ్లి కలిశాను. కష్టాల్లో ఉన్న చిరంజీవి, పవన్‌కల్యాణ్ అభిమానుల్ని కలిసేవాణ్ని. అలాంటిది నా అభిమాని కుటుంబానికి ఇలా జరిగితే ఎందుకు పట్టించుకోను. అదీ నా సినిమా విషయంలో ఓ కుటుంబానికి ఇంత జరిగితే నేను వెళ్లి ఎందుకు కలవను?" అని ప్రశ్నించారు.

పరిస్థితులు చేతులు కట్టేశాయి..

బాలుడి విషయంలో తాను స్పందించలేదని అంటున్నారని.. కానీ, పరిస్థితులు, లీగల్ విషయాలే తన చేతులను కట్టి పడేశాయని వాపోయారు. తాను వెళ్లకున్నా.. తన తండ్రి అరవింద్‌ను, దర్శకుడు సుకుమార్‌ను, లీగల్ టీమ్‌ను పంపి అక్కడి విషయాలు తెలుసుకోవాలని ప్రయత్నించానని చెప్పారు. మానసికంగా తాను చాలా దృఢంగా ఉంటానని.. కానీ ఇప్పుడు తనపై జరుగుతున్న ప్రచారం ఎంతో బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "నేను అసలు సినిమాలు చేసేదే తెలుగువారు గర్వించేలా మంచి పేరు, గుర్తింపు తెద్దామని. అలాంటిది మనల్ని మనం కిందికి లాక్కోవాలనుకోకూడదు. నేను శ్రీతేజ్ విషయంలో చాలా నిర్లక్ష్యంగా ఉన్నానని అంటున్నారు. నిరంతరం శ్రీతేజ్ ఆరోగ్యం గురించి.. తన బాగోగుల గురించి నేను దర్శకుడు సుకుమార్‌తో చర్చిస్తూనే ఉన్నా. ఆ బాలుడి విషయంలో చేయాల్సింది చేసి చేతులు దులిపేసుకోకుండా.. నేను, సుకుమార్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు వై.రవి శంకర్, నవీన్ యెర్నేని అంతా కలసి బాలుడి కోసం ఓ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఏర్పాటు చేద్దామని.. ఫిజియోథెరపిస్టును పెట్టిద్దామని అనుకున్నాం. అయినా నేను కేర్ తీసుకోవడం లేదు అంటుంటే బాధగా ఉండదా? నాకు శ్రీతేజ్ వయసున్న అబ్బాయి ఉన్నాడు. నేను ఎందుకు ఆ అబ్బాయి విషయంలో ఫీల్ అవ్వను?" అని అల్లు అర్జున్ ప్రశ్నించారు. శ్రీతేజ్ విషయంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటానని.. వారి కుటుంబానికి అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. అనంతరం, ఆయన తండ్రి అల్లుఅరవింద్ మాట్లాడారు. "సినిమా ఇంతటి విజయం సాధించినా.. ఈ దురదృష్టకర సంఘటన వల్ల మా అబ్బాయి ఇంట్లోనే కూర్చుండిపోయాడు. తన అభిమానుల కుటుంబానికి ఇలా జరిగినందుకు అర్జున్ తట్టుకోలేకపోతున్నాడు. 22ఏళ్లు కష్టపడి తను ఈ పేరు సంపాదించుకున్నాడు. మూడు తరాలుగా మమ్మల్ని చూస్తున్నారు. మేం ఎటువంటి వాళ్లమో మీకు తెలుసు. ఒకవేళ తప్పుంటే మీ నుంచి తప్పించుకోలేము. అటువంటిది ఇలాంటి తప్పుడు ప్రచారం జరుగుతున్నందుకే ఈ ప్రెస్ మీట్ పెట్టి వివరణ ఇవ్వాలనుకున్నాం" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.శ్రీతేజ్‌కు అందివ్వాల్సిన సహాయం గురించి అర్జున్‌తో, టీమ్, 'పుష్ప 2 చిత్ర నిర్మాతలతో చర్చించి త్వరలోనే అన్ని విషయాలూ చెబుతానని ఆయన పేర్కొన్నారు.

ఐఐఎం-బీ డైరెక్టర్,ఏడుగురు ప్రొఫెసర్లపై అట్రాసిటీ కేసు

ఫిర్యాదు చేసిన దళిత అసోసియేట్ ప్రొఫెసర్

ఆరోపణలను ఖండించిన యాజమాన్యం

బెంగళూరు, డిసెంబరు 21: బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం-బీ) డైరెక్టర్ సహా ఏడుగురు ప్రొఫెసర్లపై అట్రాసిటీ కేసు నమోదయినట్లు శనివారం పోలీసులు తెలిపారు. తనను కులపరంగా వివక్ష చూపుతున్నారంటూ శుక్రవారం డాక్టర్ గోపాల్‌దాస్ అనే దళిత అసోసియేట్ ప్రొఫెసర్ చేసిన ఫిర్యాదుతో ఈ కేసు పెట్టారు. డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ చేసిన దర్యాప్తు ఆధారంగా సాంఘిక సంక్షేమ శాఖ చేసిన సూచనల మేరకు ఆ 8 మందిపై ఎస్సీ/ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. తనను మానసికంగా వేధిస్తున్నారని, సమాన అవకాశాలు కల్పించడం లేదని ఆయన ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలను ఐఐఎం-బీ ఖండించింది. ఆయన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు దరఖాస్తు చేసినప్పటికీ ప్రతిభను గుర్తించి అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమించినట్లు తెలిపింది. నిజానికి డాక్టర్ గోపాల్‌దాస్ తమ పట్ల వివక్ష చూపుతున్నారని కొందరు పరిశోధక విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో అంతర్గత విచారణ జరిగిందని తెలిపింది. వారి ఆరోపణలు నిజమేనని తేలిందని గుర్తు చేసింది. ఈ కేసుపై చట్టపరంగా ముందుకు వెళ్లనున్నట్లు పేర్కొంది. ఈ కేసులో తమకు బెయిల్ లభించిందని సంబంధిత ప్రొఫెసర్లు చెప్పగా, అందుకు సంబంధించిన పత్రాలేవీ తమకు అందలేదని పోలీసులు తెలిపారు.

రిజిస్ట్రేషన్ల శాఖలో.. 'గండిపేట' రహస్యం

నాలుగు నెలల్లో.. ముగ్గురు సబ్-రిజిస్ట్రార్ల బదిలీ.. ఆన్‌డ్యూటీ పేరుతో స్థానచలనాలు

- గతంలో డీఐజీ స్థాయిలో ఉత్తర్వులు
- ఇప్పుడు నేరుగా సర్కారు నుంచే బదిలీలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గండిపేట రిజిస్ట్రేషన్ల కార్యాలయంలో సబ్-రిజిస్ట్రార్‌ల పరిస్థితి 'ఆయారాం.. గయారాం' అన్నట్లుగా తయారైంది. ఇక్కడకు బదిలీపై వస్తున్న సబ్-రిజిస్ట్రార్లెవ్వరూ పట్టుమని రెండు నెలలు కూడా పనిచేయడం లేదు. గడిచిన నాలుగు నెలల కాలంలో ఏకంగా ముగ్గురు సబ్-రిజిస్ట్రార్లు బదిలీ కావడంతో.. ఇప్పుడు రిజిస్ట్రేషన్ల శాఖలో గండిపేట కార్యాలయం చర్చనీయాంశంగా మారింది.

కారణాలే తెలియదు..!

సాధారణంగా ప్రభుత్వ అధికారుల బదిలీలకు ఒక లెక్క ఉంటుంది. అయితే దీర్ఘకాలం ఒకే చోట పనిచేయకూడదనే నిబంధనలు.. లేదంటే ఏవైనా ఆరోపణలే ప్రధాన కారణాలు. గండిపేట సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం విషయంలో మాత్రం ఇవేమీ కారణాలుగా కనిపించడం లేదు. నిజానికి ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త జోనల్ వ్యవస్థ(జీవో 317) ఏడాది కాలంగా ఉల్లంఘనలకు గురవుతోంది. గండిపేట విషయంలో ఈ వ్యవహారం స్పష్టంగా కనిపిస్తోంది. సబ్-రిజిస్ట్రార్ పోస్టు అనేది జోనల్ పరిధిలో ఉంటుంది. అయితే.. గత ఏడాది రాజన్న-సిరిసిల్ల జోన్‌కు చెందిన సబ్-రిజిస్ట్రార్‌ను ఏకంగా చార్మినార్ జోన్‌లోని గండిపేటకు బదిలీ చేశారు. బదిలీలపై నిషేధం ఉన్నా.. జోన్ పరిధిని దాటించి, ఒక గ్రేడ్-2 సబ్-రిజిస్ట్రార్‌ను బదిలీ చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఇప్పుడు ఏకంగా గండిపేటలో సబ్-రిజిస్ట్రార్లను ఎందుకు బదిలీ చేస్తున్నారు? కారణాలేమిటి? అనేది తెలియరావడం లేదనే చర్చ రిజిస్ట్రేషన్ల శాఖలో జోరందుకుంది. ఆన్‌డ్యూటీల పేరుతో, సాధారణ బదిలీల పేరుతో యథేచ్ఛగా స్థానచలనాలు చోటుచేసుకుంటున్నాయి. ఆగస్టు నెలలో సాధారణ బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేయడంతో.. ఇక్కడి సబ్-రిజిస్ట్రార్‌ను జహీరాబాద్‌కు.. కుత్బుల్లాపూర్ ఎస్ఆర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఆ తర్వాత బదిలీలపై నిషేధం ఉన్నా.. అక్టోబరు 15న మరోమారు బదిలీ జరిగింది. ఈ సారి ఏకంగా కాళేశ్వరం జోన్‌లోని రామగుండం సబ్-రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వ్యక్తిని.. ఆన్‌డ్యూటీ కింద ఇక్కడ నియమించారు. ఆయన వచ్చి రెండు నెలలు గడవక ముందే.. ఈ నెల 12న మహబూబ్‌నగర్‌లో పనిచేస్తున్న వ్యక్తికి ఇక్కడ పోస్టింగ్ ఇస్తూ.. ఏకంగా ప్రభుత్వ కార్యదర్శి ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం..! అయితే.. ఉన్నపళంగా సబ్-రిజిస్ట్రార్లను ఎందుకు బదిలీ చేస్తున్నారనే కారణాలు మాత్రం రిజిస్ట్రేషన్ల శాఖలో 'రహస్యం'గానే ఉన్నాయి.

డీఐజీ ఉత్తర్వులు కాకుండా..

వాస్తవానికి రిజిస్ట్రేషన్ల శాఖలో సబ్-రిజిస్ట్రార్ స్థాయి అధికారుల బదిలీ లేదా డిప్యూటేషన్ లేదా ఆన్‌డ్యూటీ ఉత్తర్వులు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డీఐజీ) స్థాయిలో విడుదలవుతాయి. కానీ, గండిపేట విషయంలో మాత్రం రెవెన్యూ శాఖ కార్యదర్శి స్థాయిలో ఉత్తర్వులు వస్తుండడంపై రిజిస్ట్రేషన్ల శాఖ ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయంపై ప్రభావం?

గండిపేట సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం రెవెన్యూ శాఖ ఆదాయంలో కీలకమైనదని రిజిస్ట్రేషన్ల శాఖ ఉద్యోగులు చెబుతున్నారు. ముఖ్యంగా.. ఇక్కడ జీవో-111ను ఎత్తివేశాక భూలావాదేవీలు ఊపందుకున్నాయి. ఐటీ కారిడార్‌కు అత్యంత సమీపంలో ఉండడం.. కేంద్రీయ, రాష్ట్రీయ సంస్థలు, విద్యాలయాలకు నెలవు కావడం, ఇంజనీరింగ్ కాలేజీలకు కేరాఫ్‌గా ఉండడంతో ఈ ప్రాంతంలో భూములకు డిమాండ్ ఎక్కువగా ఉంది. పట్టణాల్లోనే కాకుండా, గ్రామాల్లోనూ భూముల విలువ రూ.కోట్లలో ఉంటోంది. 111 జీవోను ఎత్తివేశాక ఇక్కడ రియల్‌ఎస్టేట్ ఊపందుకోగా.. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం మాత్రం బదిలీలతో చర్చనీయాంశమవుతోంది.



సభా పర్వం

రాష్ట్రాన్ని అమ్మేశారు!

ఔటర్.. కోకాపేట భూములే కాదు.. ఎన్నికల ముందు వైన్ షాపులు కూడా

- పదేళ్ల పాలన.. వందేళ్ల విధ్వంసం..
- ముఖం చెల్లకే కేసీఆర్ సభకు రావడం లేదు
- బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ నిప్పులు



హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): "ఆరు గ్యారెంటీల్లో ఏదైనా ఒక గ్యారెంటీని అమలు చేయడం ఆలస్యం అవుతోందంటే దానికి కారణం ఆ పాపాత్ములే! ఈ పాపాల భైరవులు రాష్ట్రాన్ని అమ్మేశారు. కోకాపేటలో భూములు.. ఔటర్ రింగు రోడ్డు, హైదరాబాద్ భూములు, హైటెక్ సిటీ సహా ప్రతిదీ అమ్మేశారు. వైన్ షాపులను ఆరు నెలలు ముందుగానే అమ్మేశారు. బ్యాంకుల నుంచి అప్పు తెచ్చుకునేటప్పుడు మిత్తిని కాస్త తగ్గించాలని అడుగుతుంటాం. కానీ.. వీళ్లు 11.50 శాతం మిత్తితో అప్పులు తెచ్చారు. ఇలాంటి వారిని ఉరి తీసినా తప్పు లేదు" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జైకా, ప్రపంచ బ్యాంకు 2-4 శాతం మిత్తితోనే అప్పులు ఇస్తాయని, కానీ, వాళ్ల హయాములో 11.5 శాతం వడ్డీతో అప్పులు తెచ్చారని, ఇలాంటి ఆర్థిక నేరాలకు ఇతర దేశాల్లో పాల్పడి ఉంటే.. ఉరి తీసి ఉండేవారని ధ్వజమెత్తారు. సోనియాగాంధీ ఇచ్చిన రాష్ట్రంలో రెండుసార్లు ముఖ్యమంత్రిగా పదేళ్లు పాలించి, వందేళ్ల విధ్వంసం చేసి, వెయ్యి తరాలకు సరిపోయేంత ఆస్తులను కొల్లగొట్టారని ఆరోపించారు. అసెంబ్లీలో రైతు భరోసా పథకంపై శనివారం జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌పై దాదాపు గంటన్నరపాటు నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ నాయకులు దొంగలకు సద్దులు మోసెటోళ్లని, వారిని తెలంగాణ సమాజం క్షమించదని వ్యాఖ్యానించారు.

రాళ్లు రప్పలకు రూ.22,606 కోట్లు

పంటకు పెట్టుబడి సాయం ఇచ్చేందుకు రైతు బంధు పథకం ప్రవేశపెట్టామని గత ప్రభుత్వం ఘనంగా చెప్పుకొందని, కానీ, పదేళ్ల కాలంలో రూ.22,606 కోట్లను రాళ్లు రప్పలు, రోడ్లు, రియల్ వెంచర్లకే చెల్లించారని సీఎం రేవంత్ రెడ్డి తప్పుబట్టారు. వ్యవసాయం చేసుకునే వారికి నగదు రూపంలో పెట్టుబడిగా సహాయం చేయాలన్నది జీవో సారాంశమని, కానీ, పథకం అమల్లో బాధ్యతారహితంగా వ్యవహరించారని మండిపడ్డారు. "మేం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు కింద రూ.7,625 కోట్లను చెల్లించాం. ఇదే పథకం కింద గత పదేళ్లలో రూ.72,816 కోట్లు చెల్లించామని బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పుకొంది. కానీ.. ఇందులో సాగులో లేని భూములకే రూ.22,606 కోట్లు చెల్లించారు. రాజీవ్ రహదారి కింద.. శ్రీశైలం రహదారిలో పోయిన భూములకూ ఇచ్చారు. టీఆర్ఎస్ నాయకులు, పోడు భూములపై నకిలీ పట్టాలు, దొంగ పాస్ బుక్‌లు తయారు చేసిన వారికి ఇచ్చారు. హైదరాబాద్ చుట్టూ సాగు చేయని భూములకు ఇచ్చారు. ఇప్పుడు కూడా రాళ్లు రప్పలు, గుట్టలకు రైతు భరోసా ఇద్దామా?" అని ప్రశ్నించారు. "80 వేల పుస్తకాలు చదివిన అనుభవంతో రైతు బంధును తయారు చేసిన ప్రతిపక్ష నాయకుడు (కేసీఆర్) సభకు వచ్చి రైతు భరోసాపై సూచనలు ఇస్తాడని అనుకున్నాం. కానీ, భూస్వాములు, జమీందారులు, జాగీర్దారులు, రియల్ ఎస్టేట్ భూములకు రైతు భరోసా ఇవ్వాలని వాళ్లు (బీఆర్ఎస్) అంటున్నారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలని అంటున్నారు. మిమ్మల్ని ఆదర్శంగా తీసుకుంటే మేం ఇక్కడ ఎందుకు కూర్చుంటాం? అక్కడ కూర్చుండేవాళ్లం. బయటకు వెళ్లిపోయేవాళ్లం. మీరు కాదు.. రైతులు మాకు ఆదర్శం." అని చెప్పారు.

రైతు ఆత్మహత్యల్లో రెండో స్థానం

రైతుబంధు పథకాన్ని అమలు చేయడం వల్ల రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు తగ్గాయని వాళ్లు చెబుతున్నారని, కానీ, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ఇచ్చిన నివేదిక ప్రకారం రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉందని సీఎం రేవంత్ వెల్లడించారు. "బీఆర్ఎస్‌వి నోరు తెరిస్తే అబద్ధాలు. అబద్ధాల సంఘం అధ్యక్షుడు (కేసీఆర్) రాలేదు. ఉపాధ్యక్షుడు (కేటీఆర్) వచ్చి ఇంకా అబద్ధాలు చెబుతున్నారు. రైతు ఆత్మహత్యలు ఆంధ్రప్రదేశ్‌లో 2014లో 160, 2015లో 516, 2016లో 239 జరిగాయి. మూడేళ్లలో అక్కడ మొత్తం ఆత్మహత్యలు వెయ్యిలోపే. మహారాష్ట్రలో 2014లో 2,568, 2015లో 3030, 2016లో 2550 ఆత్మహత్యలు చోటు చేసుకున్నాయి. దేశంలో ఆ రాష్ట్రానిదే ప్రథమ స్థానం. 80 వేల పుస్తకాలు చదివిన అపర మేధావి నాయకత్వంలోని తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. 2014లో 898, 2015లో 1,358, 2016లో 632 రైతు ఆత్మహత్యలు జరిగాయి. అంటే.. మూడేళ్లలో దాదాపు మూడు వేలు. దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. అయినా... వాళ్లు ఆత్మహత్యలు తగ్గించామంటున్నారు. ఏంటి మీరు తగ్గించింది మీ బొంద" అని మండిపడ్డారు.

వాళ్ల మాఫీ.. గుండు సున్నా

అధికారంలోకి రాగానే లక్షలోపు రుణ మాఫీ చేస్తామని అన్నారని, దానిని కాస్తా ఐదేళ్లపాటు కొనసాగించారని సీఎం రేవంత్ తప్పుబట్టారు. "ఐదేళ్లపాటు ఆపసోపాలు పడి వాళ్లు రూ.16,143 కోట్లు రుణ మాఫీ చేశారు. అయినా... అది మిత్తికే సరిపోయింది. రైతుల అసలు అప్పు అలాగే ఉండిపోయింది. మళ్లీ 2018లో ఇచ్చిన హామీ మేరకు ఔటర్‌ను అమ్మి తెచ్చిన సొమ్ముతో రూ.11,909.31 కోట్లను మాఫీ చేశారు. ఇందులో మిత్తి కింద పోయింది రూ.8,515 కోట్లు. నికరంగా చేసిన మాఫీ రూ.3,384 కోట్లు. మీరు అసలు కట్టిందే లేదు, మాఫీ చేసిందే లేదు" అని ధ్వజమెత్తారు. పదేళ్లలో వాళ్లు చేసిన రూ.27 వేల కోట్ల రుణ మాఫీలో మిత్తిని తీసేస్తే గుండు సున్నా అవుతుందని ఎద్దేవా చేశారు. "మేం రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పాం. ఏడాది కాలంలోనే 25,35,963 మంది రైతులకు రూ.20,616.89 కోట్లను మాఫీ చేశాం. కడుపు కట్టుకుని, ఇతర కార్యక్రమాలు ఆపి, రైతులపై మిత్తి పడకుండా, వెంటనే మాఫీని అమలు చేశాం. ఇది రైతుల పట్ల మేం చూపించిన ప్రేమ, ఆప్యాయత. మాది భావోద్వేగం. వాళ్లదంతా వ్యాపారమే" అని విమర్శించారు. రుణ మాఫీకి రూ.8 వేల కోట్లు కావాలని, అంత డబ్బు తమ వద్ద లేదని అప్పట్లో అన్నారని, కానీ, స్విస్ బ్యాంకుకు కూడా అప్పు ఇచ్చేంత శక్తి వాళ్లకుందని ఎద్దేవా చేశారు.

... కట్టింది కూలేశ్వరం

పదేళ్ల పాలనలో లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి కూలేశ్వరం కట్టారంటూ మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. "అప్పులపై సభలో ఇటీవల మేం శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టాం. దాని ప్రకారం.. రాష్ట్ర మార్కెట్ రుణాలు రూ.3,89,673 కోట్లు. ఎస్‌పీవీల కింద కార్పొరేషన్లకు గ్యారెంటీలు ఇచ్చి, ప్రభుత్వమే చెల్లించాల్సిన అప్పులు 1,29,243 కోట్లు. ప్రభుత్వ గ్యారెంటీతో కార్పొరేషన్లు తీసుకుని, ఆ సంస్థలే చెల్లించే రుణాలు రూ.95,462 కోట్లు. ఎలాంటి ప్రభుత్వ గ్యారెంటీలు లేకుండా కార్పొరేషన్లు తీసుకున్న రుణాలు రూ.59,414 కోట్లు. ఇలా మొత్తం రుణాలు రూ.6,71,757 కోట్లు. ఇక, సర్పంచులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లకు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్, సాగు నీటి ప్రాజెక్టుల బకాయిలన్నీ కలిపితే మరో రూ.40,154 కోట్లు. మొత్తం అప్పులు రూ.7,11,911 కోట్లు. తెలంగాణ వచ్చేనాటికి ఉన్న అప్పులు రూ.72 వేల కోట్లు; కార్పొరేషన్ల గ్యారెంటీ రుణాలు రూ.11 వేల కోట్లు! ఒక వ్యక్తి, ఒక పార్టీ, ఒక కుటుంబం తొమ్మిదిన్నరేళ్లపాటు పాలించి చేసిన అప్పు రూ.6.71 లక్షల కోట్లు. అప్పట్లో రూ.72 వేల కోట్లతో కాంగ్రెస్ పాలనలో నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్, కల్వకుర్తి, ఎస్ఆర్ఎస్పీ, వంటి ప్రాజెక్టులు, ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తే.. మిగులు రాష్ట్రాన్ని అప్పగించినా లక్షల కోట్లు అప్పు చేసి మీరు చేసిందేమిటంటే 'కూలేశ్వరం' కట్టడం" అని ఎద్దేవా చేశారు. ఇక, "మేమొచ్చిన 11 నెలల్లో రూ.1.27 లక్షల కోట్లు అప్పు చేశామని అంటున్నారు. వాళ్లు ఇచ్చిపోయిన అప్పు రూ.7,11,911 కోట్లు. మేం చేసిన అప్పు రూ.1,27,000 కోట్లు! మొత్తం కలిపితే.. రూ.8,38,911 కోట్లు ఉండాలి. కానీ.. ఈనెల 18నాటికి ఉన్న రాష్ట్ర అప్పు కేవలం రూ.7,22,788 కోట్లు. మిగతా రూ.1.20 లక్షల కోట్లు ఎక్కడికి పోయాయి?" అని ప్రశ్నించారు. అప్పులు తెచ్చి తాము గజ్వేల్‌లో, జన్వాడలో, మొయినాబాద్‌లో ఫామ్ హౌజ్‌లు కట్టుకోలేదని, ధరణిలో భూములను కబ్జా పెట్టలేదని మండిపడ్డారు. వాళ్ల పదేళ్ల పాలనలో 'బొచ్చెడు తప్పులు.. పుట్టెడు అప్పులు' అని ధ్వజమెత్తారు.

అడుగుదామని, కడుగుదామని ఎదురు చూశా..!

"పదేళ్లలో మీరు ప్రగతి భవన్, సచివాలయం, ఫామ్ హౌజ్, 33 జిల్లాల్లో పార్టీ ఆఫీసులు కట్టుకున్నారు. పేపర్లు, టీవీలు పెట్టుకున్నారు. కానీ, పేద పిల్లల కోసంఒక్క హాస్టల్ బిల్డింగు కట్టారా? బాత్‌రూమ్ కట్టారా? భవనాలు కట్టనందుకు సిగ్గుతో తల దించుకుని, ముక్కు నేలకు రాసి, క్షమాపణ చెప్పాలి. అందుకే మొహం చెల్లక ఆయన (కేసీఆర్) సభకు రావడం లేదు. వస్తే.. అడుగుదామని, కడిగేద్దామని సంవత్సరం నుంచి ఎదురు చూశా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కమీషన్ల కోసం తాము ఔటర్ రోడ్డును, కోకాపేటను అమ్మలేదని, పదేళ్లు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, తాకట్టు పెట్టి, బొందలగడ్డ చేసిన నువ్వా నాకు పరిపాలన గురించి చెప్పేదని విరుచుకుపడ్డారు. పోటీ పరీక్షలు సరిగా నిర్వహించలేని సన్నాసులు నాతో మాట్లాడతారా!? అని ధ్వజమెత్తారు.

ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇంత ద్రోహం చేయలేదు

తీవ్రంగా వెనకబడిన కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని తాను ప్రయత్నిస్తుంటే కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారని, అడ్డం పడుతున్నారని, ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇంత ద్రోహం చేయలేదని సీఎం రేవంత్ మండిపడ్డారు. "కొడంగల్ చాలా వెనకబడిన ప్రాంతం. దేవుడు నాకు అవకాశమివ్వడంతో మొన్న 14 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించారు. వారికి నా చర్మం ఒలిచి చెప్పులు కుట్టించినా తక్కువే. కొన్ని పరిశ్రమలు తెచ్చి, వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని అనుకున్నా. అక్కడ 1300 ఎకరాల భూమి సేకరించి, ఫార్మా విలేజ్‌ను పెట్టాలనుకున్నాం. కానీ.. నేను ఏం చేసినా తప్పు పడుతున్నారు. రూ.కోట్లు పంపించి, మద్యాన్ని తాగించి అధికారులపై దాడులు చేయించారు. వాళ్లను చంపే ప్రయత్నం చేసిన వీళ్లను ఏం చేయాలి? వీళ్లు అడ్డమొస్తే తొక్కుకుంటూ పోయి చేస్తా" అని తేల్చి చెప్పారు. పరిశ్రమలను తెస్తానంటే వద్దంటున్నారని, అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. తాను అయ్య పేరో, మామ పేరో చెప్పుకొని ఇక్కడికి రాలేదని, స్వశక్తితో కష్టపడి వచ్చానని, నల్లమల నుంచి వచ్చిన తనకు పులులు, సింహాలు, మృగాల నుంచి ఎలా బయట పడాలో తెలుసునని వ్యాఖ్యానించారు. "ఈ దుర్మార్గులను తెలంగాణ సమాజం క్షమిస్తుందా? ఈ ఆర్థిక ఉగ్రవాదులను ఎంత కాలం భరించాలి?" అని ప్రశ్నించారు.

కాళేశ్వరం కాదు.. కూలేశ్వరం!

- ఆ ప్రాజెక్టుతో ఒక్క ఎకరాకూ నీళ్లివ్వలేదు
- సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నిర్మించింది కాళేశ్వరం ప్రాజెక్టు కాదని, అది కూలేశ్వరమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధ్వజమెత్తారు. ఆ ప్రాజెక్టు నుంచి ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు. అసెంబ్లీలో శనివారం రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రకటించిన మేనిఫెస్టో నుంచి నీటిపారుదల ప్రాజెక్టులు, విద్యుత్తు అంశాలన్నీ మోసమేనని అన్నారు. 2001లో పార్టీని స్థాపించినప్పుడు రాష్ట్రానికి దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, లేదంటే తన మెడపై తల ఉండదని కేసీఆర్ ప్రగల్భాలు పలికారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్.. అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అని, అబద్ధాల చాంపియన్ అని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మెచ్చుకోవాల్సింది పోయి, ఆరోపణలు చేయడం తగదన్నారు. తమ మేనిఫెస్టో గురించి మాట్లాడాలంటే అబద్ధాల చాంపియన్‌ను సభకు రమ్మనండి.. ఆయనొస్తే మాట్లాడుదాం.. అంటూ చురకలు అంటించారు.

అప్పట్లో రుణ మాఫీ కాదు.. వడ్డీ మాఫీనే: సీతక్క



హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేసింది రుణమాఫీ కాదని, అది వడ్డీ మాఫీ మాత్రమే నని మంత్రి సీతక్క అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే రైతులకు బేడీలు వేశారని గుర్తుచేశారు. శాసనసభలో రైతు భరోసాపై చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో వరి వేస్తే ఉరి అన్న వారు, కౌలు రైతులకు పైసలు దండుగ అన్న వారు.. ఇప్పుడు సభలో ఆయా అంశాలపై ప్రశ్నించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో నిజంగానే రుణమాఫీ చేసి ఉంటే.. ఇంకా రూ.30వేల కోట్ల రుణ భారం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. కాగా, రైతుభరోసాను అర్హులైన వారికి అందించాలని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. రుణమాఫీలో ఇంకా 20-30% మేర పెండింగ్ ఉందని, దాన్నీ పూర్తి చేయాలన్నారు.

గతంలో ఒక్కప్రాజెక్టూ పూర్తి కాలేదు: జూపల్లి



హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసినా ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్న చం దంగా ప్రాజెక్టులు ఉన్నాయని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం శాసనసభలో రైతుభరోసాపై చర్చ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ పాలమూరును సస్యశ్యామలం చేశామన్న వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు సంబంధించి కేవలం ఒక్క పంపు మోటర్ స్విచ్ నొక్కి మొత్తం ప్రాజెక్టే అయిపోయిందని, జాతికి అంకితం చేస్తున్నామని ప్రకటించారని జూపల్లి విమర్శించారు.

శాసన మండలిలో 4 బిల్లులకు ఆమోదం

హైదరాబాద్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ శాసన మండలి నాలుగు బిల్లులకు ఆమోదం తెలిపింది. శనివారం తెలంగాణ పురపాలిక సవరణ బిల్లు, హైదరాబాద్ మహానగర పురపాలక కార్పొరేషన్ సవరణ బిల్లు, తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ బిల్లు, తెలంగాణ భూ భారతి -2024 బిల్లుకు మండలి ఆమోదం తెలిపింది. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆయా బిల్లులను సభలో ప్రవేశ పెట్టారు. చర్చ అనంతరం మండలి చైర్మన్ బిల్లులకు ఆమోదం తెలిపారు. రైతు భరోసాపై సభలో స్వల్ప కాలిక చర్చ జరగాల్సి ఉన్నా.. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సభ్యులు తమ సందేహాలు, ప్రశ్నల్ని లిఖిత పూర్వకంగా చైర్మన్ ద్వారా ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. సమాధానాల్ని లిఖితపూర్వకంగా అందజేస్తామన్నారు. అనంతరం మండలిని చైర్మన్ గుత్తా సుఖేందర్ నిరవధికంగా వాయిదా వేశారు.

ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్సీలను పిలవాలి

ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్సీలను తప్పనిసరిగా ఆహ్వానించాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ప్రొటోకాల్, శాసన నియమావళి ప్రకారం సభ్యుల్ని ఎందుకు ఆహ్వానించడం లేదని మండలి సమావేశంలో ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ఇతర కార్యక్రమాలకు తప్పనిసరిగా సభ్యుల్ని ఆహ్వానించేలా చర్యలు తీసుకోవాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబును ఆయన ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

హైడ్రాకు త్వరలోనే నిబంధనలు : శ్రీధర్ బాబు



హైడ్రాకు త్వరలోనే నిబంధనలు రూపొందిస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలపై ఆయన మాట్లాడారు. చెరువుల వద్ద ఎఫ్‌టీఎల్ పరిధి ఫిక్సింగ్‌పై దృష్టి సారించామని, ఇప్పటికే హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో 300లకుపైగా చెరువులకు ఎఫ్‌టీఎల్ ఫిక్స్ చేసినట్లు వివరించారు. కొత్త మునిసిపాలిటీలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాలు మునిసిపాల్టీల్లో విలీనమైన సందర్భంలో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని గ్రామాలన్నింటినీ జీహెచ్ఎంసీ పరిధిలో విలీనం చేయాలనే ప్రతిపాదన లేదని ఆయన తెలిపారు.

ప్రభుత్వం ధరణికి తూట్లు పొడుస్తోంది: కవిత

భూ భారతి బిల్లుపై చర్చ సందర్భంగా శాసన మండలిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ప్రభుత్వం ధరణికి తూట్లు పొడుస్తోందన్నారు. ధరణి ఒక సాఫ్ట్‌వేర్ మాత్రమేనని, సమస్యలుంటే అప్‌గ్రేడ్ చేసుకోవాలని సూచించారు. పల్లెలు ప్రశాంతంగా ఉండాలంటే ధరణి ఉండాలన్నారు. భూ భారతి భూ హారతికే దారి తీస్తుందని, భూ మాత భూ మేతగా మారుతుందని ఆమె ఆరోపించారు.

హోంగార్డుల వేతనం పెంచాలి: జీవన్ రెడ్డి

పోలీస్ శాఖలో కానిస్టేబుళ్లతో సమానంగా విధులు నిర్వహిస్తున్న హోంగార్డులకు సరైన గౌరవం, గుర్తింపు లభించడం లేదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. హోంగార్డుల రోజువారి వేతనాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హెల్త్ కార్డులు అందించాలని ఆయన కోరారు.

మూసీ నిర్వాసితులకు ఇళ్లు: మహేష్ కుమార్

గతంలో హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. హైడ్రాకు చట్టబద్ధత ఉందని, కొంత అవగాహన ఇవ్వాల్సి ఉందన్నారు. మూసీ నిర్వాసితులకు ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సీఎం రేవంత్‌కు స్పీకర్ సన్మానం

హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శీతాకాల సమావేశాలు ముగిసిన నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆయన చాంబర్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన చాంబర్‌కు వచ్చిన సీఎంను స్పీకర్.. శాలువా కప్పి సన్మానించారు. శాసనసభ సమావేశాలు విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, శాసనసభ్యులు, ఉన్నతాధికారులు, సిబ్బందికి ప్రసాద్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

బీఆర్ఎస్ఎల్పీలో కౌశిక్‌రెడ్డి పుట్టినరోజు వేడుక

అసెంబ్లీలోని బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పుట్టిన రోజు వేడుక జరిగింది. మాజీ మంత్రి కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డితో కేక్ కట్ చేయించి వేడుక నిర్వహించారు.

సాగు చేస్తేనే భరోసా

(మొదటిపేజీ తరువాయి)

చేసినా, చేయకపోయినా రైతుబంధు ఇచ్చారని తప్పుబట్టారు. శనివారం శాసనసభలో రైతుభరోసా పథకంపై ప్రభుత్వం స్వల్పకాలిక చర్చను చేపట్టింది. ఈ పథకంపై అన్ని పక్షాల అభిప్రాయాలను స్వీకరించింది. ఇప్పటిదాకా రైతు భరోసా అమలు జరిగిన తీరు, పీఎం కిసాన్ పథకం మార్గదర్శకాలు తదితర అంశాలపై ఒక పత్రాన్ని ప్రభుత్వం సభ ముందు ఉంచింది. సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నేత కేటీఆర్, బీజేపీ పక్ష ఉపనేత పాయల్ శంకర్, సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు, మజ్లిస్ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ తదితరులు ఈ పథకంపై తమ అభిప్రాయాలను తెలియజేశారు. కాగా, శాసనసభ్యులందరి అభిప్రాయాలను సేకరించి, వాటిని క్రోడీకరించి ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘానికి అందజేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. ఆ తర్వాత దీనిని మంత్రివర్గంలో చర్చించి, రైతు భరోసా విధి విధానాలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే పలు జిల్లాల్లో పర్యటించి.. రైతుల, సహకార సంఘాల అభిప్రాయాలు తీసుకుందని చెప్పారు. అయితే ఈ పథకాన్ని ఎవరికి అమలు చేయాలి? ఎవరికి అమలు చేయకూడదనే నిర్ణయాలు ఇప్పటిదాకా తీసుకోలేదన్నారు. ఏయే పథకంలో ఏయే మార్గదర్శకాలు ఉన్నాయనేది మాత్రమే సభ్యులకు వివరిస్తున్నామన్నారు.

సాగు చేయకున్నా రూ.21,283 కోట్ల సాయం..

రైతుబంధు పథకం 2018-19లో ప్రారంభమయిందని, గత ప్రభుత్వం తొలి ఏడాది ఎకరానికి రూ.4 వేలు ఇవ్వగా, 2019-20 నుంచి రూ.5 వేలకు పెంచిందని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. ఇప్పటిదాకా 12 సీజన్లకు కలిపి రూ.80,453.41 కోట్లను రైతుబంధు పథకం కింద రైతులకు ఇచ్చారని తెలిపారు. ధరణి పోర్టల్‌లో లభ్యమయ్యే భూమి రికార్డుల ఆధారంగా రైతులకు సాయాన్ని నిర్ణయించారని పేర్కొన్నారు. 2019-20లో 68.93 లక్షల ఎకరాల్లో పంట సాగు చేయకపోయినా రైతుబంధు కింద రూ.3446.04 కోట్లు చెల్లించారన్నారు. 2020-21లోనూ పంట సాగు చేయని 88.50 లక్షల ఎకరాలకు రూ.4425.29 కోట్లు, 2021-22లో 82.61 లక్షల ఎకరాలకు రూ.4130.69 కోట్లు, 2022-23లో 88.12 లక్షల ఎకరాలకు రూ.4406.02 కోట్లు, 2023-24లో 97.51 లక్షల ఎకరాలకు రూ.4875.62 కోట్లు చెల్లించారని వివరించారు. మొత్తంగా ఆరేళ్లలో పంటలు సాగు చేయని భూములకే రూ.21,283.66 కోట్లు రైతుబంధు కింద చెల్లించారని వెల్లడించారు. 2018 ఏప్రిల్ 4న జారీ చేసిన జీవో నెం.231 ప్రకారం.. భూమిని సాగు చేస్తేనే ప్రయోజనాలు కల్పించాలని స్పష్టంగా ఉందని, అయినా అమలులో వ్యత్యాసం కనిపిస్తోందని గుర్తు చేశారు. 2018-19లో సాగు చేసిన, సాగు చేయని భూములు మొత్తం 262.16 లక్షల ఎకరాలకు రెండు పంటకాలాలకు కలిపి రూ.10,486.36 కోట్లను రైతుబంధు కింద గత ప్రభుత్వం ఇచ్చిందని తుమ్మల తెలిపారు. ఆ తర్వాత 2019-20లో మొత్తం 210.64 లక్షల ఎకరాలకు రూ.10,532.02 కోట్లు, 2020-21లో 293.13 లక్షల ఎకరాలకు రూ.14,652.02 కోట్లు, 2021-22లో రూ.14,772.94 కోట్లు, 2022-23లో 294.88 లక్షల ఎకరాలకు రూ.14,743.02 కోట్లు, 2023-24లో 305 లక్షల ఎకరాలకు రూ.15,263.05 కోట్లు ఇచ్చారని మంత్రి తుమ్మల వివరించారు. మొత్తంగా 12 సీజన్లకు కలిపి రూ.80,453.41 కోట్లు ఇచ్చారని చెప్పారు. అటవీ హక్కుల రక్షణ చట్టం (ఆర్‌వోఎఫ్ఆర్) పట్టాలు ఉన్న రైతులకు కోత పెడతామని తాము చెప్ప



లేదన్నారు. 2023-24లో రైతు భరోసా కింద తాము ఒకేరోజు రూ.7628 కోట్లను రైతుల ఖాతాల్లో వేశామన్నారు.

పీఎం కిసాన్‌కు అర్హులు వీరే..

పీఎం కిసాన్ పథకం మార్గదర్శకాలనూ శాసనసభలో మంత్రి తుమ్మల వివరించారు. ఈ పథకం కింద ప్రతి రైతు కుటుంబానికీ రూ.6 వేల సహాయాన్ని మూడు విడతలుగా అందించారని తెలిపారు. కుటుంబం అంటే తండ్రి లేదా తల్లి, మైనర్ పిల్లలుగా నిర్వచించారన్నారు. 2019 ఫిబ్రవరి 1 నాటికి భూమి యాజమానిగా ఉన్న రైతుకే పీఎం కిసాన్ అమలవుతుందని చెప్పారు. ప్రజాప్రతినిధులు. ప్రభుత్వ ఉద్యోగులు (జీతాలు పొందేవారు , పెన్షనర్లు) పీఎం కిసాన్ పథకాన్ని అర్హులు కాదన్నారు. వీరే కాకుండా ఆదాయపు పన్ను చెల్లింపుదారులు (గత ఐదేళ్ల నుంచి కనీసం మూడేళ్లలో వరుసగా రెండేళ్లపాటు పన్ను చెల్లింపుదారులుగా ఉన్న వారంతా), వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్ట్‌లు, నిపుణులు కూడా ఈ పథకానికి అర్హులు కాదని మంత్రి పేర్కొన్నారు.

రైతు భరోసాపై సలహాలివ్వండి

- వర్షాకాలం నుంచి పంటల బీమా
- శాసనసభలో మంత్రి తుమ్మల

హైదరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతు భరోసా విధి విధానాలపై ఎమ్మెల్యేలు ఇంకా సూచనలు, సలహాలు ఇవ్వవచ్చని, మార్గదర్శకాలు రూపొందించే క్రమంలో వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు భరోసా విధివిధానాలపై శనివారం శాసనసభలో స్వల్పకాలిక చర్చ జరిగింది. అధికార, విపక్షాలకు సంబంధించిన సభ్యులంతా తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సభ ముగిసినా ఈ విషయంలో ఇంకా ఏమైనా సలహాలు ఇవ్వాలనుకుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సంక్రాంతి నుంచి రైతుభరోసా ఇస్తామన్నారు. వచ్చే వర్షాకాలం నుంచే పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన సబ్సిడీలు, వ్యవసాయ యాంత్రికీకరణను తిరిగి పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. రైతు భరోసాను 15 ఎకరాల వరకే పరిమితం చేస్తే బాగుంటుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. గత సర్కారు హయాంలో సాగు చేయని 45 లక్షల ఎకరాలకు రైతుబంధు ఇచ్చారని ఆయన విమర్శించారు. కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇవ్వాలని సూచించారు.

ఎగ్గొట్టే ప్రయత్నం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయని, వీరిలో రైతులు కూడా ఉన్నారని చెప్పారు. రైతుల పిల్లల్లో కొందరు ఉద్యోగం చేస్తున్నవారు ఉన్నారని, అలాంటి రైతులకూ రైతుభరోసా ఇవ్వబోమంటే ఎలా అని ప్రశ్నించారు. శనివారం శాసనసభలో రైతు భరోసా పథకంపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా, అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడారు. రైతుబంధు (రైతు భరోసా)ను అవమానిస్తున్నారని, ఈ పథకం ఉసురు తీయొద్దని విజ్ఞప్తి చేశారు. రైతు భరోసా విదివిధానాలను ఖరారు చేసేందుకు నియవిుంచిన మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదికను సభలో ప్రవేశపెట్టి అందరికీ వివరించాలన్నారు.



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగా రుణమాఫీ అందరికీ వర్తించలేదన్నారు. సిరిసిల్ల, పాలేరు, కొండారెడ్డిపల్లెతో పాటు రాష్ట్రంలోని ఏ ఊరిలోనూ వందశాతం రుణ మాఫీ జరగలేదని పేర్కొన్నారు. ఏ గ్రామంలోనైనా వందశాతం రుణమాఫీ అయినట్టు చూపించినా, 24 గంటల కరెంట్ ఇస్తున్నట్లు నిరూపించినా తనతో పాటు బీఆర్ఎస్ సభ్యులమంతా రాజీనామా చేస్తామని సవాల్ విసిరారు. సీఎం రేవంత్ దేవుడు కాదు.. పచ్చి దొంగ అని, ఓటుకు నోటు కేసులో చిక్కిన దొంగ అని ఘాటుగా విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో పాలమూరును సస్యశ్యామలం చేశామని, రైతులకు ఉచితంగా సాగు నీటిని అందించామని చెప్పారు. లక్షల కోట్లతో ప్రాజెక్టులు నిర్మించినా రైతులపై భారం వేయలేదన్నారు. గతంలో సాగు చేసినా.. చేయకపోయినా భూములన్నింటికీ రైతుబంధు పథకాన్ని అమలు చేయడం వల్లే 141 లక్షల ఎకరాల నుంచి 2.06 కోట్ల ఎకరాలకు సాగు పెరిగిందని చెప్పారు. 4.5 లక్షల ఎకరాల పోడు పట్టాలకూ రైతుబంధు అమలు చేశామని, గిరిజనులు ఒకే పంట పండిస్తారని, అయితే ఒక పంటకే రైతు భరోసా ఇస్తారా..? లేక రెండో పంటకూ ఇస్తారా..? లేదా..? చెప్పాలన్నారు. పత్తి కూడా 8 నెలల పంట, కంది 7-8 నెలల పంట అని, ఇక్కడా ఒకే పంటకు రైతు భరోసా ఇస్తారా..? రెండో పంటకూ ఇస్తారా...? లేదా చెప్పాలని డిమాండ్ చేశారు. పామాయిల్, మావిడి పంటల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పడే నాటికి దేశంలోనే తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు 11.1 శాతం ఉంటే దాన్ని 1.57 శాతానికి తగ్గించామని, ఈ ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వాని దేనన్నారు. వాస్తవాలను గ్రహించకుండా చిల్లర మాటలు మాట్లాడుతున్నారని, సీఎం రేవంత్ మానసిక పరిస్థితి సరిగా లేదని, ఆయన్ను కాపాడుకునేందుకు కుటుంబ సభ్యులు ఎర్రగడ్డలో చేర్పించి వైద్యం చేయించాలని సూచించారు. రేవంత్ రెడ్డి ఎన్ని కేసులు పెట్టినా భయపడబోమని, ఈడీ, మోడీ, ఎవడికీ భయపడేది లేదన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసే వరకు కాంగ్రెస్‌ను వదిలేది లేదని, రేవంత్ రెడ్డిని, ఆ పార్టీని నీడలా వెంటాడుతూనే ఉంటామని చెప్పారు. ఓ క్రమంలో రేవంత్‌రెడ్డి అంటూ ఏకవచనంతో కేటీఆర్ పలకగా.. సభా నాయకుడిని ఏకవచనంతో పిలవడం సహేతుకం కాదని స్పీకర్ స్పష్టం చేశారు. అయితే గౌరవం అనేది ఇచ్చిపుచ్చుకునే దాన్ని బట్టి ఉంటుందని కేటీఆర్ బదులిచ్చారు.

ఆర్థిక సాయం కోసం కౌలు రైతుల ఎదురుచూపు

రాష్ట్రంలో దాదాపు 22 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, వారందరూ కాంగ్రెస్ ఇస్తామని చెప్పిన ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి-2024 చట్టంలో అనుభవదారు కాలమ్‌ను తీసుకొచ్చారని, దాని ద్వారా కౌలు రైతుల లెక్కలు తెలుస్తాయని, వాటి ప్రకారం వారందరికీ సాయం అందించాలని కోరారు. రైతులకు సర్కార్ ప్రకటించిన బోనస్ బోగస్‌గా మారిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదికే రైతులకు బేడీలు వేశారని విమర్శించారు. ఈ సందర్భంగా ప్రజా గాయకుడు గద్దర్‌ను గుర్తుచేశారు. ఆయన బతికుంటే ఇప్పటి పరిస్థితిని చూసి చాలా బాధపడేవారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా బడా వ్యాపారులకు కొమ్ముగాస్తున్నదని కేటీఆర్ ఆరోపించారు. బ్యాంకులను మోసం చేసిన వారినీ కాపాడుతోందని విమర్శించారు. అనంతరం కేటీఆర్ ప్రసంగంపై స్పీకర్ కలుగజేసుకుంటూ.. 'ఇది రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చ.. దానిపైనే మాట్లాడాలి' అని సూచించగా.. అవసరమైతే సభను పొడిగించండంటూ కేటీఆర్ అన్నారు. ఇదే అంశంపై స్పందించిన బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. వారికి వారమే సమయం ఉందంటా.. అందుకే వారం సభను నడపాలని కోరుతున్నారంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

కోమటిరెడ్డి మాటలను రికార్డుల నుంచి తొలగించాలి: హరీశ్

బీఆర్ఎస్ హయాంలో మిషన్ భగీరథ ప్రాజెక్టుకు రూ.50 వేల కోట్లు కాదు.. రూ.28 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి కోమటిరెడ్డి మాట్లాడిన మాటలను రికార్డుల నుంచి తొలగించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్ రావు కోరారు. 'సభ అయిపోయిన తర్వాత తుంగతుర్తి, సూర్యాపేటకు పోదాం.. 2 లక్షల ఎకరాలకు కాళేశ్వరం నుంచి నీళ్లు ఇచ్చామో లేదో చూపిస్తా.. నల్లగొండ జిల్లాకు మూడు మెడికల్ కాలేజీలు ఇచ్చాం. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను మంజూరు చేశాం' అని ఆయన చెప్పారు.


రష్యాపై 9/11 తరహా దాడులు

» 8 డ్రోన్లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్



కజాన్, డిసెంబరు 21: రష్యాపై ఉక్రెయిన్ మరోసారి డ్రోన్లతో విరుచుకుపడింది. కజాన్ నగరంలోని నివాస భవనాలే లక్ష్యంగా దాడులు జరిపింది. ఎత్తైన నివాస సముదాయాలపై 8 డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి చేసినట్లు గుర్తించామని అంతర్జాతీయ మీడియా సంస్థలు శనివారం తెలిపాయి. ఈ దాడులను 2001లో న్యూయార్క్ నగరంలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ టవర్లను విమానాలు ఢీకొట్టిన 9/11 దాడులతో పోల్చాయి. శనివారం ఉదయం కజాన్ నగరంలోని నివాస సముదాయాల్లోకి 2 డ్రోన్లు దూసుకెళ్లి పేలిపోవడంతో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలయ్యింది. అలాగే ఉక్రెయిన్ ప్రయోగించిన మరో 6 డ్రోన్లను రష్యా గగనతల రక్షణ వ్యవస్థలు అత్యంత సమర్థంగా అడ్డుకున్నట్లు తెలిపింది. ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

జస్టిస్ లోకూర్‌కు ఐరాస పదవి



ఐక్యరాజ్యసమితి, డిసెంబరు 21: సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకూర్‌కు ఐక్యరాజ్యసమితి పదవి వరించింది. ఆయన ఐరాస అంతర్గత న్యాయ మండలి (ఇంటర్నల్ జస్టిస్ కౌన్సిల్-ఐజేసీ) చైర్మన్‌గా నియమితులయ్యారు. ఐరాస న్యాయవ్యవస్థ స్వతంత్రత, వృత్తి నైపుణ్యం, జవాబుదారీతనంతో పనిచేసేలా చూడడం ఈ కౌన్సిల్ లక్ష్యం. ఐరాస పరిధిలోని ట్రిబ్యునళ్ల జడ్జీలను ఎంపిక చేయడం కూడా దీని బాధ్యత. జస్టిస్ లోకుర్ ఈ పదవిలో నాలుగేళ్ల పాటు అంటే 2028 నవంబరు 12వ తేదీ వరకు కొనసాగనున్నారు.

జర్మనీలో సైకియాట్రిస్ట్ దుర్మార్గం

» కారుతో క్రిస్మస్ మార్కెట్‌పైకి దూసుకెళ్లిన డాక్టర్

» ఐదుగురి మృతి..200 మందికి గాయాలు

మగ్డేబర్గ్, డిసెంబరు 21: జర్మనీలో ఓ సైకియాట్రిస్ట్ సైకోగా మారాడు. క్రిస్మస్ సందర్భంగా మగ్డేబర్గ్ మార్కెట్లో షాపింగ్ చేస్తున్న పౌరులపైకి విచక్షణారహితంగా.. అతి వేగంతో కారుతో దూసుకెళ్లాడు. సుమారు 400 మీటర్ల దూరం వరకు అతని అరాచకం కొనసాగింది. ఈ ఘటనలో ఒక చిన్నారి సహా.. ఐదుగురు పౌరులు మృతిచెందారు. 200 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో పది మంది పరిస్థితి విషమంగా ఉంది. శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. ఘటనాస్థలిలోనే నిందితుడిని అరెస్టు చేశారు. అతడిని సౌదీ అరేబియాకు చెందిన తాలెబ్.ఎ.బెర్లిన్ అనే 50 ఏళ్ల వయసున్న సైకియాట్రిస్ట్/సైకోథెరపిస్ట్‌గా గుర్తించారు.

ప్రపంచానికే నైపుణ్య రాజధాని భారత్!

కువైత్‌లో ప్రవాసభారతీయులతో మోదీ.. నేడు ఆ దేశ రాజు, ప్రధానితో సమావేశం

కువైత్ సిటీ, డిసెంబరు 21: భారతీయుల శ్రమశక్తి, నైపుణ్యాలు నవ కువైత్ నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడతాయని.. ప్రపంచానికే నైపుణ్య రాజధాని అయ్యే సత్తా భారత్‌కు ఉందని ప్రధాని మోదీ అన్నారు. రానున్న కొన్ని దశాబ్దాలపాటు ప్రపంచంలోనే అత్యంత యువ దేశంగా భారత్ ఉంటుందని పేర్కొన్నారు. కువైత్ రాజు షేక్ మిషాల్ అల్ అహ్మద్ అల్ జబేర్ అల్ సబహ్ ఆహ్వానం మేరకు రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం కువైత్‌కు చేరుకున్న ప్రధాని.. ఇక్కడి షేక్ సాద్ అల్ అబ్దుల్లా ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రవాస భారతీయులతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. "మీరందరూ భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చారు. మిమ్మల్ని ఇలా చూస్తుంటే ఇక్కడ మినీ భారతదేశమే ఉన్నట్టుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. "ఏటా భారతదేశం నుంచి కువైత్‌కు వస్తున్న వందలాది మంది భారతీయులు కువైత్ సమాజానికి భారతీయ ఆత్మను జోడిస్తారు. కువైత్ కాన్వాస్‌ను.. భారతీయ నైపుణ్యాలు, ప్రతిభతో నింపేస్తారు" అని మోదీ కొనియాడారు. నలభైమూడేళ్ల క్రితం.. 1981లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ తర్వాత.. ఒక భారత ప్రధాని కువైత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఆ విషయాన్ని కూడా మోదీ ప్రస్తావించారు. "ఇక్కడి నుంచి ఇండియాకు రావడానికి మీకు పట్టేది నాలుగు గంటలే. కానీ.. ఒక భారత ప్రధాని కువైత్‌కు రావడానికి నాలుగు దశాబ్దాలు పట్టింది" అని పేర్కొన్నారు.

హండాతో మోదీ కరచాలనం



మాటకు కట్టుబడి..

'ఎక్స్' వేదికగా తాను ఇచ్చిన మాట ప్రకారం ఇండియన్ ఫారిన్ సర్వీస్ మాజీ అధికారి, 101 సంవత్సరాల వయోవృద్ధుడు అయిన మంగళ్ సెయిన్ హండాను మోదీ ప్రత్యేకంగా కలిసి మాట్లాడారు. తన తాత మంగళ్ హండా ప్రధాని వీరాభిమాని అని.. కువైత్ పర్యటనకు వచ్చినప్పుడు ఆయన్ను కలిసి మాట్లాడాలని హండా మనవరాలు శ్రేయ జునేజా 'ఎక్స్' వేదికగా ప్రధానికి విజ్ఞప్తి చేశారు. తప్పకుండా కలుస్తానని మోదీ ఎక్స్‌లోనే ఆమెకు సమాధానమిచ్చారు. నిజానికి మంగళ్ హండా 100వ పుట్టినరోజు సందర్భంగానే ప్రధాని మోదీ ఆయనకు వ్యక్తిగత లేఖ ద్వారా గతంలో శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పుడు ప్రధాని వ్యక్తిగతంగా తనను కలవడంతో ఎంతగానో సంతోషించారు. కాగా.. ప్రధాని మోదీ ఆదివారంనాడు కువైత్ రాజును, ప్రధానమంత్రిని కలవనున్నారు.

మోదీకి సాదర స్వాగతం

రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత ప్రధాని మోదీ శనివారం కువైత్ చేరుకున్నారు. కువైత్ రాజు ఆహ్వానం మేరకు అక్కడకు చేరుకున్న మోదీకి ఆ దేశ ఉప ప్రధాని షేక్ ఫహాద్ యూసుఫ్ సౌద్ అల్ సబహ్ విమానాశ్రయంలో సాదరంగా స్వాగతం పలికారు. అక్కడకు చేరుకున్న అనంతరం ప్రధాని 'సలామ్ మోదీ' కార్యక్రమంలో భాగంగా మొదట ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. ఓ వైపు ప్రవాస భారతీయులంతా చప్పట్లు, వందేమాతరం నినాదాలతో హోరెత్తిస్తుండగా అక్కడున్న వారందరినీ మోదీ పలకరించారు. రామాయణం, మహాభారతాలను అరబిక్‌లోకి అనువదించిన అబ్దుల్లా అల్ బెరూన్, ఈ ఇతిహాసాలను అరబిక్‌లో ప్రచురించిన అబ్దుల్ లతీఫ్ అల్ నెసెఫ్‌లను మోదీ పలకరించారు. ఈ పర్యటనలో అరేబియన్ గల్ఫ్ కప్ ఫుట్ బాల్ ప్రారంభ పోటీలకు మోదీ హాజరయ్యే అవకాశం ఉంది. మరోవైపు డిసెంబరు 1 అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా ప్రజలందరూ ధ్యానాన్ని తమ జీవితంలో ఓ భాగం చేసుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. గుజరాత్‌లోని రన్ ఆఫ్ కచ్‌లో జరుగుతున్న 'రన్ ఉత్సవ్'లో పాలుపంచుకోవాల్సిందిగా మోదీ అందరికీ ఆహ్వానం పలికారు.

ఎన్నికల వీడియోలు ఎవరికీ ఇవ్వొద్దు

ఎలక్షన్ రూల్స్‌కు కేంద్రం సవరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 21: ఎన్నికల ప్రక్రియపై మరో వివాదం నెలకొంది. ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ సమాచారం ఎవరికీ ఇవ్వాల్సిన పనిలేదంటూ కేంద్రం నిబంధనలు సడలించడంపై విమర్శలు వస్తున్నాయి. హరియాణా ఎన్నికలపై కోర్టుల్లో పలు వ్యాజ్యాలు దాఖలవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకొంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎలక్ట్రానిక్ సమాచారమైన సీసీటీవీ ఫుటేజీ, అభ్యర్థుల వీడియో రికార్డులను ప్రజల తనిఖీ నిమిత్తం ఇవ్వాల్సిన పనిలేదని కేంద్రం తెలిపింది. ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 92(3)(ఏ)లో "ఎన్నికలకు సంబంధించిన ఇతర పత్రాలన్నీ ప్రజల తనిఖీ నిమిత్తం అందుబాటులో ఉంచాలి" అని ఉంది. కేంద్ర న్యాయ శాఖ శుక్రవారం ఈ నిబంధనలో సవరణ చేసింది. "ఎన్నికలకు సంబంధించి ఈ నిబంధనల్లో ప్రత్యేకంగా పేర్కొన్న పత్రాలను మాత్రమే ప్రజల తనిఖీ నిమిత్తం అందుబాటులో ఉంచాలి" అని పేర్కొంది. 'అన్ని పత్రాలు' అన్న మాటలకు బదులుగా 'ఈ రూల్స్‌లో పేర్కొన్న పత్రాలు' అన్న సవరణ చేసింది. అంటే ఆ నిబంధనల్లో సీసీటీవీ ఫుటేజీ, వీడియోలు వంటి ప్రస్తావనలు లేకపోవడంతో వాటిని ఇవ్వాల్సిన పనిలేదు. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకే ఈ నిర్ణయం తీసుకొంది. ఎలక్ట్రానిక్ సమాచారం దుర్వినియోగమవుతున్నందువల్లనే ఈ సిఫార్సు చేసినట్టు ఈసీ అధికారి ఒకరు చెప్పారు. అయితే, "నిబంధనలను సవరించినప్పటికీ పోటీ చేసిన అభ్యర్థులకు మొత్తం సమాచారం అందుబాటులో ఉంటుంది. ఎవరైనా కోర్టును ఆశ్రయించి ఎలక్ట్రానిక్ సమాచారం పొందవచ్చు" అని ఆయన వివరించారు. హరియాణా ఎన్నికలకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీ, వీడియోలు కావాలని న్యాయవాది మెహమూద్ ప్రాచా అక్కడి హైకోర్టును ఆశ్రయించగా అందుకు అనుకూలంగా ఆదేశాలిచ్చింది. వాటిని అడ్డుకునేందుకే ఈ రూల్స్‌ను సడలించారన్న విమర్శలు వస్తున్నాయి.



చంద్రయాగప్ప కుటుంబం (ఫైల్)

కారుపై పడ్డ కంటెయినర్

» బెంగళూరులో ఘోర రోడ్డు ప్రమాదం

» ఇద్దరు పిల్లలు సహా ఆరుగురి మృతి

బెంగళూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బెంగళూరు శివారులో రోడ్డుపై వెళుతున్న కారుపై ఎదురుగా వస్తూ అదుపుతప్పిన కంటెయినర్ పడటంతో ఓ కుటుంబంలోని మొత్తం ఆరుగురు అక్కడికక్కడే కన్నుమూశారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో జరిగింది. ముందు వెళుతున్న కారు ఒక్కసారిగా ఆగడంతో దాన్ని తప్పించబోయిన కంటెయినర్.. డివైడర్ ఎక్కి పక్కరోడ్డుపైకి వెళ్లింది. ఎదురుగా వస్తున్న మరో కంటెయినర్‌ను తప్పించే క్రమంలో అది అటుగా వస్తున్న కారుపై పడింది. దీంతో కారులో ఉన్న ఐఏఎస్‌టీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కంపెనీ సీఈఓ చంద్ర యాగపగోళ్ (48), ఆయన భార్య గౌరాబాయి (42), కుమారుడు ధ్యాన్ (16), కూతుళ్లు దీక్ష (12), ఆర్య(8), సోదరుడి భార్య (36) మృతి చెందారు. మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా మొరబగి గ్రామానికి చెందిన చంద్ర యాగపగోళ్ బెంగళూరు హెచ్‌ఎస్ఆర్ లే అవుట్‌లో నివాసం ఉంటున్నారు.

హుండీలో ఫోన్ పడిందా..కృష్ణార్పణమే!

» దేవుని ఖాతాకే అంటున్న అధికారులు

చెన్నై, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'పొరబాటైనా, ఏమరపాటైనా రూల్ రూలే...దేవుడి హుండీలో సెల్‌ఫోన్ దేవుడిదే..మీది కాదు' అంటుండడంతో ఓ భక్తునికి గొప్ప చిక్కొచ్చి పడింది. చెన్నై అంబత్తూరుకు చెందిన దినేష్ తన కుటుంబంతో గత ఆగస్టు మాసంలో చెంగల్పట్టు జిల్లా తిరుప్పోరూర్‌లో ఉన్న కందస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆ సమయంలో ఆయన జేబులో ఉన్న ఖరీదైన ఐ ఫోన్ దేవాలయం హుండీలో పడిపోయింది. దీనిపై ఆలయ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. కాగా, గురువారం హుండీని లెక్కించిన అధికారులు.. ఆ ఫోన్‌ను ఇచ్చేది లేదని, అది ఇక దేవుడికే సొంతమంటూ తేల్చిచెప్పారు. హుండీలో పడినది దేవునికే చెందడం ఆలయ ఆచారమని, తిరిగి ఇవ్వాలని భక్తులు కోరడాన్ని నిబంధనలు అనుమతించవన్నారు.

అంబేడ్కర్‌పై షా వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ దేశవ్యాప్త ఉద్యమం

న్యూఢిల్లీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధమైంది. ఈ మేరకు దశలవారీగా ఆందోళనలు, నిరసనలు చేపట్టాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన సర్క్యులర్‌ను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం విడుదల చేశారు. అంబేద్కర్‌ను అవమానించినందుకు అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిరసనలు తెలపాలని అందులో పిలుపునిచ్చారు. ఈ నెల 22, 23 తేదీల్లో అమిత్ షా తీరును మీడియా సమావేశాల ద్వారా ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. 24న అన్ని జిల్లాల్లో అంబేద్కర్ సమ్మాన్ మార్చ్‌లు నిర్వహించాలని సూచించారు. ప్రతి జిల్లాలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలన్నారు. చివరి దశలో రాష్ట్రపతికి మెమోరాండం అందిస్తామని తెలిపారు.

టోల్ రుసుము శాశ్వతం కాదు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్జించడానికి కాదని తెలిపింది. ప్రజానీకంపై భారం మోపుతూ అన్యాయంగా ఇతరులకు లాభాలు వచ్చేలా సహకరిస్తామంటే అనుమతించబోమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం శుక్రవారం వెలువరించిన తీర్పులో తెలిపింది. ఢిల్లీ-నోయిడా డైరెక్ట్ (డీఎన్‌డీ) ఫ్లై వేపై టోల్ రుసుము వసూలు విషయమై కుదిరిన 'రాయితీ ఒప్పందాన్ని' 2016లో అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ నోయిడా టోల్ బ్రిడ్జి కంపెనీ (ఎన్‌టీబీసీ) సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. విచారణ జరిపిన ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థించింది. అసలు రాయతీ ఒప్పందమే లోపభూయిష్టంగా ఉందని తెలిపింది. "ఉత్తమ నిబంధన ఏమిటంటే.. ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకునే విధానాలు, నిబంధనలను ప్రభుత్వం రూపొందించాలి. అవి నిజంగా ప్రజలకు ప్రయోజనం కలిగించాలి. వాటి ద్వారా ఎవరూ అనుచిత లబ్ధి పొందకూడదు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, నోయిడాలు కలిసి ఎన్‌బీసీఎల్‌తో కలిసి కుదుర్చుకున్న రాయితీ ఒప్పందం అనైతికం, అన్యాయం, రాజ్యాంగానికి వ్యతిరేకమ"ని తెలిపింది. "అవసరమైన ప్రజా మౌలిక సదుపాయాలను కల్పించిందన్న కారణంతో ప్రజలు వందలాది కోట్ల రూపాయలు ఎన్‌టీబీసీఎల్, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంస్థలకు చెల్లించేలా చేశారు. రుసుము రూపంలో ఆ ఫ్లై వేకు అయిన ఖర్చును ఎన్‌టీబీసీఎల్ తిరిగి వసూలు చేసుకుంది. లాభాలు కూడా ఆర్జించింది. అందువల్ల ఇంకా ఫీజు/టోల్ వసూలు చేయకుండా హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంలో తప్పేమీ లేదు" అని పేర్కొంది. రాయితీ ఒప్పందంలోని 14వ ఆర్టికల్‌లో..టోల్‌ను శాశ్వత ప్రాతిపదికన వసూలు చేసుకోవచ్చన్న అర్థం వస్తుండడంతో దాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ విషయంలో కూడా హైకోర్టు నిర్ణయంతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. ప్రాజెక్టు వ్యయాన్ని అంచనా వేయడంలోనే అన్యాయం జరిగిందని భావించిన ధర్మాసనం రాయితీ ఒప్పందంలోని లోపాలను ఎత్తి చూపింది. 'మొత్తం ప్రాజెక్టు వ్యయం' మదింపు కోసం అనుసరించిన సూత్రమే తప్పుడు విధానమని తెలిపింది. ఎంపిక చేసిన కొంతమందిని ధనవంతులుగా మార్చేందుకు అన్యాయంగా రూపొందించిన విధానమని పేర్కొంది. "ప్రజాప్రయోజనం అత్యధికంగా ఉండే ప్రాజెక్టులు చేపట్టే సమయంలో న్యాయమైన, పారదర్శకతతో కూడిన స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలి. ఈ కేసులో ప్రభుత్వం అలాంటి ప్రయత్నం చేసినట్టు కనిపించలేదు. టెండర్ల జారీ, పోటీదార్ల నుంచి కాంపిటీటివ్ బిడ్స్ ఆహ్వానించడంలో ఎలాంటి చొరవ చూపించలేదు. కొంతమంది సీనియర్ అధికారులు తమ స్వీయ ప్రయోజనాల కోసం ప్రాజెక్టు నిధులను మళ్లించారు. ఇది అవినీతి నిరోధక చట్టం కింద దర్యాప్తు జరిపేందుకు తగిన కేసే" అని అభిప్రాయపడింది.

క్రెడిట్ కార్డు బకాయిలకు భారీ వడ్డీ చెల్లించాల్సిందే

సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ, డిసెంబరు 21: క్రెడిట్ కార్డుల వినియోగదారులకు ఇది దుర్వార్తే! బకాయిలపై భారీగా వడ్డీ చెల్లించక తప్పదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. క్రెడిట్ కార్డుల బకాయిలు ఉంటే గతంలో బ్యాంకులు 35% నుంచి 50% వరకు వడ్డీ వసూలు చేసేవి. దీనిని సవాలు చేస్తూ ఆవాజ్ ఫౌండేషన్ దాఖలు చేసిన కేసులో జాతీయ వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ తీర్పు ఇస్తూ ఇంత శాతం వడ్డీ మరీ ఎక్కువని, అన్యాయమని అభిప్రాయపడింది. వడ్డీ 30 శాతానికి మించకూడదని పరిమితి విధించింది. దీనిపై బ్యాంకులు సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేశాయి. శుక్రవారం ధర్మాసనం తీర్పు ఇస్తూ ఫోరం ఆదేశాలను కొట్టివేసింది. 30 శాతం పరిమితిని ఎత్తివేసింది. బ్యాంకులు తమ నిర్ణయం మేరకు 30 శాతానికి మించి వడ్డీ రేటు విధించేందుకు అవకాశం కల్పించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.